T.T.D. Religious Publications Series No.
Price :

Published by **Sri L.V. Subrahmanyam,** I.A.S., Executive Officer,
T.T.Devasthanams, Tirupati and Printed at T.T.D. Press, Tirupati.

# శ్రీవచన సౌరభం

–కోరుకొండ భట్టర్ రామానుజ భట్టర్



**తిరుమల తిరుపతి దేవస్థానములు,**

**తిరుపతి.**

# శ్రీవచన సౌరభం

తమిళమూలం

శ్రీ పిళ్ళై లోకాచార్యులు

తెలుగుసేత

కోరుకొండ భట్టర్ రామానుజ భట్టర్

ప్రచురణ

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

**2012**

# Srivachana Sourabham

**By**
**Korukonda Bhattar Ramanuja Bhattar**

© All Rights Reserved
T.T.D. Religious Publications Series No:

*T.T.D First Edition:- 2012*

Copies:1000

*Published by :*
**L.V. SUBRAHMANYAM**, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati - 517501

***D.T.P:***
Editor- in- Chief Office,
T.T.D, Tirupati.

*Printed at :*
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati - 517501.


## ముందుమాట

తమిళభాషలో శ్రీవైష్ణవాచార్యులు పిళ్లైలోకాచార్య స్వామివారు రచించిన 'శ్రీవచన భూషణం' అనే సుప్రసిద్ధ గ్రంథాన్ని కందాడై శేషాచార్యులు, శ్రీభాష్యం అప్పలాచార్యులు వంటి మహామహులు, మహా విద్వాంసు లెందరో ఆంధ్రీకరించి ఉన్నారు.

అంతటి సుప్రసిద్ధమైన శ్రీవచన భూషణం ఆధారంగా శ్రీ కోరుకొండ భట్టర్ రామానుజభట్టరువారు రచించిన శ్రీవచన సౌరభం తిరుమల తిరుపతి దేవస్థానములు స్వీయ ప్రచురణగా ప్రచురిస్తున్నందుకు ఎంతో సంతోషంగా ఉంది.

ఈ పుస్తకంలో పురుషకారవైభవం, ఉపాయవైభవం, ప్రపత్తి స్వరూపం, ప్రపన్నులు: వారి లక్షణాలు, ప్రపన్నుని దినచర్య, భగవత్కైంకర్యం, భగవదపచారం, భాగవతాపచారం, ఆత్మస్వరూపం, అర్చావతార వైశిష్ట్యం, సచ్ఛిష్యలక్షణాలు, ఆచార్య ప్రాశస్త్యం, సదాచార్య లక్షణాలు ఇత్యాది పలువిషయాలు సమగ్రంగా వివరించబడ్డాయి. అతి సరళమైన సుందర శైలిలో రచితమైన ఈ "శ్రీవచన సౌరభం" పాఠకుల ప్రీతికి పాత్రం కాగలదని మా విశ్వాసం.

సదా శ్రీవారి సేవలో....



కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి.

# విషయసూచిక


| విషయము | పుట |
|---|---|
| 1. పురుషకారవైభవము | 1 |
| 2. ఉపాయవైభవము | 9 |
| 3. ప్రపత్తి స్వరూపము | 15 |
| 4. ప్రపన్నులు – వారి లక్షణములు | 20 |
| 5. ప్రపన్నుని దినచర్య | 27 |
| 6. భగవత్ కైంకర్యము | 33 |
| 7. భగవదపచారము | 36 |
| 8. భాగవత సంబంధము | 39 |
| 9. భాగవతాపచారము | 44 |
| 10. ఆత్మస్వరూపము | 50 |
| 11. అర్చావతార వైశిష్ట్యము | 53 |
| 12. మంగళాశాసనము | 59 |
| 13. భగవన్నిర్హేతుక కృపాప్రభావము | 63 |
| 14. సచ్ఛిష్య లక్షణములు | 69 |
| 15. ఆచార్యప్రాశస్త్యము : సదాచార్యలక్షణములు | 76 |
| 16. చరమపర్వనిష్ఠావైభవము | 82 |

# పురుషకారవైభవము

వేదము అపౌరుషేయము. నిర్దుష్టము, నిత్యము, స్వతః ప్రమాణము అనుట మనందరికిని తెలిసినదే. అట్టి వేదముయొక్క అర్థమును ఎరుగవలె ననిన, ఋషులు దర్శించి ప్రవచించిన ఇతిహాస పురాణములు సహాయపడును. అందుచేతనే వాటిని "ఉపబృంహణములు" అందురు. ఇతిహాస పురాణములు రెండింటిలో ఇతిహాసములకే ఎక్కువ ప్రాముఖ్యము కలదనెడి ఉద్దేశమువలననే శ్రీ పిళ్లైలోకాచార్యులవారు తమ గ్రంథమైన "శ్రీవచన భూషణము" లో.... "ఇతిహాస పురాణంగళావే" అని పురాణముల కంటె ఇతిహాసములను ముందు పేర్కొనినారు.

ఇతిహాసములు రెండు. శ్రీమద్రామాయణము, శ్రీమహాభారతము అనునవి. ఈ రెండింటిలో గూడ శ్రీమద్రామాయణము శ్రేష్ఠమైనదని పెద్దలు చెప్పుదురు. ఈ ఇతిహాసము రావణుని చెరలో (బంధములో) ఉన్న సీతాదేవి యొక్క గొప్పతనమును చెప్పినది. శ్రీమహాభారతము పాండవదూతగా వెళ్లిన శ్రీకృష్ణపరమాత్మయొక్క గొప్పతనమును చెప్పినది.

<u>పురుషకారవైభవము</u>

సీతాదేవిని "పురుషకారము" అందురు. అనగా ఆమె "పురుషకార రూపిణి". రావణుని చెరలో ఉన్న స్త్రీలకొరకు తాను చెరలోపడి, శ్రీరాముని రప్పించి, తనను విడిపించుటకు వచ్చిన రామునిచే రావణుని చంపించి, అంతకు ముందే చెరలో నున్న అనగా బంధములో ఉన్న స్త్రీలను విడిపించుటకు, అనగా బంధములోనున్న జీవులకు భగవానుని అనుగ్రహము కలుగుటకు తాను (సీతమ్మ) ఎట్లు శ్రమించినదో శ్రీమద్రామాయణములో తెలుపబడినది. సీతాదేవి మధ్యవర్తినిగా ఉండి చెరలోనున్న స్త్రీలకు రాముని అనుగ్రహము లభించుటకు సాయపడినది.

కావున ఆమెను "పురుషకారము", "పురుషకారరూపిణి" అందురు.

సర్వలోకేశ్వరుడై సర్వనియామకుడైన భగవానుడే శ్రీకృష్ణుడై అవతరించి పాండవులకొరకు, కౌరవసభకు దూతగా వెళ్ళినాడు. ద్రౌపదికి వారు చేసిన పరాభవమును గమనించినాడు. ఆమెచేసిన శరణాగతిని గుర్తించినాడు. తాను ఎట్లైనను వారిని రక్షింపవలెనని చేసిన ప్రయత్నము శ్రీ మహాభారతములో కనిపించును. పాండవుల రాజ్యప్రాప్తికిని, విరోధి నిరసనమునకును "ఉపాయము" అయినాడు స్వామి.

ఈ విధములుగ ఈ రెండు ఇతిహాసముల చేతను పురుషకారవైభవము, ఉపాయవైభవము విశదీకరించబడినవి.

పురుషకారవైభవము ఏ విధముగా శ్రీమద్రామాయణములో ప్రతిపాదింపబడి, వ్యక్తీకరింపబడినదో మొదట తెలుసుకొందము.

శ్రీమద్రామాయణము, పురుషకారముగ మధ్యవర్తినిగా ఉండే శ్రీమహాలక్ష్మి వైభవమును తెలుపుతుంది.

అయితే ఆచార్యులు, భాగవతులు, భూ నీలాదేవులుకూడ భగవానుని మనసులో కలిగిన ఆగ్రహమును తొలగించి, కర్మవశమున దూరమైన జీవులను రక్షింపజేయుదురు. కావున వీరిని కూడ "పురుషకారము" అని అందురు. కాని "పురుషకారము" అని ప్రధానముగ లక్ష్మీదేవికే పేరు. మిగిలిన వారు ఆమెతో చేరియుందురు కనుక వారికి గూడ ఆ లక్షణములు వచ్చినవి. ఆమె సంబంధము చేతనే వీరిని కూడ "పురుషకారము" అందురు.

లక్ష్మీదేవి పురుషకారముగ ఉండినప్పుడు ఆమెకు "కృప" యును, "పరతంత్రత" యును "అనన్యార్హ శేషత్వము" ను ఉండవలయును. జీవుని పరమాత్మతో చేర్చెడి మధ్యవర్తిని అగు లక్ష్మీదేవికి తప్పక ఈ గుణములు ఉండవలయును.

1. పరుల దుఃఖమును చూచి సహించలేనిగుణము ''కృప'' అనబడును.



2. జీవుని పరమాత్మతో చేర్చవలయును కనుక ఆమె పరమాత్ముని అధీనములో ఉండునట్టి కావలయును. ఈ గుణమునే "పరతంత్రత" అందురు.

3. సర్వేశ్వరునికే తప్ప ఇతరు లెవ్వరికిని ఉపయోగపడనిదై ఉండవలయును. ఇదే "అనన్యార్హత్వము" అను గుణము.

ఈ మూడు గుణములు లక్ష్మీదేవిలో ఉన్నవి అను విషయమును ఆమెకుగల "శ్రీ" అను నామమే తెలియజేయుచున్నది.

"శ్రీ" అనుశబ్దము "శ్రిఞ్" అను ధాతువునుండి ఏర్పడినది. ఈ ధాతువునకు 'ఆశ్రయించియుండుట' 'అని అర్థము.' "సేవించుట" అని భావము. ఎల్లప్పుడూ ఆమె ఒకరిని సేవించుచుండును. అట్లే ఒకరిచే సేవింపబడుచుండును. భగవానుని ఆమె ఎల్లప్పుడు సేవించుచుండును. జీవులచే సేవింపబడుచుండును.

"శ్రీమతే" ఇతి శ్రీః అను వ్యుత్పత్తిని అనుసరించి "ఆశ్రయించి ఉండునది" అను అర్థముకాగా ఆమె సర్వేశ్వరునికే పరాధీనమై యుండునని భావము. దీనివలన ఆమెయొక్క "పరతంత్రత"– "అనన్యార్హత్వము" స్పష్టమగుచున్నది.

"శ్రియతే ఇతి శ్రీః" ఆశ్రయింపబడునది అను వ్యుత్పత్తిచేత, ఆమె జీవులచే ఆశ్రయింపబడునది అను అర్థమురాగా ఆమె యొక్క "కృప" అను గుణము వ్యక్తమగుచున్నది.

ఈ విధముగ జీవాత్మ పరమాత్మలను కలుపుటకు అవసరమైన ఈ మూడుగుణములు లక్ష్మీదేవియందు ఉన్నవని తెలియుచున్నది.

దేవియొక్క ఈ గుణములు భగవానునితో కలసియున్నప్పుడును, విడివడి యున్నప్పుడును ప్రదర్శింపబడుచున్నవి.

## I. భగవానుని కలసి యున్నప్పుడు:

### (అ) శ్రీరామచంద్రుడు వనవాసమునకు వెళ్లు సందర్భము:

సీతారాములు వనవాసమునకు బయలుదేరినారు. లక్ష్మణుడు తనను కూడ తమవెంట తీసికొని వెళ్లుమని ప్రార్థించినాడు.

శ్లో **" స భ్రాతుశ్చరణౌ గాఢం నిపీడ్య రఘునందనః,**
**సీతామువాచాతియశాః రాఘవం చ మహావ్రతమ్"** అని.

శ్రీరాముని పాదములు పట్టుకొని తానుకూడ వనవాసమునకు వత్తునని మొదట సీతమ్మతోనే అనినాడు లక్ష్మణుడు. తరువాత రాముని కూడ అడిగినాడు. ("రాఘవం చ") సీతమ్మ మధ్యవర్తిని అయి రామునిచేత లక్ష్మణుని విన్నపమును అంగీకరింపజేసినది.

### (ఆ) ఇక రెండవ సన్నివేశము:

**పంచవటి నిర్మాణసందర్భము**

శ్రీరాముడు లక్ష్మణునితో పంచవటిని నిర్మించుమనినాడు. స్వతంత్రించి ఆ పనికి పూనుకొనుట స్వరూపహాని అని లక్ష్మణుడు తలచి "నేను తమకు పనిముట్టు వంటివాడిని. మీకు నచ్చిన ప్రదేశములో నాతో కుటీరమును నిర్మించుకొనండి" అనినాడు. సీతమ్మకూడ లక్ష్మణుని వాక్యములనే బలపరచినది. రాముడు అంగీకరించినాడు. పర్ణశాలను లక్ష్మణుడు నిర్మించినాడు. లక్ష్మణుడు శరణాగతుడుకాగా సీతమ్మ పురుషకారమువలననే రాముడు లక్ష్మణుని ప్రార్థనను అంగీకరించినాడు.

### (ఇ) ఇక మూడవ సన్నివేశము:

ఇంద్రుని కుమారుడైన జయంతుడు కాకి రూపముతో వచ్చి సీతమ్మ వక్షస్థలమును గాయపరచుటచే శ్రీరాముడు దర్భను బ్రహ్మాస్త్రముతో మంత్రించి వదలినాడు. ఆ కమును ముల్లోకములలో ఎవరునూ రక్షించలేదు. తుదకు "శరణు శరణు" అనుకుంటూ అతడు రాముని పాదములచెంత వ్రాలినాడు. అయితే ఇంకనూ అహంకారము నశింపక శ్రీరాముని పాదములవైపు తలలేకుండా పడినాడు జయంతుడు. కాని రాముడు ఆలోచించుచున్నాడు. అప్పుడు సీతమ్మ ఆ కాకముయొక్క తలను శ్రీరాముని పాదములవైపు త్రిప్పినది. రాముడు ఆ కాకమును రక్షించినాడు (పద్మపురాణాంతర్గత విశేషము). కన్నుమాత్రము పోవునట్లు చేసి జయంతుని రక్షించినాడు.



ఈ విధముగా భగవానునితో కలసియున్నప్పుడు శ్రీదేవి (సీతమ్మ) తన పురుషకార గుణమును చాటినది.

## II ఇక సీతమ్మ రామునితో విడివడియున్నప్పటి సన్నివేశములు:

సీతాదేవి శ్రీరామునితో మూడుపర్యాయములు విడివడియున్నది. మొదట విడివడియున్నప్పుడు తన "కృప" ను ప్రకటించినది. రెండవసారి "పరతంత్రత" ను ప్రదర్శించినది. మూడవమారు "అనన్యార్హత" ను ప్రదర్శించినది. ఆమె తన పురుషకార గుణములను ప్రదర్శించుటకే ఆ విధముగా స్వామినుండి విడివడి యున్నది.

పురుషకారముగ ఉండి జీవులను పరమాత్మతో చేర్చెడి లక్ష్మీదేవియే రామావతారములో సీతాదేవిగా అవతరించినది. శ్రీమహావిష్ణువు ఏ విధమైన దేహములను తాల్చునో ఆ దేహమునకు తగినట్లు తన శరీరమును ఏర్పరచుకొని లక్ష్మీదేవి కూడ ఉండును.

తాను మధ్యవర్తినిగా ఉండుట తన స్వరూపమని మనకు తెలియజేయుటకు సీతాదేవి మూడుసార్లు స్వామిని వీడి యున్నదని తెలుసుకున్నాము. ఆ సన్నివేశములు ఏవో తెలుసుకొందము.

### (అ) దండకారణ్యములోని సన్నివేశము:

శ్రీరాముడు, లక్ష్మణుడు ఇద్దరు కుటీరములో లేనప్పుడు రావణుడు సీతను రామునినుండి విడదీసి లంకకు తీసికొని వెళ్లినాడు. ఇది మనకు

కనిపించునది. కాని ఇది ఒక “మిష” మాత్రమే. సీతాదేవియే అట్లు కావలయుననియే శ్రీరాముని వీడి లంకకు చేరినది. అంతకు పూర్వమే రావణునిచే బంధింపబడియున్న ఎందరో స్త్రీలను విడిపించుటకే ఆమె లంకకుచేరినది. ఆమె తన “దయాగుణము” ను ప్రకాశింపజేయుటకే అట్లు చేరినది.

ఈ విధముగా సీతాదేవియే స్వయముగా లంకకు చేరినదనుటకు ఉదాహరణములలో మొదటిది “త్రిజట” తన స్వప్నవృత్తాంతమును వివరించిన సన్నివేశము. త్రిజట తన స్వప్నవృత్తాంతమును వివరించగా దానిని విని సీతాదేవి చుట్టునూ ఉన్న రాక్షసస్త్రీలు భయపడినారు. అప్పుడు సీతాదేవి వారితో “మీకు బాధ కలిగిననాడు మిమ్ములను కాపాడుటకు నేనున్నాను” అని చెప్పినది. ఇది ఆమె దయాగుణ ప్రకాశకము. ఇక రెండవది రావణవధానంతరము ఆ శుభవార్తను చెప్పుటకు హనుమంతుడు సీతాదేవి వద్దకు వచ్చినాడు. “ఇంత వరకు నిన్ను బాధించిన ఈ రాక్షసస్త్రీలను హతమార్చుతాను” అనినాడు. కాని సీతాదేవి హనుమతో “హనుమా! వారు తమ రాజుయొక్క ఆజ్ఞను పాలించుటకు నన్ను హింసించినారు. అంతేకాని పగచేతకాదు” అని వారిని హతమార్చకుండ హనుమంతుని వారించినది. ఇది కూడ సీతాదేవియొక్క దయాగుణ ప్రకాశకమే.

### (ఆ) <u>శ్రీరామచంద్రుని</u> <u>పట్టాభిషేకానంతర</u> <u>సంఘటన:</u>

రావణవధానంతరము శ్రీరామచంద్రుడు అయోధ్యకు మరలివచ్చి పట్టాభిషిక్తుడైనాడు. సీతమ్మ గర్భవతి అయినది. శ్రీరాముడు సంతసించినాడు. సీతమ్మ కోరికను తీర్చుటకు ఉత్సాహపడినాడు.“నీ కోరిక ఏమిటి” అని అడిగినాడు. “ గంగా తీరమందలి తపశ్శాలురగు ఋషుల ఆశ్రమములను సేవించి అక్కడ ఒక్కరాత్రియైనను ఉండవలయునని కోరుచున్నాను” అనినది. ఇంతలో ఎవరో లోకులు అనరాని మాటలు అనుట జరిగినది. లోకాపవాదమును పరిహరించుటకు సీతమ్మను పరిత్యజించినాడు



శ్రీరామచంద్రుడు. ఇది రెండవ మారు ఆమెకు స్వామినుండి కలిగిన ఎడబాటు. రాముడు కోరినట్లే తాను ఎడబాసి తన “పరతంత్రత” ను ప్రకాశింపజేసినది. సీతకూడ శ్రీరాముని మనసును అనుసరించి ఉండుటయే తన కర్తవ్యమని నిర్ణయించుకొనినది.

### (ఇ) <u>ఇక మూడవది</u> <u>అవతార</u> <u>సమాప్తి</u> <u>సన్నివేశము:</u>

ఇక మూడవసారి వాల్మీకి ఆశ్రమమునుండి తిరిగి వచ్చి సీతమ్మ భూమిలోనికి వెడలిపోవుట. ఇది అవతార సమాప్తి సన్నివేశము.

శ్రీరాముడు అశ్వమేధయాగము చేయుచున్నాడు. లవకుశులు అచటకి వచ్చి రామాయణ గానము చేసినారు. రాముడు వారిని సీతాదేవి కుమారులే అని గుర్తించినాడు. సీత ఇక్కడికి వచ్చి తన పరిశుద్ధిని ఈ సమాజమునకు నిరూపించవలెనన్నాడు. లోకము కొరకు ఒక నిదర్శనము చూపవలెనన్నాడు.

అప్పుడు సీతమ్మ కాషాయమును దాల్చి, చేతులు జోడించి, నేలవైపుచూచుచు, “నేను శ్రీరాముని తప్ప వేరొక పురుషుని మనసులో కూడ తలచి ఎరుగను అనునది సత్యమైనచో భూదేవి తనలో నేను చేరుటకు నాకు అవకాశమును ఇచ్చుగాక” అని మూడుసార్లు అనినది. అట్లు ఆమె ప్రతిజ్ఞచేయగానే భూమి బ్రద్దలుఅయి, లోనుండి ఒక దివ్యసింహాసనము వచ్చినది. దానిపై భూదేవి సర్వరత్నభూషిత అయి దివ్యకాంతితో ప్రకాశించుచు కూర్చొనియున్నది. ఆమె దిగి వచ్చి సీతమ్మను తనచేతులలో పొదివి పట్టుకొని “అమ్మా! రమ్ము” అని స్వాగతము చెప్పి సింహాసనమున కూర్చుండబెట్టుకొని తీసికొనిపోయినది. పుష్పవర్షము కురిసినది.

ఇట్లు అవతార సమాప్తముచేసి సీతాదేవి తనంతతానే వైకుంఠము చేరినది. ఆమె ప్రతిజ్ఞ సత్యమని ఋజువైనది. ఆమె రాముని తప్ప వేరొకరిని పొందునది కాదు అని స్పష్టమైనది. ఇదే “అనన్యార్హత్వము”. ఆమె “భాస్కరేణ ప్రభా యథా” కదా!

ఇట్లు తన పురుషకారత్వ గుణములను లోకమునకు ఎరిగించుటకే సీతమ్మతల్లి తనంతతానే మూడు మారులు రామునితో విడివడినది. అందువలననే శ్రీమద్రామాయణము ''పురుషకార'' వైభవమును ప్రకాశింపజేయు ఉత్తమ ఇతిహాసమని పెద్దలు అందురు.

పురుషకార స్వరూపిణి అయిన శ్రీమహాలక్ష్మి స్వామితో కలసియున్న స్థితిలో సర్వేశ్వరుని మనసుయొక్క స్ఫూర్తిని జీవునివైపు అభిముఖము చేయును. ఆమె నిత్యానపాయినియే. కాని జీవుని భగవానుని వైపు అభిముఖుని చేయుటకు తాను స్వామినుండి విడివడి జీవుని దిద్దుబాటు చేయును.

"న కశ్చిన్నాపరాధ్యతి"– "తప్పు చేయని వా రెవరుందురు స్వామీ!" అని నచ్చజెప్పి స్వామిని జీవునివైపు అభిముఖుని చేయును.

"నీవు భయపడకు నీ అపరాధ సహస్రములను స్వామి క్షమించి నిన్ను రక్షించును. అట్టి క్షమాగుణ సంపన్నుడు స్వామి. నీవు సర్వాత్మనా శరణాగతి చేయుము" అని చెప్పి జీవుని భగవానునివైపు అభిముఖుని చేయును.

ఈ విధముగా లక్ష్మీదేవి పురుషకార స్వరూపిణిఅయి అనగా జీవాత్మ పరమాత్మలకు మధ్యవర్తిని అయి జీవుని సర్వేశ్వరునితో చేర్చును. అట్టి ఆమె యొక్క వైభవమే "పురుషకారవైభవము".



## ఉపాయవైభవము

శ్రీమహాభారతములో భగవానుని ఉపాయవైభవము స్పష్టీకరించబడినది. శ్రీకృష్ణభగవానుడు కేవలము రక్షకుడుగానే గాక ఎరుగని దానిని ఎరిగించుటచే ఆచార్యుడుగా కూడ వ్యవహరించినాడు.

"శ్రీ నమ్మాళ్వారులు" "అఱియాదనవఱిత్త" అని "స్వామి తెలియని దానిని తెలియజేసినాడు'' అని సాయించినారు. భగవానుడు మహాభారతములో ఆచార్యకృత్యమును నెరవేర్చినందుననే ఆళ్వారులు ఆ విధముగా సాయించినారు.

"ఆచార్యకృత్యము" అనగా తెలియని అర్థములను తెలియజేయుట. శ్రీకృష్ణభగవానుడు అర్జునునకు "గీతోపదేశము" చేసి అంతకుముందు అర్జునునకు తెలియని "తత్త్వము" మొదలుకొని "ప్రపత్తి" వరకు సకలార్థములను తెలియ జేసినాడు.

''దేహమే ఆత్మ'' అనెడి నిశ్చయముతో ఉన్న అర్జునునకు దేహముయొక్క స్వరూపమును, స్వభావమును; ఆత్మయొక్క స్వరూపమును, స్వభావమును తెలియజేసినాడు. ఆత్మ నిత్యము; దేహము అనిత్యము అని చెప్పినాడు. కర్మవశము చేత ఆత్మ శరీరమును పొందునని చెప్పినాడు. ఆత్మనాశనము లేనిదని ఎరిగించినాడు. ఆత్మ "స్వతంత్రము" అనెడి భ్రమను తొలగించినాడు. ''నాకే చెంది నాచేతనే ధరింపబడి నాచేతనే నియమింపబడునది ఆత్మ" అని విశదీకరించినాడు.

ప్రకృతియొక్క వికారమే శరీరము. సత్త్వరజస్తమో గుణములు శరీరమునందుండును. వీనిచేతనే అహంకారము కలుగును. ఈ అహంకారము ఎంతో దోషభూయిష్ఠము.

ఇంద్రియములు ప్రబలమైనవి. వీనిని ప్రవర్తింప చేయునది మనసు. ఇంద్రియములు, మనసు మన అధీనమున నుండి భగవానుని యందే

ప్రవర్తించునట్లు చేయుట ఎంత అవసరమో, ఆ పనిని ఎట్లు చేయవలయునో భగవానుడు అర్జునునకు ఎరిగించినాడు.

భగవానుని ఆశ్రయించువారు ఆర్తులు, అర్థార్థులు, జిజ్ఞాసువులు, జ్ఞానులు అని నాలుగు విధములుగ ఉందురని తెలిపి వారివారి ప్రవృత్తులను గూడ భగవానుడు వివరించినాడు.

ఆర్తులు పోయిన ఐశ్వర్యమును మరల కావలయునని తనను ఆశ్రయింతురని; అర్థార్థులు తమకు ఉన్నదిచాలక క్రొత్తఐశ్వర్యము కావలయునని ఆశ్రయింతురని; జిజ్ఞాసువులు "శరీరము కంటె ఆత్మవేరు" అని గుర్తించి, తమకు మరల జన్మము లేకుండ ఉండవలయునని ఆశ్రయింతురు అని; జ్ఞానులు నన్నే ప్రేమించి, నన్ను చేరుటయే ప్రయోజనమని భావించుచు, నన్నుసేవించుచు, నాకు ప్రీతిని కలిగించుచు, నాకు కలిగిన ఆ ప్రీతిని చూచి తాము ఆనందించవలయునని కోరుచు నన్ను ఆశ్రయింతురు అని భగవానుడు బోధించినాడు.

భగవానుని ఆజ్ఞారూపమగు శాస్త్రములను, వేదములను అనువర్తించి ప్రవర్తించువారు దైవవర్గమునకు చెందినవారని, వీరు మోక్షార్హులని చెప్పినాడు. శాస్త్రములను, వేదములను ఉల్లంఘించి ప్రవర్తించువారు ఆసుర వర్గమునకు చెందినవారని, వీరు మరల బంధమునే పొందెదరని భగవానుడు చెప్పినాడు.

ఇట్లు అనేకవిషయములను భగవానుడు అర్జునునకు చెప్పి, ఆచార్యకృత్యమును నిర్వహించి, తన విశ్వరూపమును దర్శింప జేసినాడు. ఇట్లు దర్శింపజేసి దానిని పొందుటయే పరమపురుషార్థమని తెలిపినాడు. కావున తానే ఉపాయము (పొందదగినవాడు) అని చెప్పినాడు. ఈ "ఉపాయమును" (తనను) పొందుటకు కర్మజ్ఞానములు అంగములుగ ఉన్న భక్తిని కలిగి ఉండవలయునని చెప్పినాడు.



ఇది ఎంతో కష్టమే అని అర్జునుడు తన మనసులో అనుకొనినాడు. అంతర్యామికి తెలిసినది. "అర్జునా! భయపడకు. దానికంటె సులభముగా చేయతగినది, భగవానునకే పరతంత్రమైన ఆత్మయొక్క స్వరూపమునకు అనురూపమగు ఉపాయము ఒకటియున్నది. అది "ప్రపత్తి". "ప్రపత్తి" అనగా భగవానుని పొందుటకు భగవానుడే "ఉపాయము" అని మనసులో దృఢముగ విశ్వసించుట" అని చెప్పినాడు.

ఈ విధముగ అర్జునునకు అంతకుపూర్వము తెలియని అనేక అర్థములను భగవానుడు తెలియజేసి, ఆచార్యుడుచేయు ఉపకారమును తానే మహాభారతములో నిర్వహించినాడు.

భగవానుడు "ఉపాయము". ఉపాయమే కాని మధ్యన ఒకరు లేకుండా తనంతతాను జీవునకు ఆభిముఖ్యము కలిగించి స్వీకరింపడు. దానిని చేయుటకు మధ్యవర్తినిగా లక్ష్మీదేవి ఉండవలయును. ఈ విషయమే "ద్వయ" మంత్రములో నిర్దేశింపబడినది. "ద్వయమంత్రము" పురుషకార వైభవమును చెప్పినది.

కాని మహాభారతములో శ్రీకృష్ణభగవానుడు తానే పురుషకారము, తానే ఆచార్యుడు, తానే ఉపాయమై ప్రవర్తించినాడు. జీవుడు కోరనక్కర లేకుండగానే, మధ్యవర్తులు లేకుండగానే "తాను రక్షింతును" అని మహాభారతములో స్వామి తన "ఉపాయవైభవము" ను నిరూపించినాడు.

**సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ,**
**అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః** అనినాడు.

సర్వేశ్వరుడు దోషములతోనిండిన గుణములు లేని జీవులను కూడ అంగీకరించుట ఆయన స్వభావము. అట్లు స్వీకరించినాడు కదా అని తనలో దోషములే లేవని జీవుడు తలపరాదు. ఆ విధముగా భావించినచో

అది జీవుని దోషమే అగును. దోషములున్నను తనను స్వామి స్వీకరించును అని తలచుచు దోషములు చేయుచునే ఉండుట మహాదోషము.

అర్జునుడు సర్వేశ్వరునకు ఆత్మవంటివాడు. అయిననూ అతనిలో దోషములున్నవి. బంధుప్రీతి, క్షత్రియుడు అయి ఉండికూడ శత్రుసంహారమునకు వెనుదీయుట, జాలి పడకూడనివారి విషయములో జాలిపడుట అనునవి అర్జునునిలోని దోషములు. జితేంద్రియుడు, ఆస్తిక్యుడు, భగవానునకు ఆత్మవంటి వాడు అయిన అర్జునునిలోనే ఇట్లు దోషములు ఉండగా సామాన్యుల విషయము చెప్పవలయునా?

ఇంకొక ప్రధానమైన దోషము కూడ అర్జునునిలో ఉన్నది. కౌరవసభలో ద్రౌపది "కృష్ణా రక్షింపుము" అని ఆక్రోశించినది. అర్జునుడు అక్కడే ఉన్నాడు. ఆ అత్యాచారమును ఎదుర్కొను శక్తికూడ ఉన్నది. తనకు ఆప్తుడు, ప్రాణము అయిన శ్రీకృష్ణుని శరణు వేడుచున్నది. తన ప్రాణసముడైన శ్రీకృష్ణుని శరణు వేడినందులకైనను, మిత్రధర్మము ననుసరించి ద్రౌపదిని అర్జునుడు రక్షింపవలసియుండెను. కాని రక్షింపలేదు. చూచుచు ఊరకుండినాడు భగవానుడు తన విషయములో అపరాధము చేసినను సహించగలడు కాని తనభక్తుల విషయములో, తనను "శరణు" అనినవారి విషయములో అపరాధము చేసినచో సహించడు. "న క్షమామి కదాచన" అని కూడ అనినాడు కదా!

ద్రౌపది విషయములో ఇంతటి క్రూరమైన తప్పు చేసినందులకు పాండవులనందరను శ్రీకృష్ణుడు విడువ వలసినదే. కాని తాను వారిని విడచినచో ద్రౌపది తన భర్తలను పోగొట్టుకొనవలసి వచ్చును. కౌరవుల బలపరాక్రమములు అట్టివి. అందుచే పాండవులు ఎంతతప్పు చేసిననూ శ్రీకృష్ణుడు వారిని రక్షించినాడు. "శరణు" అనినవారిని రక్షించుటయే ఆయన స్వభావము. స్వామి మనసులో అనుక్షణము ద్రౌపదీ పరాభవమే మెదలుచున్నది. ఆమె చేసిన శరణాగతియే జ్ఞప్తికి వచ్చుచున్నది.



కౌరవులయెడ క్రౌర్యము పెరుగుటకు, వారి నాశనమునకు ఇదియే కారణమైనది. ద్రౌపదిని పరాభవించినందులకే దుర్యోధనాదులను శ్రీకృష్ణుడు నశింపజేసినాడు. తనను ఆశ్రయించిన ద్రౌపదికి ఎట్టి హాని కలుగరాదు అనియే స్వామి నిర్ణయము.

### ఇక, శ్రీకృష్ణుడు పాండవదూతగ హస్తినకు వెళ్లిన సన్నివేశము :

భగవానుడు హస్తినకు వెళ్ళుచున్నాడు. సంధిచేసుకొని రమ్మని పంచపాండవులు, తమకు మనఃపూర్తిగా ఇష్టము లేకపోయినను భగవానుని పంపినారు. కాని కౌరవసభలో ద్రౌపదికి కలిగిన పరాభవము, అశ్వమేధ అవభృథస్నాత అయిన ద్రౌపదియొక్క కేశములను దుశ్శాసనుడు పట్టి లాగిన క్రూరదృశ్యము, ఆ విడివడిన కేశములే భగవానుని కన్నులముందు కనిపించుచున్నవి. "సంధికాదు – సమరమే" అని మొదటనే స్వామి నిర్ణయించుకొనినాడు. కౌరవు లందరు హతులైన పిదపమాత్రమే ద్రౌపదిమనసు చల్లబడును అని నిర్ణయించుకొనినాడు. దీని కంతటికి కారణము ద్రౌపది చేసిన ప్రపత్తియే. నీవుతప్ప మరియొక ఉపాయము లేదని ద్రౌపది ఆమె చేసిన ఆక్రందనమే.

అర్జునునకు యుద్ధములో "రథసారథి" గ ఉండి "విజయసారథి" అయినది కూడ ద్రౌపది కొరకే. "ఆయుధమును ధరించను" అని ప్రతిజ్ఞ చేసినాడు. మరి కౌరవులను చంపుట ఎట్లు? అని శ్రీకృష్ణుడు ఆలోచించినాడు. వారిని చంపుటకే రథసారథ్యమును వహించినాడు. గుఱ్ఱములు, కొరడా. ఇవే ఆయన వద్ద ఉన్నవి. వాటినే సాధనములుగ చేసుకొని, భారతయుద్ధములో చిత్ర విచిత్ర రథచాలనములతో ఆ రథచక్రముల చేతనే శత్రుసైన్యము హతమగునట్లు చేసినాడు స్వామి.

"న యోత్స్యామి" అని ప్రతిజ్ఞ చేసినాడు. అర్జునునకు "గీత" ను ఉపదేశించి సమరోన్ముఖుని చేసినాడు. "నేనే రక్షకుడను. నన్ను

నమ్మియుండుము" అని ధైర్యము చెప్పినాడు. "నేనే రక్షింతును" అనినాడు. "ప్రపత్తి" ని ఉపదేశించినాడు.. "సర్వధర్మాన్.....మా శుచః" అనినాడు. ఇట్లు ఇవి అన్నియు చేయుట "శరణాగత" అయిన ద్రౌపది కొరకే.

"ప్రపత్తి" అనగా "భగవానుడే ఉపాయము" అని మనసులో స్వీకరించుట. దీనిని మహాభారతములో స్వామి ఉపదేశించి, ఆచరించి స్వామి చూపినాడు. అందులకే మహాభారతములో "ఉపాయవైభవము" ప్రతిపాదింపబడినదని పెద్దలు అందురు.



# ప్రపత్తి స్వరూపము

"ప్రపత్తి" అనగా భగవానుని పొందుటకు భగవానుడే "ఉపాయము" అని మనసున దృఢముగ విశ్వసించుట. దీనినే "శరణాగతి" అందురు.

ప్రపత్తిని ఇట్టి దేశములో చేయవలయుననిగాని, ఇట్టి కాలములో చేయవలయుననిగాని, ఇట్టి విధముగానే చేయవలయుననిగాని, ఇట్టివారే చేయవలయుననిగాని, ఇందులకు ఇట్టి ఫలమే సిద్ధించుననెడి నియమముగాని లేదు. అనగా దేశనియమము, కాలనియమము, ప్రకారనియమము, అధికారినియమము, ఫలనియమము అనునవి లేవు అని తాత్పర్యము.

(i) **దేశనియమము**: ప్రపత్తికి దేశనియమము, కాలనియమముగాని లేవు.

(ii) **కాలనియమము**: ఏ దేశములోనైనను, ఏ కాలములోనైనను భగవానుని యెడ దృఢమైన విశ్వాసము కలుగుటయే ప్రధానము.

సముద్రతీరమున విభీషణుడు శ్రీరామచంద్రుని శరణాగతి చేసినప్పుడు "ఇది తగిన దేశముకాదు. తగిన కాలముకాదు" అని జాంబవంతుడు చెప్పినాడు. కాని, ఆ మాటనుకాదని హనుమ "ఇదే తగిన దేశము. తగిన కాలము. శరణాగతికి దేశకాలనియమములేదు."

– **"బద్ధవైరాచ్చ, పాపాచ్చ, రాక్షసేంద్రాద్విభీషణః,**
**అదేశకాలే సంప్రాప్తః, సర్వథా శంక్యతామయం"**

అని జాంబవంతుడనినాడు. అనగా "బద్ధవిరోధి, పాపాత్ముడు అయిననాడు రావణాసురుడు. అతని కొలువు నుండి వచ్చిన వాడు విభీషణుడు. అతను వచ్చుటకు ఇది తగిన దేశము కాదు. కాలముకాదు. కనుక మనము వీనిని స్వీకరింపరాదు. అతనిని శంకింపవలెను." – అనినాడు. అప్పుడు,

**" దౌరాత్మ్యం రావణే దృష్ట్వా విక్రమం చ తథా త్వయి,**
**యుక్తమాగమనం తస్య సదృశం తస్య బుద్ధితః"** – అనినాడు.

అనగా "రావణుని దుష్టస్వభావమునుచూచి మీయందు గల పరాక్రమమును చూచి, అతని బుద్ధిని బట్టి విభీషణుడు మిమ్ములను (శ్రీరాముని) కలువవలెనని నిశ్చయించుకొని ఇప్పుడు ఇచ్చటకు వచ్చుట తగినదే" అని హనుమ అనినాడు.

శరణాగతి చేయుటకు దేశకాల నియమములు లేవని ధర్మజ్ఞుడైన హనుమ నిర్ణయము. శ్రీరాముడు ధర్మజ్ఞుడు కనుక విభీషణునకు అభయ మిచ్చినాడు.

(iii) **ప్రకారనియమము:**

వేదములలో చెప్పిన కర్మలు ఆచరించునప్పుడు, యజ్ఞయాగాదులు నిర్వహించునప్పుడు, నిర్ణీత ప్రదేశములోనే, నిర్ణీత ఋతువులందే, నిర్ణీత సమయములందే నిర్వహించవలెనను నియమములు ఉండును. కాని ప్రపత్తికి అట్టి నియమములు లేవు. ఎట్టి స్థితిలో ప్రపత్తిచేసినను, తనతో సంబంధముకల వారిని పవిత్రులను చేయును. రక్షించును.

భగవానుని ఎట్లు ప్రపత్తి చేయవలయునో "ద్వయమంత్రము" (శ్రీమన్నారాయణ చరణౌ శరణం ప్రపద్యే; శ్రీమతే నారాయణాయ నమః) మనకు విశదీకరించుచున్నది. ఈ మంత్రములలోని మొదటిపదము, ("శ్రీమన్నారాయణ చరణౌ శరణం ప్రపద్యే"– అనునది) జీవునకు ఎప్పుడు భగవానుని శరణు పొందవలెనను కోరిక కలుగునో అప్పుడే మనసున నిర్ణయించుకొని ఆశ్రయింపవచ్చునని స్పష్టముగా తెలుపుచున్నది. దీనికి ఒక ప్రకారము అనగా పద్ధతి అవసరములేదు. స్నానము చేయవలయును, శుచిగా ఉండవలయును అను సామాన్యనియమములు కూడ అవసరము లేదు.

ఈ విషయములో ద్రౌపదిని, అర్జునుని దృష్టాంతముగ తీసికొనవచ్చును.

కౌరవసభలోనికి ద్రౌపదిని దుశ్శాసనుడు ఈడ్చుకొనివచ్చినాడు. అప్పుడు ఆమె "నేను రజస్వలను, ఏకవస్త్రను. ఇట్టిస్థితిలో నన్ను కౌరవసభలోనికి తీసికొని పోవుట తగదు" అని మొరపెట్టినది. అయినను దుశ్శాసనుడు వినలేదు. సభలోని పెద్దలు, భర్తలు మౌనము వహించినారు. అప్పుడు ఆమె ఇతరులెవ్వరు రక్షకులు



కారు అని నిశ్చయించుకొనినది. అపవిత్రముగ ఉండి కూడ ఆమె శ్రీకృష్ణభగవానుని శరణు వేడినది. భగవానుడు ఆమెను రక్షించినాడు.

ఇక రెండవది: యుద్ధభూమిలో అర్జునుడు యోధవేషములో ఉన్నాడు. అట్టి అర్జునునకు భగవానుడు ప్రపత్తియే నిశ్చితార్థముగా గల భగవద్గీతను ఉపదేశించినాడు. నీచులైన కౌరవులమధ్యలోనే అర్జునునకు గీతోపదేశము చేసినాడు. అపరిశుద్ధమైన స్థలములో, అపరిశుద్ధులైన వారి మధ్యలో, అపరిశుద్ధమైన వేషములో నున్ననూ "త్వమేవ శరణం మమ" అనిన అర్జునునకు గీతోపదేశముచేసి "మా శుచః" అని ఓదార్చి అభయమిచ్చినాడు. రక్షించినాడు.

ఇట్టి సంఘటనలను బట్టి ప్రపత్తి చేయుటకుగాని, ప్రపత్తి మార్గమును ఉపదేశించుటకుగాని "ప్రకారనియమము" లేదని తెలియుచున్నది.

(iv) **అధికారినియమము:** శరణాగతిని ఎవరు చేయవచ్చును? శరణాగతి చేయుటకు ఎట్టి యోగ్యత ఉండవలెను? అని శంకించ నవసరములేదు. శరణాగతిని "ఇట్టివారే చేయవలయును అను నియమము లేదు.

ధర్మరాజు మొదలైన పాండవులు క్షత్రియులు. వీరందరును శ్రీకృష్ణుని శరణువేడి, రక్షణ పొందినారు.

ద్రౌపది స్త్రీ అయినను శరణువేడి రక్షణ పొందినది.

"కాకము" పక్షి. ఇంద్రుని కుమారుడు. ముల్లోకములలో తిరిగి, ఎచ్చటను రక్షణ పొందక తుదకు శ్రీరామచంద్రునే శరణువేడినాడు. భగవానుడు ఎంతో క్రూర కర్ముడైన ఆ కాకమును సైతము రక్షించినాడు.

కాళీయుడు క్రూరజాతికి చెందిన సర్పము. శ్రీకృష్ణభగవానుని పదఘట్టనలచే శ్రమపడుచు, తనను తాను రక్షించుకొనుటకు ఎంతో ప్రయత్నించి, సాధ్యముకాక తుదకు శ్రీకృష్ణభగవానునే శరణు వేడినాడు. స్వామి అతనిని రక్షించినాడు.

గజేంద్రుడు తిర్యక్ జాతికి చెందినవాడు. తననుతాను రక్షించుకొనవలయునని ఎంతకాలమో ప్రయత్నించి విఫలుడై తుదకు "నీవే

తప్పు నితఃపరం బెరుగ, సంరక్షించు భద్రాత్మకా!" అని మొరలిడి శరణాగతు డైనాడు. "సిరికిం జెప్పదు, శంఖచక్రయుగమున్ చేదోయి సంధింపదు" అను త్వరలో శంఖచక్రములను అస్తవ్యస్తముగా ఉన్ననూ గుర్తించక, గజప్రాణావనోత్సాహియై వేంచేసి గజరాజును రక్షించినాడు.

విభీషణుడు రాక్షసుడు. రాముడే తనకు రక్షకుడని తలచి శరణువేడినాడు. శ్రీరాముడు అభయమిచ్చి రక్షించినాడు. అతనిని శంకించవలెనని జాంబవంతునివంటివారు నిరోధించ ప్రయత్నించిననూ, ''యది వా రావణస్స్వయం" అని భగవానుడు వారికి చెప్పి, తన శరణాగతత్రాణ పరాయణత్వమును స్పష్టపరచినాడు.

ఇంత ఎందుకు? శ్రీరాముడు చక్రవర్తి. అయినను సముద్రుని శరణు వేడినాడు. శ్రీరామునంతటి లోకోత్తర పురుషుడు నన్ను శరణుకోరుటయా? అని తలచి సముద్రుడు సేతునిర్మాణమునకు మార్గము చెప్పినాడు.

లక్ష్మణుడు శేషుని అవతారము. అట్టివాడు కూడ రామావతార సమయమున మానవాకారములో నున్న శ్రీరామునికి సోదరుడై తనకు నిత్యము సేవచేయు భాగ్యము కలుగవలెనని శరణువేడి కృతకృత్యుడైనాడు.

క్షత్రియకులములో పుట్టి, నీచకృత్యములు చేసిన "ముచికుందుడు" శ్రీకృష్ణుని శరణువేడి రక్షణ పొందినాడు.

ఇంద్రాది సమస్తదేవతలు, వానరులు – ఇట్లు అనేకులు అనేకవిధములుగా భగవానుని శరణు గోరి రక్షణ పొందినారు.

కాబట్టి శరణాగతి చేయుటకు ఇట్టివారే తగిన వారను నియమములేదు. భగవానుని యందు రుచి కలవారందరునూ అధికారులే. అధికారి నియమములేదు.

(v) **<u>ఫలనియమము:</u>** "ఇట్టి ఫలములకే ప్రపత్తి సాధనము" అను నియమము లేదు. ఏ ఫలమును కోరిన ఆ ఫలము సిద్ధించును.



ధర్మరాజు మొదలగు పాండవులకు రాజ్యము లభించినది. ద్రౌపదికి వస్త్రము లభించినది. కాకమునకు, కాళీయునకు ప్రాణము లభించినది . గజేంద్రునకు కైంకర్యము లభించినది. శ్రీరామునకు సముద్రమును దాటుటకు మార్గము లభించినది. లక్ష్మణునకు రాముని వెంట అరణ్యములకు వెళ్లి, అతనికి నిరంతరము సేవచేయుభాగ్యము లభించినది. శేషావతారమైన లక్ష్మణునకు "నివాసశయ్యాసన పాదుకాదిషు --- శేష ఇతీర్యతే జనైః"– అను భాగ్యము లభించి అన్వర్థ నామధేయుడైనాడు.

ఇట్లు ప్రపత్తివలన అనగా శరణాగతివలన ఏ ఫలమును ఆశించిన వారికి ఆ ఫలము సిద్ధించును. అందుచే ప్రపత్తికి "ఫలనియమము" లేదు అని చెప్పబడినది. అయితే, "ప్రపత్తి" కి "విషయనియమము" మాత్రము ఉన్నదని పెద్దలు చెప్పుచున్నారు. గుణములు పూర్తిగా ఉన్నవారివద్దనే శరణాగతి చేయవలయును. గుణములు పూర్తిగా ఉండి, మనకు అనుకూలముగా ఉన్నవాడు "అర్చామూర్తి" గా ఉన్న భగవానుడే. ఇట్టి "అర్చామూర్తి" వైశిష్ట్యమును తెలుసుకొందము.

## ప్రపన్నులు - వారి లక్షణములు

"ప్రపత్తి" చేయువారు "ప్రపన్నులు." వీరు రెండు విధములుగా ఉందురు. ఉపాయనిష్ఠులు, ఉపేయనిష్ఠులు, ఉపాయము కూడ ఉపేయముతో సమానమైనదే అని వీరి భావన.

భగవానుని ''ఉపాయము'' అని తలచి ప్రపత్తి చేయువారు "ఉపాయనిష్ఠులు". అట్లే భగవానుని "ఉపేయము" అని తలచి ప్రపత్తి చేయువారు "ఉపేయనిష్ఠులు."

ఉపాయనిష్ఠులు ఏదో ఒక ప్రయోజనమును కాంక్షించి ప్రపత్తి చేయుదురు. సీతాదేవి, ద్రౌపది, తిరుక్కణ్ణమంగైయాండాన్. ఇట్టివారు ఉపేయనిష్ఠులు. వేరొక ప్రయోజనము కోరక విశ్వేశ్వరుని కైంకర్యమునే కోరువారు లక్ష్మణస్వామి, జటాయువు, పిళ్లై తిరునఱై యూరైయరు, చింతయంతి – ఇట్టివారు.

ప్రపత్తి చేయువారికి (శరణాగతిచేయువారికి) తన రక్షణము నందు తన ప్రయత్నము మాని యుండుట ప్రధానలక్షణము.

సీతాదేవి తనను తాను రక్షించుకొనుటకు శక్తికలది. అయినను, తనను తాను రక్షించుకొనరాదు అను నిశ్చయముతో శ్రీరామునే రక్షకుడని నమ్మియున్నది: హనుమ తాను సీతాదేవిని తీసికొని వెళ్లుదునని చెప్పినను,"తత్తస్యసదృశంభవేత్" – అని రాముడే వచ్చి, శత్రుసంహారము చేసి, తనను తీసికొని వెళ్ళుట శ్రీరామునకు తగినది అనినది. తన "శక్తి" ని వదలుకొనినది.

ద్రౌపది తనను తాను రక్షించుకొన శక్తిలేనిది. ఆమెకు కౌరవసభలో పరాభవము జరుగుచున్నప్పుడు ఎవరునూ రక్షించుటకు సిద్ధపడలేదు. ఆమె సిగ్గుచే తనచీరెను వదలక పట్టుకొని ఉండెను. తుదకు ఆ చీరెనుకూడ వదలి "గోవింద! రక్షమామ్ రక్షమామ్" అనినది. వెంటనే ఆమెకు వస్త్రములు వచ్చినవి. ద్రౌపదికి తనను తాను రక్షించుకొనుటకు శక్తిలేదు. అందుచేత "లజ్జ" ను వదలి శరణువేడినది.



వీరిద్దరి శరణాగతిలో భేదమిదియే. ఒకరు శక్తిని వదలినారు. మరొకరు లజ్జను అనగా సిగ్గును వదలినారు.

తిరుక్కణ్ణమంగైయాండాన్ తన ప్రయత్నమునే మానుకొనినాడు. ఆయన ఒకనాడు ఒకసేవకుని కుక్కను చూచినాడు. మరొక సేవకుడు వచ్చి ఆ కుక్కను కొట్టినాడు. కుక్కను కొట్టినందుకు కుక్కయజమాని రెండవ సేవకునితో తగవులాడి రెండవ సేవకునిచేత దెబ్బలుతిని తన ప్రాణములనే విడచినాడు. తనను విశ్వాసముతో కొలుచుచున్నందుననే ఆ కుక్కకొరకు యజమాని తనప్రాణము విడచినాడు. – "ఒక సామాన్య మానవుడే తనను విశ్వాసముతో సేవించుచున్న ఒక కుక్కకొరకు తన ప్రాణమును వదులుకున్నాడే, మనము పరమపురుషుడైన సర్వేశ్వరుని విశ్వాసము నమ్మియున్నచో మనకొరకు ఆయన ఎట్టిశ్రమను అయినను పడి రక్షించి తీరును" – అని నిశ్చయించుకొనినాడు.

ఒకమారు "ఆండాన్" ఒక దివ్యదేశములో "పత్తరావి" అను భగవానుని ఆలయములో ఒకరాత్రి పండుకొనటం తటస్థించినది. అప్పుడు ఆలయములోని మూర్తికి నిప్పు అంటుకొని ఆలయము కాలిపోవుట ప్రారంభమైనది. అదే ఆలయములో పడుకొనియున్న ''ఆండాన్'' భగవానుని యెడ పరిపూర్ణ విశ్వాసముతో శరణాగతి చేసినవాడు గనుక తననుతాను రక్షించుకొనుటకు ఎట్టి ప్రయత్నమును చేయలేదు. అక్కడే ఉండి చనిపోయినాడు.

ఈ ప్రసంగములచే, శరణాగతిచేయువారు సంపూర్ణ విశ్వాసముతో ఉండవలయునని మనము గ్రహింపవలెను.

సంపూర్ణముగ శరణాగతిచేసిన ఈ ముగ్గురు ఒకరు శక్తిని, మరొకరు సిగ్గును, వేరొకరు ప్రయత్నమును విడచినారు. వీరు ఉపాయనిష్ఠులు.

శ్రీమన్నారాయణుడే "ఉపేయము" (పొందదగినవాడు) అని విశ్వసించిన వారు "ఉపేయనిష్ఠులు" "ఉపేయము" అనగా తనచే పొందవలసినది భగవత్ కైంకర్యమే అని నమ్మి ఇతరములను వదలినవారు.

లక్ష్మణస్వామి, జటాయువు, పిళ్లైతిరునరైయూరైయార్, చింతయంతి అనువారు అట్టివారు.

అడవికి వెళ్ళునప్పుడు శ్రీరామచంద్రునితో లక్ష్మణుడు "నిన్ను వదలినచో నేను బ్రతుకజాలను. నేను మీకు అన్నివిధముల కైంకర్యములను చేయుచుండవలెను" అనినాడు. అయోధ్యలో ఉన్నప్పుడు అనేకులు శ్రీరాముని కైంకర్యము చేయువారు ఉందురు. కాని అరణ్యములో అన్ని కైంకర్యములను తానే చేయవచ్చును అని లక్ష్మణుడు సంతోషించినాడు.

రావణుడు, సీతాదేవిని అపహరించుకొని పోవునప్పుడు జటాయువు (పెరియ ఉడైయార్) రావణునితో యుద్ధముచేసి అతని చేతిలో మరణించినాడు. భగవద్విషయములో శరణాగతి చేసినవారు తమ ప్రాణములనైనను లెక్కచేయరు. అని జటాయువు నిరూపించినాడు.

అట్లే ''తిరునరైయూరైయార్'' అనువారు కుటుంబముతో సహా తిరునారాయణపురమునకు వెళ్ళినపుడు అచ్చట కొందరు అన్యమతస్థులు ఆలయమునకు నిప్పుపెట్టినారు. ఆలయములోని అందరు స్వామిని విడిచి పారిపోయినారు. ''నేను మాత్రము స్వామిని వదలి వెళ్ళజాలను" అని "యూరైయార్" అక్కడే ఉండి కుటుంబముతో సహా అగ్నికి ఆహుతి అయినాడు.

"చింతయంతి" ఒక గోపిక. శ్రీకృష్ణుని వేణునాదము విని, గోపికలు అందరు కృష్ణుని సన్నిధికి వెళ్లుచుండగా తాను గూడ పోదలచెను. కాని, ఆమెను ఇంటిలోని పెద్దలు, భర్త ఒక గదిలో పడవైచినారు. ఆమె ఆ గదిలో ఉండియే కృష్ణుని ధ్యానించుచుండెను. ఆమెకు అంతయు కృష్ణమయముగ తోచెను. సదా కృష్ణునే స్మరించుచుండుటచే, ఆమె పూర్వజన్మములో ఆర్జించిన పుణ్యమువలన ప్రత్యక్ష సమానముగ కృష్ణదర్శనమైనది. ఆమె ఆత్మ శరీరమును వీడి కృష్ణసాయుజ్యము నొందినది.

ఉపేయనిష్ఠులు ఇట్లుందురని వీరివలన తెలియుచున్నది.



ప్రపన్నులు పుణ్యదేశములలో నివసించుచు, భగవానునికి పూజాదికములను చేయుచుందురు. ఇది ఉపాయమని వారు తలచరు. సర్వేశ్వరునకు ప్రీతిపాత్రమైన కైంకర్యమే తమకు ప్రాప్యమని వారు చేయుదురు.

ప్రపన్నులకు ప్రధానమైన లక్షణములు మూడు. 1. అనన్యోపాయత్వము 2. అనన్యోపేయత్వము 3. అనన్యదైవత్వము అనునవి. ఈ మూడును శరణాగతి చేయువారికి దొరుకును.

"అనన్యోపాయత్వము" అనగా వేరొక ఉపాయము లేనివారై ఉండుట. "అనన్యోపేయత్వము" అనగా సర్వేశ్వరునివదలి వేరొకదానిని పొందవలెనని కోరకుండుట. "అనన్యదైవత్వము" అనగా సర్వేశ్వరుని తప్ప వేరొక దైవమును ఆశ్రయింపకుండుట. ఈ మూడును ప్రపన్నులకు ఉండవలసినవి.

సర్వేశ్వరుడే ఉపాయమని నిశ్చయించుకొనియున్న ప్రపన్నులకు తాము ఏమిచేసినను సర్వేశ్వరునకు గొప్పతనమును పెంచుటకే కాని తమ ఆనందముకొరకు కాదు అను భావన ఉండవలయును. ఇట్లు సర్వేశ్వరుడే ఉపాయమని స్వీకరించినవారికి తాము దేనిని పొందవలెనని అనుకొనుచున్నారో అది "ఉపేయము" అగుచున్నది. కనుక "ఉపాయము" కూడ "ఉపేయము" తో సమానమైనదే. ఆ సర్వేశ్వరుడే ఉపాయమైననాడు సాధ్యమేకదా తనకు సాధనము అని ప్రపన్నులు నిశ్చయముతో ఉందురు.

ఒక్కొక్కసారి శరణాగతిచేసిన కొందరు ప్రేమపరవశులై, స్వామిని పొందవలయునని కోరుచుందురు. ఆ ప్రేమ పారవశ్యముచేత తమ స్వామిని తాము పొందునట్లు చేయుడని ఇతరదేవతలను ఆశ్రయింతురు. ఇట్లు వారు చేయుట వారికి దోషముకాదు. వారి స్వరూపమునకు హానికాదు. స్వామిపై ప్రేమ అధికమై మాత్రమే వారు అట్లుచేసినారు. కాబట్టి అది దోషముకాదు.

ప్రపన్నులకు ఆదర్శమైన ఆండాళ్ తల్లి కామదేవుని ఆరాధనచేసి, తనను తనస్వామితో చేర్చుమని ప్రార్థించినది. ఇది అనన్యదైవత్వమునకు విరుద్ధమని అనిపించును. కాని, సర్వేశ్వరుని కైంకర్యము నందు ఉండు అశక్తతయే ఆమె అట్లు కామదేవుని ఆరాధించుటకు కారణమైనది.

జ్ఞానము అతిశయించుటచేత కలిగిన ప్రేమ వలన కలిగిన అజ్ఞానముచే చేసినవన్నియు దోషరహితములే. "జ్ఞానము" అనగా భగవానునితో మనకుగల "శేషశేషి" సంబంధమును ఎరుగుట. అది దృఢముగ కలిగిననాడు జ్ఞానముయొక్క పరిపక్వస్థితియైన భక్తి కలుగును. కర్మకారణముగ కలిగిన అజ్ఞానము నిరసించ తగినదే. కాని ప్రేమాధిక్యముచే కలిగిన అజ్ఞానము ఆదరింపదగినది.

ఆండాళ్ తల్లి కామదేవుని ఆశ్రయించుట; "ఆళ్వార్‌నాయిక" (నాయికా భావముతో ఆశ్రయించిన శ్రీ నమ్మాళ్వారులు) "మడలెత్తుట"; (పిచ్చిదానివలె వీథులలో ఎగురుతూ తిరుగుట); వారు తమ తమ స్వామిని పొందుటకు చేసిన ప్రవర్తనలేకాని అన్యముకాదు.

"సిద్ధోపాయస్వీకారము" (భగవానుడే తప్ప వేరొక ఉపాయము లేదని దృఢముగా స్వీకరించుట) ను స్వీకరించినవారికి సర్వేశ్వరుడే విలంబమును, ఓర్వలేని శక్తిని, త్వరను కలిగించును. "శ్రీశఠకోపుల" వారికి స్వామి ఇట్టి జ్ఞానమునే (అజ్ఞానములేని భక్తిరూపమగు జ్ఞానమును)– "మయర్వఱ మతినలం అరుళినం"– అనుగ్రహించినాడు. సర్వేశ్వరుడే ప్రేమను కలిగించువాడును, పెంచువాడును అయియుండును అని ఆళ్వారులు సాయించినారు. "మడలెత్తుట" మొదలైనవి సిద్ధోపాయముతో సమానములే!

సాధ్యప్రావణ్యము, విలంబ అసహనము అనునవి రెండే సిద్ధసాధనమును స్వీకరించుటకు కారణములు. ఇవి వేగముగ భగవత్కైంకర్యము లభించుటకు ఉపకరించును. కాని ప్రతిబంధకములు కావు.

"ప్రావణ్యము" అనగా భగవత్ ప్రాప్తియందు అధికమైన ఆసక్తియే. ఇది ఆత్మగుణములన్నిటికి ప్రధానమైన కారణము. ఇట్టి ఆసక్తి కలుగుటచే శమదమాది ఆత్మగుణము లన్నియు కలుగును.

''శమము'' అనగా అంతఃకరణము లౌకికవిషయములపై ప్రసరింప కుండుట. ''దమము'' అనగా బాహ్యేంద్రియములు లౌకిక



విషయానుభవములందు ప్రసరింపకుండుట. అనగా అంతఃకరణ నియమనము "శమము". బాహ్యకరణ నియమనము "దమము".

ఈ శమదమములు రెండును ఉన్నచో "ఆచార్యుడు" లభించును. ఆచార్యుడు లభింపగానే "తిరుమంత్రము" లభించును. తిరుమంత్రము లభింపగనే శరణాగతుడైన జీవునకు (ప్రపన్నునకు) సర్వేశ్వరుడు వశమగును. సర్వేశ్వరుడు వశము కాగానే "శ్రీవైకుంఠము" అనెడి మహానగరము హస్తగతమగును. ఇదే "పరమపదము". మనకు ప్రాప్యమును ప్రాపకము అగు సర్వేశ్వరుని అనుగ్రహము కలుగును. ఇవన్నియు ఆత్మగుణములైన శమదమములచేతనే సిద్ధించును. ఇవి కలిగియుండుటయే ప్రపన్నుని లక్షణము

ప్రపన్నులు "మూడు" విధములుగ ఉందురు. 1. భక్తిపరవశులు 2. జ్ఞానులు 3. అజ్ఞానులు.

వీరికి భగవానుడు తప్ప వేరొక ఉపాయము ఉండదు. ముగ్గరికినీ ''నివృత్తిమార్గమే'' ఏర్పడును. ముగ్గురికి మూడు విధములుగా నివృత్తిమార్గమేర్పడును. ఇతర విషయములనుండి మనసు మరలుటయే "నివృత్తిమార్గము." ప్రపన్నులకు ఈ నివృత్తిమార్గమే ఆవశ్యకము.

**1. "భక్తిపరవశులు"**: వీరు భగవానుని దివ్యమంగళ విగ్రహమును దర్శించి, పారవశ్యము పొందెదరు. ఆమూర్తి దర్శనమున వేరొకటి అనుభవింపతగినది లేదు అనెడి జ్ఞానము కలుగును. స్వామియొక్క సౌందర్యముచేత వీరికి నివృత్తిమార్గము కలిగినది.

**2."జ్ఞానాధికులు"**: వీరు తాము పరతంత్రులమని భగవానుడే తమకు ఉపాయమై ఆయన తన కృపచేత తమను తనవద్దకు చేర్చుకొనును అను జ్ఞానము కలవారైయుందురు. ఇట్లు వీరికి భగవానుని కృపచేత నివృత్తిమార్గము కలుగును.

**3. "అజ్ఞానులు"**: వీరు జ్ఞానములేనివారు. వీరు తమ పెద్దల ఆచారములను చూచి, వాటినే అనుసరించుచు, తాము అనుసరింపరాని ఆచారములను వదలి

సదాచారములను స్వీకరింతురు. వీరికి పెద్దల ఆచారములను గమనించుటచే నివృత్తిమార్గము కలుగును.

ఇట్లు ఈ మూడువిధముల ప్రపన్నులకును నివృత్తిమార్గము ఏర్పడును.

ఈ విధముగా "ప్రపన్నులు" అనగా ఎట్టివారో, వారి లక్షణములు ఎట్టివో, వారి ఆచరణము ఎట్టిదో, వారు ఏ మార్గమున భగవానుని ఆరాధింతురో తెలుసుకొనినాము.

వీరి ఆరాధనలో అనగా ప్రపత్తిలో ఇతరోపాయములలో వలె దోషములు ఏమియులేవు. ఇది స్వరూపోచితము. సుకరము. మనసులో భగవానుడే ఉపాయమని స్వీకరించుట చాలును. ఏమియు చేయనక్కరలేదు.

భగవంతుని పొందవలెనని ఏవేవోచేయుట కూడ భగవత్ప్రపత్తికి విరుద్ధమే. తాను ఏమి చేయుచున్నను దానిని భగవానుడే తనను పొందించుకొనుటకు తానే చేయించుకొనుచున్నాడు అని భావింపవలెను. ఇది ఆత్మస్వరూపమునకు తగినది. స్వప్రయత్నమును మాని ఉండవలయును. నీవే దిక్కు అనుటయే కర్తవ్యము. ఈ విధముగా ప్రవర్తించుటయే ప్రపన్నుల లక్షణము.



# ప్రపన్నుని దినచర్య

"ప్రపన్నులు" అనగా ఎట్టివారో, వారి లక్షణములు ఎట్టివో, వారు ఏ మార్గమున భగవానుని ఆరాధింతురో తెలుసుకొనినాము. ప్రస్తుతము వారి దినచర్య ఎట్లుండవలెనో, ఎట్లుండునో తెలిసికొందము.

ప్రపన్నునియొక్క ప్రవర్తనయే అనగా నడవడియే అతని దినచర్య. ప్రపన్నుడు ఈ క్రిందివిధముగా తన దినచర్యను ఏర్పరచుకొని అనుసరించవలెను.

1. అహంకారమును కలిగియుండరాదు. అహంకారముకాని, దానివలన కలుగు విషయప్రావణ్యము కాని ఉన్నచో తనను తానే అసహ్యించుకొనును.

2. అహంకారమును వృద్ధి పొందించువారు సంసారులు. వీరిని చూచినచో పగపట్టిన పామును చూచినట్లుండవలెను.

3. అహంకారమును తొలగించువారు శ్రీవైష్ణవులు. వీరిని చూచినచో బంధువులను చూచినట్లు ఉండవలెను.

4. సర్వేశ్వరుని చూచినచో తండ్రిని చూచినట్లు ఉండవలెను.

5. ఆచార్యుని చూచినచో, ఆకలితోనున్నవాడు అన్నమును చూచినట్లు ఆదరముతో ఉండవలెను.

6. ప్రపన్నుడు తన శిష్యుని చూచినచో తనకు అభిమతమైన విషయమును చూచినట్లు ఉండవలెను.

ప్రపన్నుడు ఇట్లు తన దినచర్యను ఏర్పరచుకొని జీవనమును కొనసాగించవలయును.

ఇట్టి స్థితిని కలుగకుండా చేయునవి అహంకారము, అర్థము, కామము అనునవి. ఈ మూడింటిని ప్రపన్నుడు తనదరికి చేరనీయరాదు. వీటిని ప్రపన్నులు విడచియుందురు. అప్పుడు మాత్రమే సద్గుణములు కలుగును. ఇట్టి సద్గుణములే ఆత్మగుణములు. ఇవి తమంతటతాము కలుగవు. ఇతరు లెవరు కలిగింపలేరు కూడ. కేవలము ఆచార్యుల అనుగ్రహమువలననే కలిగిన భగవదనుగ్రహముచే

మాత్రమే ఇట్టి సద్గుణములు కలుగును. అని ప్రపన్నుడు నిశ్చయించుకొని ప్రవర్తించవలయును.

ఇట్లు ప్రవర్తించు దినచర్యను నిర్ణయించుకొనినచో ప్రపన్ననకు దేహయాత్ర యందు ఉపేక్ష కలుగును. ఆత్మయాత్రయందు అపేక్ష కలుగును. భౌతికమైన వస్తువులయందు, ఇవి అనుభవింపదగనివి అను బుద్ధి కలుగును. ఈ శరీరమును ధరించియుండుట భగవదారాధన కొరకే అని అనుకొనును. ఈ భగవదారాధనమే భగవదనుగ్రహమునకు హేతువు అగునని తలచును.

తన శరీరమునకు ఏదైనా క్లేశము కలిగినచో "కర్మఫలమే" అనియో; ఇది కూడ ఒకరకమైన భగవదనుగ్రహరూపమే అనియో బుద్ధి జనించును. తాను ఆచరించు ఆచరణము భగవత్ప్రాప్తికి సాధనము అనుబుద్ధి కలుగును.

ఒకవేళ వారు జ్ఞానాధికులైన భాగవతులు అయినచో, జ్ఞానానుష్ఠానములను తానుపొంది అనుసరించవలెనను వాంఛ కలుగును. భగవానుడు ప్రీతితో వేంచేసి యుండు దివ్యదేశములయందు మిక్కిలి ఆదరము కలుగును. భగవానునకు మంగళాశాసనము చేయుట తన కర్తవ్యముగా భావించును. ఇతరవిషయముల యందు రుచితగ్గిపోయి, భగవత్ప్రాప్తియందు ఆర్తి ఎక్కువ అగును.

ఆహారము స్వీకరించుటలో నియమపాలన చేయును. పెద్దలను అనువర్తింతురు. అనుకూలమైన వారితో కలసియుండవలెనని, ప్రతికూలురు అయినవారితో కలసి ఉండరాదను బుద్ధి జనించును.

ప్రపన్నుడు ఇట్టి ఆచరణము కలవాడై యుండి తన దినచర్యను నిర్వహించుచుండును. ఇట్లు తన దినచర్యను రూపొందించుకొనుటలో సదాచార్యుని అనుగ్రహము మాత్రమే సహాయపడునను విశ్వాసముతో ఉండును.

ప్రాప్యము, ప్రాపకము అనగా తనచే పొందబడువాడును పొందించువాడును, సర్వేశ్వరుడే అని భావించువారు ప్రపన్నులు. వీరు అట్టి ప్రవర్తననే కలిగియుందురు.



ప్రపన్నులైనవారు ఈ విధముగా, జ్ఞానానుష్ఠానములు గల సదాచార్యుల అనుగ్రహము వలననే తమకు కలుగవలసిన మంచిని అంతయును కలిగించుకొనుచు వృద్ధిపొందుదురు. సదాచార్యునియొక్క అనుగ్రహముపొందుటకు వారుచెప్పినట్లు ఆచరించుట ప్రధానము.

ఈ విధముగ ప్రపన్నుడు తన దినచర్యను ఆచరించువాడై ఉండవలెను.

ఇట్టి దినచర్య కలిగియుండి, సత్ప్రవర్తన కలిగియున్న ప్రపన్నులకు కొందరు అనుకూలురు ఉందురు. కొందరు ప్రతికూలురుందురు.

**1. <u>అనుకూలురు</u>:** జ్ఞానభక్తి వైరాగ్యములను వృద్ధి పొందించువారు అనుకూలురు. "జ్ఞానము" అనగా తత్త్వయాథాత్మ్యజ్ఞానము. "భక్తి" అనగా భగవంతుని ఒక్కనిపైననే నిరతిశయప్రేమ. ఈ రెండును కలిగిననాడు వైరాగ్యము కలుగును. ఈ విధముగా జ్ఞానము, భక్తి, వైరాగ్యము అను ఈ మూడే వైష్ణవులకు అలంకారములు. వీటినిబట్టియే శ్రీవైష్ణవుల గొప్పతనమును నిర్ణయించుట జరుగును.

కావుననే శ్రీమన్నాథమునులయొక్క దివ్య వైభవమును చెప్పుచూ, ఆళవందారు "వారు అచింత్యదివ్యాద్భుతా క్లిష్ట జ్ఞానవైరాగ్యరాశి అని, అగాధ భగవత్ భక్తిసింధువు" అని చెప్పినారు. వారి జ్ఞాన, భక్తి, వైరాగ్యములు అపూర్వములు. అందుచే అవి నవనవోన్మేషములు. అట్టివారు అనుకూలురు. వీరితో ప్రపన్నులు కలసియుందురు. ఇట్టి అనుకూలురు పరమఆర్తులై యుందురు.

ఒక పొలమునిండా నీరున్నచో, దాని ప్రక్కన ఉన్న పొలములో నీరులేకున్నను, నీరు ఉన్న పొలమునకు దగ్గరగా ఉండుటచే పదునుగా ఉండును. అట్లే జ్ఞాన భక్తి వైరాగ్యములు లేనివారై, స్వరూపమేమో తెలియనివారు, జ్ఞానభక్తి వైరాగ్యపరిపూర్ణులతో కలసియున్నచో, వారికి పూర్వమున్న శుష్కదశపోయి, జ్ఞానభక్తి వైరాగ్యములు కొద్దికొద్దిగా వృద్ధి పొందును.

ఇట్లు క్రొత్తగా ఆవిర్భవించుచున్న జ్ఞానభక్తి వైరాగ్యములను చూచినచో వారికి వారే "ఈ శరీరమే తమకు చరమశరీరమని నిశ్చయించుకొని, తగినట్లు

ఉందురు. ఈ శరీరమును వీడిననాడు మరొక శరీరమును పొంద నవసరములేదు. భగవత్ప్రాప్తి నిశ్చయము అని తమ మనసులో తమకే తెలియుచుండును."

**2. ప్రతికూలురు:** సహవాసము చేయకూడనివారు ప్రతికూలురు. ఈ ప్రతికూలురు దేహాత్మాభిమానులు, స్వతంత్రులు, అన్యశేషభూతులు, ఉపాయాంతరనిష్ఠులు, స్వప్రయోజనపరులు అని అయిదు విధములుగా ఉందురు.

(అ) **దేహాత్మాభిమానులు:** తమ శరీరమును యథార్థస్థితిలో ఉంచుకొనుటకు తగిన పోషక పదార్థములను, భోగ్యపదార్థములనుపెట్టి, దేహమును బాగుగా పోషించుకొను మనుష్యులు కొందరు ఉందురు కదా! వారిని ఈ దేహాత్మాభిమానులు ఆదరించుచుందురు. వీరు పొంద గోరునవి ఐహికభోగములు.

(ఆ) **స్వతంత్రులు:** వీరు దేహముకంటె ఆత్మ వేరుగా ఉన్నదని ఎరుగుదురు. కాని, తాము స్వతంత్రులమని భావింతురు. వీరు స్వర్గాదిలోకములలో నుండు భోగములను పొందుటకు యజ్ఞయాగాదులను చేయుచు ఇంద్రాది దేవతలను ఆరాధించుచుందురు. ఆయా పైలోకములలో నుండు భోగములు, యజ్ఞయాగాది కర్మలు వీరికి ఉపాయము. స్వర్గాదిభోగములు ఉపేయము.

(ఇ) **అన్యశేషభూతులు:** వీరు భగవంతునికి ఇష్టము వచ్చినట్లు వినియోగ పడదగినవారమని శేషత్వమును అంగీకరింతురు. కాని ఆ శేషత్వము శ్రీమన్నారాయణునికే అని వీరికి తెలియదు. ఆయా దేవతలనే ఫలప్రదులని తలచి, వారినే తాము దేవతలనుగా ఆరాధింతురు. బ్రహ్మరుద్రాది దేవతలు వీరి ఉద్దేశ్యము అనగా ఉపాయము. వీరు వారిని ఆశ్రయింతురు. ఆయా దేవతలయొక్క సాయుజ్యమే వీరికి ఉపేయము. అనగా వారితో సమానమైన భోగము కలవారై యుండుట.

ఇచట మనము తెలుసుకొనవలసినది మోక్షము ఎన్నివిధములు అనునది. మోక్షము అయిదు విధములుగ ఉందును. (i) సాలోక్యము, (ii) సామీప్యము, (iii) సారూప్యము, (IV) సాయుజ్యము (V) సార్ష్టిత"



(i) **సాలోక్యము:** ఒకే లోకమునందు తాము ఆరాధించు దేవతలతో కలసిఉండుట "సాలోక్యము."

(ii) **సామీప్యము:** వారి సన్నిధిలోనే ఉండుట "సామీప్యము."

(iii) **సారూప్యము:** వారు ఎట్టిరూపమును కలిగియుందురో అట్టిరూపమును కలిగియుండుట "సారూప్యము."

**(IV) సాయుజ్యము:** వారితో సమానమైన భోగము లేదా సమానమైన గుణములను కలిగియుండుట "సాయుజ్యము."

**(V) సార్ష్టిత:** వారు అనుభవించుభోగములో తారతమ్యము లేకుండా ఉండుట "సార్ష్టిత."

(ఈ) **ఉపాయాంతరనిష్ఠులు:** వీరికి మోక్షసాధనములు (ఉపాయములు) శాస్త్రసిద్ధములైన కర్మ, జ్ఞాన, భక్తియోగములు. వీరికి పొందదగినది (ఉపేయము) నిరతిశయానందరూపమగు భగవదనుభవము. ఉద్దేశ్యము దేవతాంతర అంతర్యామి అయిన సర్వేశ్వరుడు.

(ఉ) **స్వప్రయోజనపరులు:** తాము ప్రపత్తిని సులువుగా చేయవచ్చునని తలతురు. అత్యంత సులభుడైయున్న అర్చావతారమును ఉపాయముగా భావింతురు. తమప్రీతికై అర్చామూర్తికి చేయు కైంకర్యము వీరికి ఫలము. (ఉపేయము).

వీరందరును ప్రపన్నులకు ప్రతికూలురు.

దేహాత్మాభిమానులు, స్వతంత్రులు, అన్యశేషభూతులు అను ముగ్గురు భగవద్విషయమైన వాసన ఏ మాత్రము లేనివారు. వీరిని సర్వేశ్వరుడు "క్షిపామి" అని ''గీత'' లో చెప్పినట్లు సంసారములో పడవేయుచుండును. వీరు భగవన్నిగ్రహపాత్రులు.

ఉపాయాంతరనిష్ఠులు, స్వప్రయోజనపరులు అను రెండు రకములవారు ప్రపత్తిని ఉపాయముగ స్వీకరింతురు. కర్మ, జ్ఞానము మొదలైన

ఇతరోపాయములను ప్రపత్తికి ఉపాయముగ స్వీకరించిననూ, తమ ప్రయత్నముచేత, తమప్రీతికొరకు ఇతరోపాయములను ఆశ్రయించిననూ, వీరు తనను (సర్వేశ్వరుని) పొందవలయునని కోరుచున్నారు కనుక, వీరిని సర్వేశ్వరుడు అనుగ్రహించును. వీరు భగవదనుగ్రహపాత్రులే. వీరుకూడ ప్రపన్నులకు ప్రతికూలురే. అయితే వీరిలో, ఆశ్రయజన్యదోషమైన స్వప్రయోజనమును కావలెను అని అనుకొను స్వప్రయోజనపరులు మాత్రమే ప్రతికూలురు. విషయదోషముచే అట్టి అనుభవమును పొందినవారు ప్రతికూలురు కారు.

ఈ రెండవకోవకు చెందినవారు శ్రీ నమ్మాళ్వారులు. కనుక వారిని ప్రతికూలురుగ భావింపరాదు.

పెరుమాళ్లను సేవించినందువలననే ఆనందము కలిగినది అని భావించుట విషయదోషము చేత వచ్చినను, తాము ప్రార్థించినందున తాము పొందినందువలన తమకు ఆనందము కలిగినదనుకొనుట స్వరూపవిరుద్ధముకాదు.

భగవానుని అనుభవించునపుడు, తనలో ఏ విధమైన దోషములు లేకపోయినను, ఆ సర్వేశ్వరునియొక్క దివ్యమంగళ విగ్రహ వైశిష్ట్యము ఆనందమును కలిగించును. అట్లు కలిగిన ఆనందము స్వప్రయోజనముకాదు. అది భగవానుని యందలి ప్రత్యేకత. దానిని తొలగించుటకు శక్యముకాదు. కావున ఇది స్వరూప విరుద్ధము కాదు. ఇట్టివారిని ప్రతికూలురుగ భావింపరాదు.

ఇట్లున్న అనుకూల ప్రతికూలురలో, అనుకూలురతో మాత్రమే సంబంధము కలిగి యుండునట్లు తమ దినచర్యను నిశ్చయించుకొని ప్రవర్తించుట ప్రపన్నుల కర్తవ్యము.



# భగవత్ కైంకర్యము

భగవానుని ముఖ వికాసమునకై ఎట్టి కైంకర్యము చేయవలయునో శాస్త్రములలో నిర్దేశింపబడియున్నది . శేషభూతుడైన చేతనుని కర్తవ్యము భగవానుని ప్రీతికారిత కైంకర్యమే. కనుక దానిని గురించి తెలుసుకొందము.

కైంకర్యము రెండువిధములుగ ఉండును. ఇష్టమైన వ్యాపారములను చేయుట అని, అనిష్టములను మానుట అని రెండు విధములుగ ఉండును.

తన వర్ణాశ్రమధర్మములను, భగవత్ ప్రీతికొరకు అనుకొని ఆచరించుట ఇష్టకైంకర్యము. ఇది భగవానునకు ఇష్టముగా ఉండును. వర్ణాశ్రమధర్మములను తన ప్రీతికొరకు అని ఆచరించుట భగవానునకు అనిష్టములుగా ఉండును. ఇట్టిది అనిష్ట కైంకర్యము.

వర్ణాశ్రమ ధర్మములను ఆచరించుట అనునది ఉపాధియైన శరీరమును బట్టి వచ్చినది. అందుచేత ఇది ఔపాధికము, అనిత్యముకూడ. నిరుపాధికమును, నిత్యమును అయిన శేషభూతమైన ఆత్మస్వరూపమును ఎరిగి దానికి అనుగుణముగ ప్రవర్తించుట సర్వేశ్వరునకు ఇష్టము. దానికి విరుద్ధముగా వర్ణాశ్రమ ధర్మములను ఆచరించుట అనిష్టము.

శాస్త్రములలో భగవదనుగ్రహమునకు హేతువుగా కొన్ని కర్మలను చెప్పినారు. కాని అవి మోక్షమునకు విరుద్ధములు. అందుచే శాస్త్రములలో పుణ్యములని చెప్పిన వాటిని కూడ చేయుటకు ప్రపన్నుడు భయపడుచుండును.

మోక్షమునందు కోరిక కలవాడు, పుణ్యముకూడా మోక్షమునకు విరుద్ధమైన పాపము అని భావించును. కాని చేతనుడు చేయు పాపమును కూడ ఆ సర్వేశ్వరుడు తన సహజ వాత్సల్యగుణముచేత పుణ్యముగా భావించును.

భగవదనుగ్రహమును పొంది భగవానుడే మోక్షమునకు సాధనమని భావించిన భక్తులు పుణ్యపాపములను రెండింటిని కూడ అవి తనకు అంటకుండా ఉండి భగవానునితో పరమసామ్యమును పొందును.

సర్వేశ్వరునియొక్క కైంకర్యమును కొందరు భక్తిచే చేయుదురు. కొందరు భయముతో చేయుదురు. ఏ విధముగ చేసినను ఆ కైంకర్యము ఆత్మసిద్ధికి ఆవశ్యకమే. భక్తితో కైంకర్యముచేయుటయే శ్రేష్ఠము. అదిలేనినాడు భీతితోనైనను భగవానుని కైంకర్యము చేయవలయును.

భగవంతునియందు నిరతిశయప్రేమ కలవారు భక్తిమూలముగా కైంకర్యము చేయుదురు. శేషత్వసిద్ధికి భగవత్ కైంకర్యము చేయవలయునని, లేనిచో శేషత్వమునకు హానికలిగి, స్వరూపమే నశించునని భయముతో కొందరు భగవత్ కైంకర్యమును చేయుదురు. భయముచేత కూడ కైంకర్యము చేయనివానికి, భగవన్ముఖ వికాస హేతువైన కైంకర్యమే లేకపోవుటచే, "శేషత్వమే" అనెడి యోగ్యతే లేకుండా పోవును. కైంకర్యము చేసిననాడే అతనికి, శేషియైన సర్వేశ్వరుని "కృప" అనెడి ఉపాయము లభించును.

కైంకర్యమును, దృష్టములగు ఫలములకుగాని, అదృష్టములైన మోక్షమునకుగాని సాధనమని భావింపరాదు. కైంకర్యము చేయుటయే ఫలము. కాని కైంకర్యము చేయుటచే ఫలము కలుగునని భావింపరాదు. ఇట్లు కైంకర్యముచేసి, ఫలమును ఆశించకుండా, భగవానునికే ఇంకను ఏమైనా కైంకర్యము చేసిన బాగుండునని తలచుచుండవలెను.

ఆండాళ్ "తిరుమాలిరుంజోలై" అను దివ్యక్షేత్రములోని పెరుమాళ్లకు ఒక గంగాళము "అక్కారివడిశెల్" (పాయసమువంటిది) కైంకర్యముచేసినది. అక్కడ వేంచేసియున్న "సుందరబాహుపెరుమాళ్" తాను సమర్పించిన ఒక గంగాళము "అక్కారివడిశెల్" స్వీకరించినచో "నీకు ఇంకను నూరు గంగాళములు"అక్కారివడిశెల్" నివేదనముచేసి కైంకర్యమును చేయుదును." అని ఆండాళ్తల్లి అనినది. కైంకర్యమును ఇట్లు చేయవలయును.

ఇట్లే శ్రీ విదురులు, శ్రీ మాలాకారులు, కుబ్జ అనువారు ఏ ప్రయోజనమును అపేక్షింపకనే స్వామి కైంకర్యము చేసినారు.

ఈ విధముగా కైంకర్యము చేయుటకుముందు, కైంకర్యము చేసినపుడు కూడ, అనన్య ప్రయోజనులై చేయుటచే, స్వరూపము బాగుగా ప్రకాశించును.



భగవానుని కైంకర్యము చేయుటకు ముందు నాలుగు అవస్థలు అనగా దశలు ఉండును. జ్ఞానదశ, వరణదశ, ప్రాప్తిదశ, అనుభవదశ అనునవి ఉండును.

(1) **జ్ఞానదశ:** ఆచార్యుని ఉపదేశముచే చేతనునకు జ్ఞానము కలిగి అజ్ఞానముతొలగి, భగవానుడే ప్రాప్యము, ప్రాపకము అను జ్ఞానము కలుగును.

(2) **వరణదశ:** ఆచార్యోపదేశముచేత భగవానుడే సిద్ధోపాయమని ఎరిగి, ఇతరోపాయములను వదలి, ఆ సర్వేశ్వరుడే తనకు ఉపాయమని వరించును. (కోరి స్వీకరించును).

(3) **ప్రాప్తిదశ:** ఇతరోపాయత్యాగముచేసి, ప్రపన్నుడు సర్వేశ్వరునే ఉపాయమని స్వీకరించును. ఇట్లు స్వీకరించుటచే భగవత్ప్రాప్తి కలుగును.

(4) **అనుభవదశ:** ప్రాప్తిదశ కలిగిన తరువాత, అట్లు భగవానుని పొందుటచే భగవదనుభవము కలుగును.

ఈ నాలుగుదశలు కలిగిన తరువాత, ఆ అనుభవముచే ప్రీతి కలుగును. ఆ ప్రీతిచే, ఆ ప్రీతి ప్రేరణచే భగవానుని కైంకర్యమును చేతనుడు చేయును; చేయవలయును.

# భగవదపచారము

శాస్త్రములు నిషేధించినవి చేయరాదు. వీటిని నిషిద్ధములు అందురు. వీటిని చేసినచో భగవదపచారము చేసినట్లే.

ఈ నిషిద్ధములు నాలుగు రకములు (1) శాస్త్రములు నిషేధించినవి చేయుట(2) భగవానుని విషయములో అపచారము చేయుట (3) భాగవతుల విషయములో అపచారముచేయుట(4) ఆచార్యుల విషయములో అపచారము చేయుట– ఈ నాలుగు నిషిద్ధములు.

పరహింస, అసత్యకథనం, పరస్తోత్రం, పరదార పరిగ్రహం, పరత్వస్వాపహారం, అభక్ష్యభక్షణం, అకృత్యకరణము, కృత్యాకరణము. ఈ ఎనిమిది నిషిద్ధములు. ఇవిగాక–

(1) **మానసిక నిషిద్ధములు:** ఇతరుల వస్తువులను పొందవలయునని మనసులో తలచుట, ఒకరికి కీడుకలిగిన బాగుండునని తలచుట, తగనిచోట పట్టుదల కలిగియుండుట– ఇవి మానసిక నిషిద్ధములు.

(2) **వాగ్రూప నిషిద్ధములు:** ఎదుటివారి మనసు బాధపడునట్లు మాట్లాడుట, (పారుష్యము), ఉన్నదానిని లేనట్లుగాచెప్పుట, ఒకరిపై మరొకరికి నిందలు చెప్పుట, సంబంధములేని ప్రలాపములుచేయుట– ఇవి వాగ్రూప నిషిద్ధములు.

(3) **శారీరక నిషిద్ధములు:** ఒకరి వస్తువును వారి అనుమతి లేకుండగనే తీసికొని అనుభవించుట, శాస్త్రోక్తముకాని హింసలుచేయుట, పరస్త్రీగమనము– ఇవి శారీరక నిషిద్ధములు.

ఇట్టి దోషములుచేయుట భగవదపచారము.

**మరికొన్ని భగవదపచారములు:**

(1) సర్వేశ్వరుడైన శ్రీమన్నారాయణుని ఇతరదేవతలతో సమానముగ భావించువాడు పాషండుడు. అట్టివారికి కర్మాధికారములేదు. శ్రీమన్నారాయణుని ఇతర దేవతలతో



సమానముగా భావించినవాడు సూర్యచంద్రులున్నంత కాలము ఘోరమైన నరకమును పొందును. శాస్త్రములు, ఉపనిషత్తులు నారాయణుని సర్వేశ్వరుడని, సమానాభ్యాధిక రహితుడని చెప్పుచుండగా అట్టి సర్వేశ్వరుడగు నారాయణుని బ్రహ్మరుద్రాది దేవతలతో సమానముగా భావించుట భగవదపచారము.

(2) రామ కృష్ణాద్యవతారములను మనుష్యులతో సమానముగా భావించుట భగవదపచారము. "సంభవామ్యాత్మమాయయా" అని భగవద్గీతలో తన అవతార రహస్యమును స్వామి చెప్పినాడుకదా!

(3) వర్ణాశ్రమములకు వ్యతిరేకముగా ఆచరించుట భగవదపచారము. భగవదారాధన చేయునపుడు త్రైవర్ణికులు (బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యకులీనులు) చేయతగిన వైదిక మంత్రములతో చతుర్థవర్ణమువారు ఆరాధించుట భగవదపచారము.

(4) అర్చామూర్తినిచూచి ఇది ఏ పదార్థముతో చేయబడినది? అని విచారించుట భగవదపచారము. భక్తులు ఏ రూపములను కల్పించుకొని, స్వామి ఈ రూపములో నన్ను అనుగ్రహింపవలెను అని కోరునప్పుడు అది శిలయైనను, లోహమైనను, దానిని తనశరీరముగ భగవానుడు స్వీకరించును. దానిలో ఉండి అప్రాకృతమగు దివ్య విగ్రహమును ఆదరించునట్లు దానిని ఆదరించును.

(5) ఆత్మ భగవత్ పరతంత్రము. అట్టి ఆత్మను స్వతంత్రముగా భావించుట ఆత్మాపహారము. భగవానుని సొత్తును తాను అపహరించినట్లు అగును. కనుక ఇది భగవదపచారము.

(6) భగవానునకు నివేదింపతగిన, ఉపయోగింపతగిన పదార్థమును, అందరకు తెలియునట్లుగాని, తెలియకుండా కాని తాను అనుభవించుట భగవదపచారము.

భగవానునకు చెందిన వస్తువులను తాను అపహరించుట మాత్రమే కాదు. అపహరించువారికి సహకరించుట కూడ భగవదపచారమే. ఎవరైనను అట్లు అపహరించి తెచ్చిన వస్తువును స్వీకరించుటకూడ భగవదపచారమే.

అహంకారముచేత శ్రీవైష్ణవులను మనసులో విరుద్ధభావముతో భావించుట భాగవతాపచారము. శ్రీవైష్ణవులను ధిక్కరించుట, తిరస్కరించుట, న్యూనపరచుట కూడ భగవదపచారములే. ఇట్టి భాగవతాపచారములు చేయుట కూడ భగవదపచారమే.

అపచారములలో ఇట్టి భాగవతాపచారములను భగవానుడు ఏ మాత్రము సహింపడు. అందుచేత వీటిని "అసహ్యాపచారములు" అందురు.

ఇట్లే ఆచార్యుడు ఉపదేశించిన మంత్ర, మంత్రార్థములను ఆచరింపకపోవుట కూడ అసహ్యాపచారమే. ఆచార్యాపచారము. ఆ ఆచార్యులను ఆశ్రయించిన భక్తులకు అపచారము చేయుట కూడ అసహ్యాపచారమే.

పైనచెప్పిన అపచారములలో భాగవతాపచారము అతి క్రూరమైనది. " నాకు అపచారము చేసిన వారికంటె నా భక్తులైన భాగవతులకు అపచారము చేసిన వారిని నేను ఎప్పుడూ క్షమించను"– అని స్వామి స్వయముగానే చెప్పినాడు. ఇట్టి అపచారమును స్వామి సహింపడు. అంత క్రూరమైనది ఈ భాగవతాపచారము.

కావున, భగవదపచారములను ఎన్నడూ చేయరాదు. భగవత్ కైంకర్యము చేయుచు, స్వరూపమును ఉజ్జ్వలము కావించుకొనుచు తమ తమ జీవితములను ధన్యము చేసికోవలయును.



# భాగవత సంబంధము

అహంకారము, విషయప్రావణ్యము అను రెండును స్వరూపమును నాశనముచేయును. ఇవి లేనివారే "భాగవతులు".

''అహంకారము'' అనగా ''దేహమే నేను'' అనుకొనుట. ఇది అగ్నిస్పర్శవంటిది. నిప్పు దేనిని అంటుకొన్నను దానిని కాల్చి, రూపము లేకుండా చేయును. ఆ విధముగానే దేహమునే ఆత్మ అని భావించినచో ఆ అహంకారము ఆత్మనే లేకుండా చేయును. జితన్తాస్తోత్రములో, రామాయణములో, స్తోత్రరత్నములో, తిరువాయిమొళిలో అహంకారము ఎంతచెడ్డదో స్పష్టముగా తెలుపబడినది.

అహంకారముతో కూడినదైనచో అది మోక్షమువంటిదైననూ విడువదగినదే అని వీటి సారాంశము.

ఇక రెండవది "విషయప్రావణ్యము''. ఇది అనుకూలమనియు, ప్రతికూలమనియు రెండువిధములు. శాస్త్రములలో విధింపబడినవి, లోకవిరుద్ధములు కానివి, నరకహేతువు కానివి మొదలగునవి. "అనుకూల విషయములు. శాస్త్రనిషిద్ధ విషయములు, లోకమునకు విరుద్ధమైనవి, అందరు నిందించునవి, నరకహేతువు అయినవి "ప్రతికూల విషయములు."

ప్రతికూల విషయములు విషమువలె ప్రాణములను వెంటనే హరించును. అట్లుగాక అనుకూల విషయములను ఆదరించుటకూడ ఆత్మనాశనమునకు హేతువే అగును. వీటిని అనుభవించుటచేత వానియందు అనురాగమేర్పడి మన స్వరూపమును మరుగుపరచును. ఇట్లు ఈ రెండును ఆత్మస్వరూప నాశమునకే కారణ మగుచున్నవి.

దాహమువేయుచున్నదని అగ్నిజ్వాలను మ్రింగినట్లు, నీడకావలయునని పడగవిప్పి ఆడుచున్న పాముపడగను ఆశ్రయించుటకు ప్రయత్నించినట్లే! తాత్కాలికసుఖము లభించినను, శబ్దాదివిషయములను అనుభవింపవలెనని తలచుట ఆత్మకు హానిని కలిగించును. ఈ రెండును లేనివారు భాగవతులు.

వీరితో మాత్రమే సంబంధము పెట్టుకొనవలెను. జ్ఞానానుష్ఠానము లేకపోయినను, భాగవత సంబంధమున్నచో మనకు భగవత్ప్రాప్తి కలుగును.

భాగవతులలో కొందరు గొప్పవారుందురు. వీరు జ్ఞానానుష్ఠానములు పూర్తిగా కలవారు. కొందరు జ్ఞానానుష్ఠానములచేత తక్కువవారుందురు. ఉత్కృష్టులైనవారి సంబంధమే భగవత్ప్రాప్తిని కలిగించుననియు, జ్ఞానానుష్ఠానములు తక్కువ కలవారి సంబంధముగాని, జ్ఞానానుష్ఠానములేని వారి సంబంధముగాని భగవత్ప్రాప్తిని కల్గించదనియు భావించరాదు. భాగవతులు అయినంతమాత్రముననే వారి సంబంధము మోక్షమును కలిగించును. వారివిషయములో చేసిన అపచారము మోక్షమునకు ప్రతిబంధకమే అగును.

ఈ విషయమును "కైశిక" వృత్తాంతము మనకు తెలుపుచున్నది.

**కైశిక వృత్తాంతము:**

"సోమశర్మ" అను బ్రాహ్మణుడు ఒకయాగము చేయుటకు సిద్ధపడి, ఆ యాగమును యథాక్రమమున చేయలేనివాడై యాగము పరిసమాప్తి చెందకముందే చనిపోయినాడు. దానివలన అతడు బ్రహ్మరాక్షసుడై తిరుగుచున్నాడు.

ఇట్లుండగా ఒకనాడు అతనికి ఒక చండాలుడు కనిపించినాడు. అతడు మహా విష్ణుభక్తుడు; భాగవతోత్తముడు. ఉత్థానైకాదశి (కార్తికశుద్ధఏకాదశి) నాడు "తిరుక్కురుంగుడి" అను దివ్యదేశములో ఉన్న నంబిని గురించి పాటపాడి వారినుండి పురుషార్థమును (మోక్షమును) పొందవలెనని వెళ్ళుచుండెను. బ్రహ్మరాక్షసుడు అతనిమీదపడి భక్షించుటకు ఉద్యుక్తుడైనాడు. అప్పుడు ఆ చండాలుడు "ఆ స్వామి సన్నిధిలో గానము చేసి తిరిగివచ్చి నీకు ఆహారము అయ్యెదను" అని నమ్మకముగా పలికినాడు. బ్రహ్మరాక్షసుడు అంగీకరించినాడు.

ఆ చండాలుడు స్వామి సన్నిధికి వెళ్లి గానము చేసి, సంతోషించినవాడై త్వరత్వరగా ఆ బ్రహ్మరాక్షసుని వద్దకువచ్చి "ఇపుడు నన్ను భక్షింపుము" అనినాడు.



కాని సోమశర్మ (బ్రహ్మరాక్షసుడు) అతని సత్యవాక్పరిపాలనకు సంతోషించి, "నిన్ను భక్షింపను. వదలి వెళ్లెదను. కాని నీవు ఈనాడు స్వామి సన్నిధిని పాడిన పాటలఫలమును నాకు ఇమ్ము'' అనినాడు. చండాలుడు అంగీకరించలేదు. తుదకు సోమశర్మ ఆ భాగవతుని (చండాలుని) శరణువేడి తన బ్రహ్మరాక్షసరూపమును తొలగించుమని వేడుకొనినాడు. ఆ చండాలుడు తాను చివరగాపాడిన "కైశికరాగము" యొక్క ఫలమును ఆ బ్రహ్మరాక్షసునకు ధారపోసినాడు. దానితో సోమశర్మకు బ్రహ్మరాక్షసత్వము పోయినది. అతడుగూడ భాగవతుడై ఉజ్జీవించినాడు.

అందుచే ఉత్కృష్టమైన జన్మము కలవాడైనను, నికృష్టమైన జన్మము కలవాడైనను భాగవతులు అయినచో వారితో సంబంధము కారణముగా ఉజ్జీవింపవచ్చును. ఈ వృత్తాంతమును ''వరాహపురాణము'' లో వరాహమూర్తి భూదేవికి చెప్పినాడు.

జన్మచేతను, నడవడిచేతను, గొప్పవారలైయుండుట లేదా తక్కువ వారలైయుండుట భగవత్ప్రాప్తికి నిమిత్తములు కావు. ఇద్దరిలో ఎవరికిగాని భాగవత సంబంధము ఉండుటయే భగవత్ప్రాప్తికి నిమిత్త మగును.

జన్మచేత ఉత్కృష్టులైనవారు ఆభిజాత్యముచేత అహంకారము కలవారై ఉండుటకు అవకాశముండును. అయినను వారు భాగవతులను అనువర్తించునపుడు "శేషత్వము" అనెడి స్వరూపోచితమైన నైచ్యమును భాగవతులు అనుసరించుట చూచి, అహంకారము కలుగుటకు అవకాశమున్న వారు కూడ నైచ్యమును నేర్చుకొందురు. జన్మచేత నికృష్టులైన వారికి ఆభిజాత్యమే ఉండదు. కాబట్టి దాస్యమును స్వీకరించుటకు అనుకూలముగ ఉండును. వారికి నైచ్యము జన్మసిద్ధముగనే వచ్చును.

**–" శ్వపచోఽపి మహీపాల! విష్ణుభక్తో ద్విజాధికః,**

**విష్ణుభక్తివిహీనస్తు యతిశ్చ శ్వపచాధమః" –** అని ప్రమాణము.

శ్రీరంగనాథుడు తిరుప్పాణి ఆళ్వారును లోకసారంగమహామునిచేత వహింపజేసి ఈ విషయమునే కృప చేసినారు కదా! ఆ రోజునుండి తిరుప్పాణి ఆళ్వారు "మునివాహనులు" అని పిలువబడినారనికూడ మనకు తెలియును.

జన్మసిద్ధముగ తక్కువవారైనవారు భాగవత సంబంధముచేత నికృష్టజన్మముచే వచ్చిన దోషము పోయి శ్రేష్ఠులగుదురు. ఇట్లు అయినవారిని భాగవతులతో సమానులుగా లేదా అధికులుగానే చూడవలయును గాని తక్కువగా వారిని చూడరాదు.

(i) – మద్భక్తం శూద్రసామాన్యాత్ అవమన్యంతి యే నరాః,

నరకేష్వేవ తిష్ఠంతి వర్షకోటి ర్నరాధమాః "

(ii) – చండాలమపి మద్భక్తం నావమన్యేత బుద్ధిమాన్"

(iii) – సర్వవర్ణేషు తే శూద్రాః యే హ్యభక్తాః జనార్దనే–

(iv) – "నెడుమార్కడిమై" అను తిరువాయిమొళిలో భాగవతులే తమకు పరమప్రాప్యులు అని నమ్మాళ్వారులు సాయించినారు.

ఇదే విధముగా తిరుమంగైయాళ్వారు, కులశేఖరాళ్వారు, తొండరడిప్పొడి యాళ్వారు మొదలైనవారు సాయించినారు.

భాగవతవైభవమును శిష్టుల ఆచారముచే కూడ ఎరుగవచ్చును. విభీషణుడు జన్మచే రాక్షసుడు. "సీతాదేవిని రామునకు ఒప్పగించుము" అని రావణునకు హితముచెప్పినాడు. విభీషణుడు తమతో చేరిన తరువాత అతనిని శ్రీరాముడు తనవానిగానే తలచినాడు.

శ్రీరామచంద్రప్రభువు తన ఆచరణలోకూడ భాగవతవైభవమును ప్రకాశింపజేసినాడు. తనకొరకై ప్రాణమును వదలిన జటాయువునకు బ్రహ్మమేధ సంస్కారము చేసినాడు. బ్రహ్మమేధ సంస్కారమును మహాపురుషులకు మాత్రమే చేయుదురు. జటాయువు భాగవతోత్తముడు అగుటయే ఇందులకు కారణము.



విదురుడు శూద్రుడు. అయినను మహాభక్తుడు. అందుచే అతనికి ధర్మరాజు బ్రహ్మమేధ సంస్కారము చేసినాడు.

ధర్మవ్యాధుడు హీనజాతిలో జన్మించినవాడు. అయినను, ఋషులు, మునులు, ధర్మవ్యాధునివద్ద ధర్మవిషయములను తెలుసుకొనుచుండెడివారు.

శ్రీకృష్ణుడు ధర్మసంస్థాపనకై అవతరించినవాడు. కౌరవుల వద్దకు రాయబారిగ వెళ్లినప్పుడు. భీష్మద్రోణులను వదలి, విదురుని ఇంటికి చేరి ఆరగించినాడు. వర్ణాదులచే శ్రేష్ఠతరాదు. కేవలము భక్తిచే మాత్రమే శ్రేష్ఠత అని ఆచరణపూర్వకముగ శ్రీకృష్ణుడు చూపినాడు. విదురుడు మహాభక్తుడు. ఆయన మహాభాగవతోత్తముడు.

ఈ విధముగ భాగవతవైభవమును అనేక స్థలములలో మనము చూచెదము. అట్టి భాగవత సంబంధమే భగవత్ప్రాప్తిని కలుగచేయును అని పెద్దలు చెప్పుచున్నారు.

## భాగవతాపచారము

అహంకారము, విషయప్రావణ్యము అను రెండును స్వరూపమును నాశముచేయునని తెలుసుకొనినాము. ఇంతేకాదు. వాటివలన భాగవతాపచారము కూడా చేసినట్లగును.

వైష్ణవులమని పేరు కలిగియుండి భగవద్దాస్యము లేకుండా ఉండువారు భాగవతాపచారము చేసినవారగుదురు. భాగవతులయందు ప్రీతిలేనివారు ఆకారముచేతనే వైష్ణవులుకాని వైష్ణవత్వము కలిగినవారు కారు.

"భాగవతాపచారము చేసిననాడు వారిని సర్వేశ్వరుడు సహింపలేక తగిన దండనమును విధించును" అని నంజీయరువారు కృపచేసినారు.

భాగవతాపచారము ఎంత క్రూరమైనదో భగవానుడు చెప్పినాడు కూడ.

**శ్లో "యా ప్రీతిర్మయి సువ్యక్తా మద్భక్తేషు తథాస్తు తే,**
**అవమానక్రియా తేషాం సంసరత్యఖిలం జగత్"–**

భాగవతాపచారము అనేక విధములుగ ఉండును. వాటిలో ముఖ్యమైనవి పన్నెండు.

(1) **జన్మనిరూపణము:**

**"న శూద్రాః భగవద్భక్తాః విప్రా భాగవతాః స్మృతాః,**
**సర్వవర్ణేషు తే శూద్రాః యే హ్యభక్తా జనార్దనే".**

విష్ణుభక్తుడైన వాడైనచో అతనిని ఏ వంశములో జన్మించినాడని సంశయింపరాదు. అతని పనులను విమర్శింపరాదు.

(2) **వయః పరిపాక నిరూపణము:** బాలుడు, యువకుడు, వృద్ధుడుఅనెడి వయోభేదమును బట్టి వారిని కించపరచరాదు.

(3) **శరీర నిరూపణము:** విష్ణుభక్తి కలిగినవ్యక్తి స్త్రీయా, పురుషుడా, ఖేచరమా, జలచరమా అని ఈ విధములుగా విమర్శింపరాదు.



(4) **ఆశ్రమ నిరూపణము:** వారు బ్రహ్మచర్యాది ఆశ్రమములలో దేనికి చెందినవారని విమర్శింపరాదు.

(5) **అవయవ నిరూపణము:** భక్తుల శరీరములోని అవయవములు ఏవైనా లోపము కలిగియున్నచో వాటినిచూచి పరిహసించరాదు.

(6) **ఆలస్య నిరూపణము:** భక్తులు వైరాగ్యముచేకాని, అస్వస్థతవలనకాని తన శరీర స్వాస్థ్యవిషయములో అశ్రద్ధగా ఉన్నచో వారి మలినశరీరమును చూచి అసహ్యించుకొనరాదు. వారిలోని భక్తిభావమునే గమనించవలెను.

(7) **నివాస నిరూపణము:** ఈ భక్తుడు శ్రీరంగము, తిరుపతి వంటి పుణ్యక్షేత్రములలో నివసించినచో ఎంత బాగుండెడిది? మారుమూల ప్రాంతములోనో, అరణ్యములలోనో నివసించుచున్నాడే అని తలచి ఆయా ప్రదేశములలో నున్న నివాసములనుబట్టి వారిని గౌరవించుటగాని, అవహేళన చేయుటగాని చేయరాదు.

(8) **బంధు నిరూపణము:** భక్తుని బంధువులు ఎవరైనా గొప్పవారున్నారా? అని ఆలోచించి వారి సంబంధమును బట్టి అతనిని గొప్పవానిగాను తక్కువవానిగాను తలచరాదు.

(9) **ప్రకాశ నిరూపణము:** ప్రకాశము అనగా వారి వారి కీర్తిప్రతిష్ఠలు. కీర్తిప్రతిష్ఠలు కలవారిని గౌరవించుటయు, లేనివారిని అగౌరవించుటయు చేయరాదు.

(10) **ప్రకార నిరూపణము:** భగవానునికి కైంకర్యములు చేయువారు అనేకులు అనేక విధములుగ ఉందురు. వారు ఏ కార్యము చేయుచున్నను, వారుచేయు కైంకర్యమును బట్టి ఎక్కువవారిగాను, తక్కువవారిగానూ తలచరాదు.

(11) **వర్తన నిరూపణము:** జీవయాత్రకై ఎంతోమంది వివిధములైన వృత్తులను స్వీకరింతురు. ఆ వృత్తినిబట్టి వారిని గౌరవించక వారి భాగవత లక్షణములనే గమనించవలెను.

(12) **దోష నిరూపణము:** ఇతరులలోని దోషములను ఆవిష్కరించుటే తమపనిగా కొందరు ఉందురు. అట్లే శ్రీవైష్ణవులను అనగా భాగవత్తోతములను కొందరు వారిలోని దోషములను ఎత్తి చూపుచుందురు. ఇది మహాదోషము.

ఇట్టి అనేకవిధములైన భాగవతాపచారములను గమనించి అట్టి అపచారములు చేయకుండా జీవయాత్ర సాగించవలెను. భాగవతాపచారము చేసి అధోగతిపాలైన వారి ఉదాహరణములు కొన్ని:

(1) **త్రిశంకుడు:** తన శరీరముతోనే స్వర్గమునకు వెళ్లవలయునని అతని కోరిక. తనకోరికను వంశగురువైన వసిష్ఠునికి తెలియపరచినాడు. కాని వసిష్ఠుడు అంగీకరించలేదు. అప్పుడు త్రిశంకుడు విశ్వామిత్రుని ఆశ్రయించినాడు. గురుత్యాగము చేసి వేరొక గురువును ఆశ్రయించినాడు. వసిష్ఠుని పుత్రుల శాపముచే త్రిశంకుడు చండాలుడైనాడు. భాగవతోత్తముడైన కులగురువు వసిష్ఠుని త్యాగముచేసి భాగవతాపచారము చేసినాడు. దాని ఫలితమే చండాలత్వము ప్రాప్తించుట. త్రిశంకుడు కర్మచండాలుడైనాడు. ఇట్టివారికి మరల భాగవతులగుటకు అవకాశమే ఉండదు. ఇట్టివారు జాతి చండాలుని కన్న పాపిష్ఠులు. ఇతడు “ఆరూఢ పతితుడు”. అనగా భగవత్‌కటాక్షముచే భాగవతుడై, భాగవతాపచారముచేత ఆ ఉన్నతస్థానమునుండి పతితుడైనాడు. ఈ విషయమునే “తత్త్వయాథ్యాత్మ్యమును” ఎరిగిన తొండరడిప్పొడియాళ్వారు“సాంగవేదాధ్యయనము చేసి భాగవతులలో శ్రేష్ఠుడై, ఉత్కృష్టమైన జాతిలో జన్మించినవాడైనను భాగవతులను నిందించినచో అప్పుడే అక్కడే చండాలుడగును–” అనగా చండాలునితో సమానుడగును– అని సాయించినాడు.

(2) **వైనతేయవృత్తాంతము:** దేశ నివాసమును బట్టి వారిని తక్కువగా చూచి భాగవతాపచారము చేసినదానికి దృష్టాంతము “వైనతేయ వృత్తాంతము”. ఈ వృత్తాంతము భారతములోని “ఉద్యోగపర్వము”లో నున్నది.

గాలవుడు ఒక బ్రాహ్మణబాలుడు. తన గురువునకు దక్షిణ ఇవ్వగోరుచున్నానని అనగా అతని పట్టుదలను చూచి ఆ గురువుగారు “అయినచో



ఒక చెవిమాత్రము నల్లగాఉండి మిగిలిన శరీరమంతయు తెల్లగాను ఎనిమిదివందల గుర్రములను తెచ్చియివ్వుము”– అనినాడు.

గాలవుడు చింతితమనస్కుడై సర్వాపేక్షితములను తీర్చగలవాడు సర్వేశ్వరుడే కదా! ఆయననే ధ్యానింతును “అని తలచుచుండగా అతనికి మిత్రుడైన గరుత్మంతుడు (వైనతేయుడు) అతనియెదుట నిలిచి మిత్రమా! నిన్ను నా వీపుపై ఎక్కించుకొని అన్ని స్థలములలో త్రిప్పెదను. నీవు గుఱ్ఱములను ఎన్నుకొనుము – అని చెప్పి గాలవుని తన వీపుపై ఎక్కించుకొని ఎగురసాగినాడు.

ఒక సముద్రముపై నుండి వారి ప్రయాణము సాగుచుండెను. ఆ సముద్రములో నున్న “ఋషభము” అను ఒక పర్వతముపై కొద్దిసేపు విశ్రాంతికై గరుత్మంతుడు దిగినాడు.

ఆ పర్వతముపై “శాండిలి” అను ఒక భాగవతోత్తమురాలు ఉండెను. గరుత్మంతుడు ఆమెకు నమస్కరింపగా ఆమె గరుత్మంతుని అత్యంత ఆదరముగా సత్కరించెను. ఆ సమయములో గరుత్మంతుడు “ఆహా! ఇట్టి యోగ్యతగల భాగవత్తోతమురాలు ఎంతో మహత్త్వముగల ఒక పర్వతముపై ఉండలేక పోయినదే! ఈ సముద్రమధ్యములో ఒక పర్వతముపై ఉన్నదే!” అని అనుకొనినాడు. భాగవతోత్తమురాలున్న ఆ ప్రదేశమును తక్కువగా భావించి, భాగవతాపచారము చేసినాడు. ఇక అక్కడినుంచి ఎగురుటకు రెక్కలలో శక్తిలేకుండా పోయినది. అప్పుడు గాలవుడు “నీవు భాగవతాపచారము చేసినావు. ఆమెను క్షమాపణ వేడుము” అనగా అట్లే గరుత్మంతుడు శాండిలిని క్షమాపణ వేడినాడు. అతని రెక్కలు ఎప్పటివలె శక్తిమంతములైనవి. మరల ప్రయాణము సాగించినాడు. ఇది భాగవతాపచార ఫలితము.

(3) **పిళ్లై ఆళ్వాను**: అతడు ఉత్తమ కులజుడు. అతనికి జాత్యహంకారమున్నది. మిగతా భాగవతోత్తములను తక్కువగా చూచుచుండెడివాడు. వారిని తనకంటె నిమ్నజాతి వారిగా  తలచుచుండెడివాడు. “ఆళ్వాన్‌పిళ్లై” అనువారు ఈ పిళ్లై

ఆళ్వానుకు ఆచార్యులు. తమశిష్యుని ప్రవర్తన వలన ఎంతో బాధపడుచుండెడివారు. ఎట్లైనను అతనిని మార్చవలెనని తలచుచుండెడివారు.

ఒక సంక్రాంతి పర్వదినమునాడు నదీతీరములో అందరు స్నానము చేయుటకు వెళ్లినారు. ఈ గురుశిష్యులు కూడ వెళ్లినారు. అందరు ఏవేవో దానములు చేసుకొనుచున్నారు. పర్వదినము కదా! అప్పుడు "మీరుకూడ ఏదైనా దానము చేయవలయునని కోరుచున్నాను"– అని ఆచార్యులు పిళ్లై ఆళ్వానుతో అనినారు. "అన్నియు మీకు ఉన్నవి కదా! నేనేమిదానము చేయగలను? అని పిళ్లైఆళ్వాను అనినాడు. – మీరు "మనోవాక్కాయములచే భాగవతాపచారము చేయకుండా ఉందును" అని నా చేతిలో నీరు వదలి వాక్‌దానము చేయండి" అని శిష్యునితో ఆళ్వాన్ పిళ్లై అనినారు. వారి మాటను కాదనలేక పిళ్లైయాళ్వాను అదేవిధముగా వాగ్దానము చేసినాడు. ఆ రోజునుండి పిళ్లైయాళ్వాను భాగవతోత్తములను తనకంటె తక్కువవారినిగా తలచలేదు. భాగవతాపచార ప్రవర్తన నుండి మరలినాడు.

భాగవతాపచారము చేసినచో తమ ఔన్నత్యము కూడ కోల్పోవుదురు. ఇందుకు దృష్టాంతము "ఉపరిచరవసువు" వృత్తాంతమే!

(4) **<u>ఉపరిచరవసువు వృత్తాంతము:</u>** ఉపరిచరవసువు ఒకరాజు. జ్ఞానాధికుడు. ఋషులు, దేవతలు కూడ అతనివద్దకు వచ్చి తమ ధర్మసందేహములను తీర్చుకొనుచుండెడివారు. అంతటి విద్యాధికుడు ఆగమశాస్త్రములో (పాంచరాత్రాగమములో) నిష్ణాతుడు. తన తపోబలముచే, తన వాహనముతో, పరివారముతో కూడి అంతరిక్షమున సంచరించగల సమర్థుడు.

ఒకసారి ఒక యాగమునందు ఉపయోగించవలసిన పశువు విషయములో ఋషులకును, దేవతలకును వివాదమువచ్చెను. వారు ఉపరిచర వసువును న్యాయనిర్ణయము చేయుడని ప్రార్థించిరి.

దేవతలు యాగములలో పశువును బలి ఇచ్చి తమను ఆరాధింపవలెనని తమ వాదమును వినిపించిరి. ఋషులు యాగములలో దేవతలను ధ్యానముతోనే ఆరాధింపవలెనని తమ వాదమును వినిపించిరి. ఉపరిచరవసువు దేవతలయందు



పక్షపాతబుద్ధితో "పశువును బలియిచ్చిమాత్రమే దేవతలను ఆరాధింపవలెనని" తీర్పునిచ్చెను.

అప్పుడు ఋషులు "ఓ రాజా! నీవు దేవతలందు పక్షపాతబుద్ధితో తీర్పు చెప్పినావు. కనుక నీవు ఆకాశమునుండి క్రిందపడి పాతాళమునకు పోవుదువు గాక. ఒకవేళ మేము చెప్పినది వేదములకు వ్యతిరేకమైనచో మేమే పాతాళమునకు పోవుదుము గాక" అనినారు. వెంటనే ఉపరిచరవసువు ఆకాశమునుండి పాతాళమున పడిపోయినాడు.

ఉపరిచరవసువు విద్యాధికుడై గొప్పవాడైనను అతని కంటె జ్ఞానములో తక్కువవారైన ఋషులశాపముచే నేలకూలినాడు. ఋషులు భాగవతధర్మమును అనుసరించినవారు. అందుచే ఉపరిచరవసువు భాగవతుల విషయములో అపరాధము చేసినట్లు అయినది. అందుచే శిక్షను అనుభవించినాడు.

ఈ విషయమును భారతములో భీష్ముడు ధర్మరాజుకు చెప్పినాడు.

ఇట్లు, భాగవతాపచారము చేయుటవలన శిక్షలను అనుభవించి భగవత్ కటాక్షమునకు దూరమైన దృష్టాంతములు పురాణేతిహాసములలో ఎన్నో ఉన్నవి.

అందువలన ఎన్నడును, ఎట్టిపరిస్థితిలోను భాగవతాపచారము చేయరాదు అని మనము గుర్తుంచుకొని జీవనము సాగించవలెను.

# ఆత్మస్వరూపము

ఆత్మలు అన్నియు ఒకటే. వానిలో భేదములేదు. ఆత్మకు స్వరూపము శేషత్వమే. ఈ శేషత్వముచే భాసించు ఆత్మ పరిశుద్ధఆత్మ అగును. భగవానుని సాయుజ్యము పొందగలదు.

అయితే, ఈ ఆత్మను త్రిగుణాత్మకమైన శరీర సంబంధము ఆవరించి యున్నది. ఈ శరీర సంబంధము పోయినచో ఆత్మలు అన్నియు ఒకటే అను భావము కలుగును. ఇట్టిభావన కలిగినచో స్త్రీలందరిలో ఉత్తమురాలైన లక్ష్మీదేవితో సమానమయి, నిత్యము విడువని భగవత్ సంబంధము కలదై, భగవానుని కొరకే, భగవానుని నియమనముచే వినియోగపడు శేషత్వము అను స్వరూపము కలది అగును.

ఇట్టి పరిశుద్ధాత్మలకు నిత్యానపాయిని అయిన లక్ష్మీదేవితో సామ్యము ఆరు విధములుగ ఉండును అని ఎరుగవలెను.

(1) అనన్యార్హశేషత్వము (2) అనన్యశరణత్వము (3) అనన్య భోగ్యత్వము(4) సంశ్లేషైక సుఖిత్వము (5) సంశ్లేష దుఃఖిత్వము (6) తదేక నిర్వాహ్యత్వము – అను ఈ ఆరు సంబంధములతో ఆత్మలు పరమాత్మకు సంబంధించినవై ఉండును.

**వివరణ:**

(1) **అనన్యార్హ శేషత్వము:** భగవానునికే తప్ప మరి ఎవరికి వారి ఇష్టము వచ్చినట్లు వినియోగపడుటకు తగనిదై ఉండుట.

(2) **అనన్య శరణత్వము:** వేరొకరు రక్షకుడుగా లేనిదై ఉండుట. అనగా భగవానుడే రక్షకుడు అను దృఢవిశ్వాసముతో ఉండుట.

(3) **అనన్య భోగ్యత్వము:** తనచే అనుభవింపదగినది పరమాత్మ మాత్రమే; వేరొకటి లేదు అని తలచు భావనను కలిగియుండుట.



(4) **సంశ్లేషైక సుఖిత్వము:** పరమాత్మతోటి సంశ్లేషమే అనగా కలయికయే సుఖముగా కలదై ఉండుట.

(5) **సంశ్లేషైక దుఃఖిత్వము:** పరమాత్మతో విశ్లేషము కలిగినప్పుడు, అనగా ఎడబాటులో, దానినే దుఃఖముగా అనుభవించి భరింపలేనిదై ఉండుట.

(6) **తదేక నిర్వాహ్యత్వము:** భగవానుడే తనను నడిపించువాడు అని తలచి ఉండుట.

పరిశుద్ధాత్మలకు ఉండు ఈ స్వరూపమే లక్ష్మీదేవికి గూడ ఉండును. ఈ షడ్విధ సంబంధములచే ఆమె భగవానునితో కలసియుండును.

ఈ ఆరువిధములగు సామ్యములను అనుభవించి, నమ్మాళ్వారులు నాయికావస్థలో తమను, లక్ష్మీదేవిని పోలియున్నవారినిగా సాయించినారు. పరిమళముగల ఉత్కృష్టమైన పుష్పమునందు నివసించెడి (పద్మసంభవ) లక్ష్మీదేవివలె తామున్నామని ఆళ్వారునాయికగా నమ్మాళ్వారులు కృపచేసినారు.

శరీర సంబంధముచే ఆత్మకు వర్ణభేదము స్త్రీ పురుష భేదము వచ్చును. అపుడు తానుకాని శరీరమును తానేనని భావించుచుండును. ఇట్లు భావించుటకు కారణము అహంకారమే. ఇది బాహ్యముగా గోచరించునది.

బాహ్యముగా గోచరింపనిది ఆత్మ. ఈ ఆత్మకు చెందినది "శేషత్వము". ఇదియే కైంకర్యము. ఇదియే ఆత్మయొక్క స్వరూపము. కైంకర్యము అనగా భగవానునిచే ధరింపబడి, నియమింపబడి, వాని కొరకే, వాని ఇష్టము వచ్చినట్లు ఉపయోగపడుట. వానికే సేవచేసి, ఆ సేవచే స్వామి పొందిన ఆనందమును చూచి ఆనందించుట ఆత్మ చేయవలసినపని. అట్లు ఉండుటయే ఆత్మయొక్క స్వరూపము. కాని అహంకారము వలన ఇట్టి భావనే కలుగదు. అదియే స్వరూపహాని. ఈ అహంకారము పోయిననాడే ఆత్మకు స్వస్వరూపజ్ఞానము కలుగును. అట్లు కలుగుటయే ఆత్మకు ఉత్కర్షము. ఇది స్థిరమైనది.

అహంకారముతో ఉన్నవాడు బాహ్యముగా కనిపించు శరీరము వలన కలుగు గొప్పతనములు కావలయునని కోరుచుండును. ఆ అహంకారము పోయిననాడు భగవత్ సంబంధముచేతనే కలుగు ఔన్నత్యము కావలెనని కోరును.

బాహ్యముగా చూచినచో బ్రహ్మ (చతుర్ముఖబ్రహ్మ) కంటె గొప్పవాడు ఎవ్వడును లేడు. అతడు శ్రీమన్నారాయణుని నాభినుండి జన్మించినవాడు. నాలుగు వేదములను నాలుగు ముఖములతో చెప్పినవాడు.

ఈ బాహ్యవైభవమును చూచి బ్రహ్మకు అహంకారము కలిగినది. భగవానుని చూచినను గుర్తింపజాలకపోయినాడు. పొందజాలకపోయినాడు. సృష్టికార్యమే మరచిపోయినాడు.

అహంకారముచే నీ కర్తవ్యమునే మరచినావు. రెండు పరార్థముల కాలము " గడచిన తరువాత నన్ను పొందెదవు. నీ కర్తవ్యమును గుర్తించగలవు"– అని భగవానుడు వరమిచ్చినాడు. అంతకాలము బ్రహ్మ తపస్సుచేయుచు నిరీక్షించుచునే యున్నాడు. ఇట్టి దుర్గతికి కారణము అహంకారమే కదా!

ఇట్టి దుర్దశను కలిగించు అహంకారములేని జన్మమే కావలయునని, అట్టిజన్మ ఏ తిర్యక్‌జన్మమో, స్థావరజన్మమో అయిననూ సరే అని శ్రీ కులశేఖరాళ్వారులు కోరుకొనినారు.

కావున అహంకారము లేకుండా, శేషత్వమే ప్రధానముగా కైంకర్యనిష్ఠ కలిగియుండుటయే ఆత్మస్వరూపము. ఇట్టి స్వరూపయాథాత్మ్య జ్ఞానము కలిగిననాడే, ఆ ఆత్మకు భగవత్‌సాక్షాత్కారము లభించును. ఆయనలో సాయుజ్యము నొంది ముక్తపురుషు డగును.



# అర్చావతార వైశిష్ట్యము

ప్రపత్తి చేయుటకు ఎట్టి నియమములు లేవు. కాని, "విషయనియమము" ఉన్నదని పెద్దలు చెప్పుచున్నారు. "విషయనియమము" అనగా ఎవరి విషయములో ప్రపత్తి చేయవలయును? అనెడి నియమము. గుణములు పూర్తిగా ఉన్నవారి వద్దనే ప్రపత్తి అనగా శరణాగతి చేయవలయును. గుణములు పూర్తిగా ఉండి, మనకు అనుకూలమైనవాడు అర్చామూర్తిగా ఉన్న భగవానుడే!

గుణములు అనగా సౌలభ్యము, సౌశీల్యము, వాత్సల్యము, స్వామిత్వము, కారుణ్యము మరియు సామర్థ్యము అను ఆరు గుణములు. ఈ ఆరు గుణములు గలవాడే రక్షింప సమర్థుడు. కనుక అట్టివానివద్దనే శరణాగతి చేయవలయును.

భగవానుడు పరము, వ్యూహము, విభవము, అంతర్యామి మరియు అర్చావతారము అను అయిదు విధములుగ వేంచేసియున్నాడు.

(1) **<u>పరము (పరవాసుదేవుడు):</u>** ఈ ప్రకృతి మండలమునకు అవతల "నిత్యవిభూతి" అనబడెడి పరమపదమందు భగవానుడు ఉండును. ఆయనను "పరతత్త్వము" అందురు. ఈ పరతత్త్వము "శ్రీమన్నారాయణుడు." లేదా "పరవాసుదేవుడు." అనంత, గరుడ, విష్వక్సేనాది దివ్యసూరులు ఈ స్వామిని నిత్యము సేవించుచుందురు.

(2) **<u>వ్యూహము (వ్యూహవాసుదేవుడు):</u>** శ్వేతద్వీపమున, క్షీరసాగరములో "వ్యూహవాసుదేవుడు" వేంచేసియుండును. సనక సనందనాదులచే మాత్రమే ఈ స్వామి సేవింప దగినవాడై యుండును. వాసుదేవుడు, సంకర్షణుడు, ప్రద్యుమ్నుడు, అనిరుద్ధుడు అను నాలుగు రూపములలో నుండి జగత్తుయొక్క సృష్టి, స్థితి, లయ, నియమాది కార్యములను నెరవేర్చుచు వేంచేసియుండును.

వీరిలో వాసుదేవుడు ఒక్కడు మాత్రమే జ్ఞానము, శక్తి, బలము, ఐశ్వర్యము, వీర్యము, తేజస్సు అను ఆరు గుణములు కలవాడై ఉండును. మిగిలిన ముగ్గురు సృష్ట్యాదులలో ఆయా కార్యములు చేయుటకు రెండేసి గుణములు

కలవారై ఉందురు. అన్నిగుణములు వీరిలోకూడ ఉన్నను, వారు చేయుకార్యమునకు అవసరమైన రెండు గుణములే ప్రధానముగ ఉండును.

**వివరణ:**

**వాసుదేవుడు:** జ్ఞానాది షడ్గుణ పరిపూర్ణుడై క్షీరార్ణవములో శేషశాయిగా వేంచేసియుండును. సృష్టి, స్థితి, సంహారములను తన మూడు రూపములతో నిర్వహించుచుండును. ఈ రూపములన్నియు షడ్గుణ పరిపూర్ణములే! కాని ఆయాకార్యములకుగాను రెండేసి గుణములు పూర్ణముగా ఉండి, మిగిలిన నాలుగు గుణములు అంశముగా ఉండును.

**సంకర్షణమూర్తి:** జ్ఞానము, బలము ప్రధాన గుణములు. సంహారకర్త.

**ప్రద్యుమ్నమూర్తి:** వీర్యము, ఐశ్వర్యము ప్రధాన గుణములు. సృష్టికర్త.

**అనిరుద్ధమూర్తి:** శక్తి, తేజస్సు ప్రధాన గుణములు. స్థితికర్త.

ఈ విధముగ వాసుదేవుడు సృష్టి, స్థితి, సంహారములను కావించుచుండును.

(3) **విభవము:** భగవానుడే దేవతలలో, మనుష్యులలో, తిర్యక్కులలో, స్థావరములలో వారితో సమానమైన రూపము కలవాడై అవతరించును. దేవతలలో ఉపేంద్రుడు, వామనుడు అను పేర్లతో; మనుష్యులలో శ్రీరాముడు, శ్రీకృష్ణుడు అనుపేర్లతో; తిర్యక్కులలో భూచరములలో వరాహ నరసింహరూపములుగను, జలచరములలో మత్స్య, కూర్మరూపములుగను; స్థావరములలో గున్నమామిడి చెట్టుగను, నరనారాయణపర్వతములుగను, నైమిశారణ్యముగను భగవానుడు అవతరించినాడు. ఇవన్నియు విభవావతారములు. ఈ భగవానుని రూపములు ఆయా యుగములలో ఆయా స్థలములలో ఉన్న వారికి మాత్రమే సేవించుటకు అందుబాటులో ఉండును.

(4) **అంతర్యామి:** ప్రతిశరీరములోను కర్మానుసారముగ జీవుడు ఉండును. ఆ జీవులలో అంతర్యామిగా ఉండి నియమించుచు ఉండును. ఆయనను యోగసాధనచే దర్శింతురు.



(5) **అర్చ (అర్చావతారము):** ఆర్తితో కోరి ఒక మూర్తియందు సన్నిధానము చేసి ఉండవలెనని ప్రార్థించినచో, అట్టివారు ఆరాధించుటకు వీలుగ, ఆ మూర్తినే తన శరీరముగ చేసుకొని భగవానుడు వేంచేసియుండును. ఆలయములలో, గృహములలో ఆరాధింపబడుమూర్తులు అర్చామూర్తులు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రములలో స్వయం వ్యక్తములై, కొన్నిస్థలములలో ప్రతిష్ఠితములై కొన్నిచోట్ల, గృహములలో ఆరాధింపబడుచు కొన్నిచోట్ల భగవానుడు వేంచేసియుండును.

ఈ విధముగ భగవానుడు ఐదు స్థానములలో ఆరాధింపబడుటకు వేంచేసి యుండును. కాని మనము అన్ని స్థానములలో శరణాగతి చేయుటకు సాధ్యము కాదు. ''పరవాసుదేవుడు'' పరమపదములో నిత్యముక్తులైన దివ్యసూరులకు మాత్రమే లభించును. "వ్యూహవాసుదేవుడు" సనకసనందనాదులకు మాత్రమే సేవించుటకు వీలుగా ఉండును. "విభవావతార భగవానుడు" ఆయా యుగములలో ఆయా స్థలములలో ఉన్నవారికి మాత్రమే అందుబాటులో ఉండును. ''అంతర్యామి భగవానుడు'' యోగసాధనముచేత మాత్రమే దర్శనీయుడుగా ఉండును.

కాని "అర్చావతార భగవానుడు" మాత్రము అట్లుకాదు. మనమందరము సేవించుటకు వీలుగ వేంచేసియుండును. దేవాలయములలోగాని, గృహములలో గాని వేంచేసియున్న పెరుమాళ్లను మనకు ఇష్టమైన రీతిలో, ఇష్టమైన సమయములో అనేకవిధములుగ సేవింపవచ్చును. అందులకే ప్రపన్న జనకూటస్థులకు మూలపురుషుడైన శ్రీ నమ్మాళ్వారులు అనేకసందర్భములలో అనేక దివ్యదేశములలో వేంచేసియున్న అర్చామూర్తుల వద్దనే ప్రపత్తిచేసినారు. అట్లే తిరుమంగైఆళ్వారులు మొదలైన అనేక ఆళ్వారులు ఆయా సందర్భములలో ఆయా అర్చామూర్తుల వద్దనే ప్రపత్తి చేసినారు. "నీవే శరణము" (త్వమేవ శరణం మమ) అని సాష్టాంగ ప్రణామము చేయుటనే ప్రపత్తి అందురు.

ఈ సందర్భములో గుర్తుంచుకొనవలసిన విషయము ఒకటి ఉన్నది. పరవాసుదేవుడు, వ్యూహ, విభవ, అంతర్యామి స్వరూపములలో నున్న భగవానుడు పరిపూర్ణుడని, అర్చావతారరూపములోనున్న భగవానుడు పరిపూర్ణుడుకాదని

ఏ మాత్రము తలచరాదు. పరమపదనాథునిలో ఎట్టి గుణములు ఉన్నవో అవే ఇతర మూర్తులలోను ఉన్నవి. ఈ రూపములలో ఒకటి ప్రధానమైనదని, మరొకటి అప్రధానమైనదని భావించరాదు. వీటిలో ఏ రూపమును ఆరాధించినను సమానమే. ఎవ రెవరికి ఏయేరూపములు అందుబాటులో ఉండునో వాటిని అర్చించినారు. అర్చించుచున్నారు. మానవుల మైన మనకు వీలైనది ''అర్చావతారరూపము''. అందుచేత మనము అర్చావతారమునే ఆరాధించుచున్నాము.

ఇందుకు శ్రుతివాక్యము:

**–"ఇదం పూర్ణం, అదః పూర్ణమ్, పూర్ణాత్ పూర్ణముదచ్యతే–**

**పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే"** అని భగవత్తత్త్వమును గురించి స్పష్టముగా శ్రుతివాక్యము వర్ణించుచున్నది.

"పూర్ణము" అనగా అన్నిగుణములు పుష్కలముగా ఉండుట.

**ఇదమ్:** ఇది అనగా అంతర్యామి అయి సకలహృదయవాసి అయిన భగవత్తత్త్వము.

**పూర్ణమ్:** కల్యాణ గుణములతో పరిపూర్ణమైనది.

**అదః:** ''నిత్యవిభూతి'' అని వ్యవహరింపబడు శ్రీవైకుంఠమున నుండు ఆ పరరూపము.

**పూర్ణమ్:** కల్యాణ గుణములతో పరిపూర్ణమైనది.

**పూర్ణాత్:** జ్ఞాన, శక్తి, బల, ఐశ్వర్య, వీర్య, తేజస్సులనెడి ఆరు గుణములతో పూర్ణమైన "పరము" నుండి

**పూర్ణమ్:** రెండేసి గుణములతో పూర్ణమైయున్న వ్యూహరూపము

**ఉదచ్యతే:** బహు విధములుగ ఆవిర్భవించినది.



**పూర్ణస్య:** సమస్తమైన అవతారములకు మూలమైన క్షీరసాగర శయనుడైన "అనిరుద్ధుడు" అను వ్యూహవిశేషము నుండి ఆవిర్భవించి పూర్ణమునకు సంబంధించిన

**పూర్ణమ్:** కల్యాణగుణ పరిపూర్ణమగు విభవరూపమును

**ఆదాయ:** తనకు నిమిత్తముగ స్వీకరించి

**పూర్ణమేవ:** కల్యాణగుణ పరిపూర్ణమైన అర్చావతారమే

**అవశిష్యతే:** నిత్యము ఆశ్రయింపదగినదై, నిత్యము సన్నిహితమై, సౌలభ్యాది గుణములు పూర్తిగా ఉండెడి స్థానమై, పర, వ్యూహ, విభవ, అంతర్యామి, అర్చారూపములలో చరమసీమగా నిలచినది.

ఆశ్రయించినవారిని రక్షించుటకు జ్ఞానము, శక్తి, ప్రాప్తి, పూర్తి అను నాలుగు గుణములు ఉండవలెను. అట్టి గుణములు పరిపూర్ణముగ పరతత్త్వమగు శ్రీమన్నారాయణుని యందు ఉన్నవి. అట్లే "అర్చామూర్తి" యందునూ ఉన్నవని "పూర్ణమిదమ్ పూర్ణమదః" అను శ్రుతివాక్యము తెలుపుచున్నది.

భగవానుడే ఉపాయమని తెలిసినను, ఆయనను కంటితో చూచుటకు శక్యము కానిచో ఆశ్రయించవలెనని అనిపించదు. సులభముగ ఆశ్రయింపవచ్చునని తెలియుటకు "సౌలభ్యము" ఉండవలెను. అట్టి "సౌలభ్యము" అర్చామూర్తిలో ఉన్నది.

తాను గొప్పవాడు అయియుండి కూడ, మనతో అరమరిక లేకుండా కలసి ఉండెడి "సౌశీల్యము" అర్చామూర్తిలో ఉన్నది.

ఆ స్వామి (అర్చామూర్తి) తనదైన సొత్తును కాపాడుకొనును కదా! అను ధైర్యము మనకు కలుగుటకు భగవానునిలో "స్వామిత్వము" మనకు తెలియవలెను. అట్టి "స్వామిత్వము" అర్చామూర్తిలో ఉన్నది.

నేను ఎన్నో అపరాధములు చేసినాను. అయిననూ స్వామి నన్ను రక్షించును అను విశ్వాసము మనకు కలుగుటకు తగిన "వాత్సల్య" గుణము అర్చామూర్తిలో ఉన్నది.

పర, వ్యూహ, విభవాదులలోను ఈ గుణములు పూర్తిగానే ఉన్నవి. కాని, మనము ఆశ్రయించుటకు ఆ రూపములు అనుకూలములుగ లేవు. అర్చామూర్తి మనకు కనబడగానే మనను రక్షించును అను నమ్మకము కలుగును. ఆ పరమపదనాథుడే అర్చామూర్తిగా ఉన్నాడను భావము కలుగును. అందుచే అర్చామూర్తియే ప్రపత్తి చేయుటకు తగినది. అందువలననే ఆళ్వారులు అనేకపర్యాయములు అర్చామూర్తులవద్దనే ప్రపత్తి చేసినారు.

మరియొక వైశిష్ట్యము. సర్వేశ్వరుడు భక్తుడు కోరిన రూపములోనే, ఆ రూపమును స్వీకరించి నిలచియుండును. తన స్వాతంత్ర్యమును తగ్గించుకొని, ఆశ్రితుల అధీనమైన స్వరూప, స్థితి, ప్రపత్తులు కలవాడై ఉండును. ఇట్లుండుట ఆయన సంకల్పమే.

ఇట్టి అర్చావతారమును సేవించుట చేతనే భగవద్విషయమునందు అభిరుచి కలుగును.

అందుచేత ఇట్టి అర్చావతార వైశిష్ట్యమును గుర్తించి మనము కూడ నిత్యము అర్చావతారమును సేవించుచు ధన్యులము కావలయును.



## మంగళాశాసనము

ప్రపన్నునకు ఎల్లప్పుడు దివ్యదేశములలోనున్న పెరుమాళ్లకు మంగళాశాసనము చేయుటయే కర్తవ్యము.

సర్వేశ్వరుడు కల్యాణగుణములే ప్రధానముగా కలవాడు. హేయగుణములు లేనివాడు. తన కంటె ఇతరులను అందరను రక్షించువాడై యుండును. రక్షకుడైన వానికి, రక్షింపబడెడు చేతనుడు మంగళాశాసనములను కోరుట తగునా? అనిపించును. అట్టి శంక రాకుండుటకే ఇప్పుడు మనము మంగళాశాసనమును గురించి తెలుసుకొందము.

చేతనుడు సర్వేశ్వరునిచే రక్షింపబడువాడు అను విషయము మనకు తెలియును. ఈ విషయమును "ప్రణవము" అనగా "ఓం" కారమే చెప్పుచున్నది. దానిని తెలుసుకొని అనుష్ఠానము చేయుటయే "జ్ఞానదశ". సర్వేశ్వరుడే రక్షకుడు. అతనిదే భారము. నాకేమియు బాధ్యతలేదు అని భావించియుండుటయే జ్ఞానదశ.

"ప్రేమదశ" అని మరొకటి ఉన్నది. ఇది జ్ఞానదశకంటె భిన్నమయినది. అర్చారూపమున నున్న సర్వేశ్వరునియొక్క సౌందర్యమును, సౌకుమార్యమును అనుభవించి, ఇట్టిస్వామికి ఏమి ఆపదవచ్చునో అని భయపడి, ఆ స్వామి తనను రక్షింప సమర్థుడను విషయమును మరచి ఉండునది "ప్రేమదశ". ఇట్టి భయము ప్రేమవలననే కలుగును. వాస్తవములో స్వామికి ఆపదలు వచ్చుట యేమి? అట్టి అవకాశమే లేదు కదా! ఇట్టి ప్రేమదశలో సర్వేశ్వరుడు రక్షకుడు అను భావమును మనసు భావింపదు. తాను రక్షించువాడననియు, తనచే ఆయన రక్షింపబడువాడనియు తలచుచుండును. ఇట్టి దశలో మంగళాశాసనము చేయును. అది యుక్తమే కదా!

ప్రణవములో నున్న " అ" కారముచేత సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు, సర్వరక్షకుడు, సర్వస్వామి అయిన సర్వేశ్వరుడు చెప్పబడును. అతడు రక్షకుడుగా ఆ "అ" కారములో విదితమగును. దానిని ఎరిగినవాడు ఆయననే రక్షకుడుగా భావించియుండును.

కాని, అర్చామూర్తిని సేవించునప్పుడు ఆ స్వామి సౌందర్యమును, సౌకుమార్యమును చూచినపుడు, ఆ స్వామియొక్క శక్తిని మరచిపోవును. అప్పుడు ఆ సర్వేశ్వరుని తాను కాపాడవలెనని "మంగళము" "మంగళము" అని రక్షింప యత్నించుచుండును. ఇట్లు స్వామి సౌందర్య సౌకుమార్యములు వాస్తవ విషయమును మరపించి రక్ష్యరక్షకభావమును మార్పు చేయును.

ఈ విషయమును మనము రామాయణ, భారతములలో గమనించవచ్చును. దశరథచక్రవర్తి, సీతాదేవి, విశ్వామిత్రుడు, ఆంజనేయస్వామి, సుగ్రీవుడు, జటాయువు, అయోధ్యాపురవాసులు, కౌసల్య మొదలైన ఎందరో శ్రీమద్రామాయణ ఇతిహాసములో శ్రీరామచంద్ర ప్రభువునకు ఆయా సందర్భములలో మంగళాశాసనము చేసినారు. అట్లే నందగోపుడు, విదురుడు, దేవకీవసుదేవులు మొదలైనవారు ఆయా సందర్భములలో శ్రీకృష్ణభగవానునకు మంగళాశాసనము చేసినట్లు మనము శ్రీ మహాభారత ఇతిహాసములో గమనింతుము.

ఇంత ఎందుకు? పరమపదములోగూడ సదా భగవానునే సేవించుచున్న శంఖచక్రాద్యాయుధములు ఒకరినొకరు శంకించుకొనుచు స్వామికి మంగళాశాసనము చేయుచుందురట! ప్రేమదశ అట్టిది.

ఇక ఆళ్వారుల విషయమును గమనించినచో, ఆళ్వారులందరిలోను శ్రీ నమ్మాళ్వారులు గొప్పవారు అని చెప్పదగును. వారు ప్రపన్న జనకూటస్థులకు మూలపురుషులని కదా ప్రశస్తి. శ్రీ నమ్మాళ్వారులకు భగవత్వ్యామోహము ఎక్కువ. కాని వారికంటె "పెరియాళ్వారు" నకు ప్రేమ అధికము. అందుచేతనే వారు పెరుమాళ్లకు మంగళాశాసనము చేయకుండా ఉండలేకపోయినారు. పిరాట్టికంటె కూడ భగవానుని యందలి ప్రేమలో పెరియాళ్వారులు గొప్పవారు అని చెప్ప దగునా అనిపించును. భగవానుని పిరాట్టి చేరియుండుట భోగమే ప్రధానము అనిపించును. కాని ఆళ్వారులు కేవలము స్వామి సౌందర్యము ఎక్కడ మాసిపోవునో అని మంగళాశాసనము చేసినారు. అంత మాత్రముచేత పిరాట్టి ప్రేమతక్కువ



అనికాదు. ఆళ్వారులు భగవదనుగ్రహముచే లభించిన జ్ఞానసంపన్నులు. అందుచే వారికి పెరుమాళ్లయందు నిరతిశయ ప్రేమ కలిగినది.

మంగళాశాసనము చేసిన విధమును పరిశీలించినచో మిగిలిన ఆళ్వార్లు అందరి కంటె పెరియాళ్వారు చాలా గొప్పవారు. మిగిలిన ఆళ్వార్లకు భగవానుని యందు ప్రేమచే మంగళాశాసనము చేయుదశ అప్పుడప్పుడు కలుగుచుండును. కాని పెరియాళ్వారుకు స్వామికి మంగళాశాసనము చేయు స్థితి ఎల్లప్పుడు కొనసాగుచునే యుండును. భగవానుని దివ్యమంగళ విగ్రహమునకు, సౌందర్యమునకు ఏమి ఆపద కలుగునో అని ఎల్లప్పుడు అతిజాగరూకతతో నుందురు. పెరియాళ్వారులు ఆ విధముగా మంగళాశాసనము చేయుచు పాడుచునే యుండిరి కాని అనుభవించుచు ఉండలేకపోయిరి. అనుభవించుటకు వీలు లేకుండా స్వామికి రక్షపెట్టవలయునను భావమే అతిశయించినది.

మిగిలిన ఆళ్వారు లందరును భగవదనుభవమునకు విశ్లేషము కలిగిననాడు చాలా క్లేశపడి, పెరుమాళ్లపై రోషపడినారు "పోకునంబి" కళికిమెకేల్నమ్బి" "ఓ పూర్ణుడా పొమ్ము", "మా గోష్ఠిలో చేరకుము" అని కోపపడినారు. తీవ్రముగ మాట్లాడినారు. నిందించినారు. మంగళాశాసనము చేయవలయునను మాటయే మరచినారు. స్వామి సౌందర్యము వారిని అట్లు చేసినది. ఇది మిగిలిన ఆళ్వార్లస్థితి.

పెరియాళ్వార్లు అట్లుకాదు. భగవత్ సౌందర్యమును తాను అనుభవింపవలెనని తోచక ఆ సౌందర్యమునకు రక్ష కల్పించవలెనని ప్రయత్నించినారు. శంఖ చక్రాద్యాయుధములకు ఏమి ఆపద సంభవించునో అని రక్ష నిడినారు (తిరుప్పల్లాండు).

పెరియాళ్వారులకు పెరుమాళ్లు తన దివ్యమంగళ విగ్రహమును దర్శింపజేసినారు. ఆ సౌకుమార్యమును చూచి, అట్టి సౌందర్యమును చూచి వాటికి ఎట్టి ఆపదవచ్చునో అని మంగళాశాసనము చేసినారు. ఆళ్వార్ల భయమును పోగొట్టవలెనని స్వామి బలసంపన్నమైన తన భుజములను చూపగా అయ్యో!

అసురులతో యుద్ధము చేయుచో ఆ భుజములకు ఏమి ఆపద కలుగునో కదా అని ఇంకను భయపడినారు. అప్పుడు స్వామి "పిరాట్టి" ని చూపినారు. ఆమె కటాక్షమే రక్షకు తగినది. అట్టి పిరాట్టి నిత్యానపాయిని అయి తన వక్షఃస్థలమున ఉండగా నాకు భయమేమి? అనినారు. అప్పుడు పెరియాళ్వారు "ఇంతకు పూర్వము నీ ఒక్కని సౌందర్యమునకే ఏమికీడు వాటిల్లునో అని బెంగపడినాను. ఇప్పుడు లక్ష్మీనారాయణుల చేరిక అయిన ఈ యుగళ రూపమునకు ఏమి కీడువచ్చునో అని ఇంకను భయపడి "మంగయుం పల్లాండు" అని పిరాట్టికికూడ మంగళాశాసనము చేసినారు."ఎంతో శక్తిమంతములైన ఈ సుదర్శన పాంచజన్యములను చూడండి" అని స్వామి చూపినారు. పెరియాళ్వారు "ఆత్తియుం పల్లాండు"– "పాఞ్చశన్నియముం పల్లాండు" అని ఆ ఆయుధములకు కూడ మంగళాశాసనము చేసినారు. స్వామి రక్షకులైన వారికే రక్ష కల్పించినారు. ఇలా మంగళాశాసనము చేసి చేసి తుదకు "శూడిన్దిరున్దేత్తువర్" పల్లాండే" అని భగవత్ప్రాప్తికి ఫలము మంగళాశాసనమే అని పెరియాళ్వారులు చెప్పినారు. తన జీవితలక్ష్యమే మంగళాశాసనము చేయుట అని భావించినారు.

ఈ విధమైన మంగళాశాసనమునకు తోడుగా నుండుటకు మనుష్యులను వెదకుకొని ప్రతికూలురను కూడ అనుకూలురనుగా చేసికొనుటకు ఉపదేశము చేయుట ఒక్క "తిరుప్పల్లాండు" లోనే కనిపించును.

పెరుమాళ్ల సౌకుమార్య, సౌందర్యములను ప్రేమించి మంగళాశాసనము చేయువారే లభించరా? అని పూర్వాచార్యులలో శ్రీభాష్యకారులును, అజ్ఞానగంధ రహితమైన భక్తిరూపాపన్న జ్ఞానమును పొందిన ఆళ్వారులలో పెరియాళ్వారును ఉపదేశించినారు.

పెరియాళ్వారులకున్న ఇట్టి మంగళాశాసననిష్ఠను మేము కూడ కలిగియుండవలయునని సదా ప్రపన్నులు కాంక్షిస్తూ ఉండవలయును. ఇట్టి నిరంతర మంగళాశాసన పరత్వమే శేషభూతులమైన మనందరికి జీవితలక్ష్యము కావలయును.



# భగవన్నిర్హేతుక కృపాప్రభావము

అనాది కాలమునుండి ఆర్జించిన కర్మయంతయు నశించుటకు కారణము అద్వేషము మొదలుకొని భగవత్ప్రాప్తి వరకు కలిగెడి క్రమమే. ఈ ఫలములన్నియు సిద్ధించుటకు ప్రధాన హేతువు భగవానుని నిర్హేతుక కృపా ప్రభావమే.

ప్రపన్నుడైన అధికారి అనవరతము స్వదోషములను అనుసంధించు కొనుచుండుట, భగవత్ భాగవత గుణములను అనుసంధించుకొనుట చేయు చుండవలయును.

తన దోషములను అనుసంధించుకొనుటవలన భయము కలుగును. తరువాత భగవత్ గుణములను భావించుకొనుటవలన భగవానుడు ఎంతటి కృపాశీలుడో తెలియును. కనుక స్వదోషానుసంధానమువలన కలిగిన భయము తొలగును. ఇట్లు స్వదోషానుసంధానము భయహేతువు. భగవద్గుణాను సంధానము అభయహేతువు.

భగవంతుని స్వభావమును తలచుకొనుచు, అట్టివానిని తాను పొందగలనా? అని భయపడుచు ఉండుట మూర్ఖత్వలక్షణము అనగా తన స్వభావమును తలచుకొనుచు భయపడుచుండుట మూర్ఖత్వము అని భావము. అట్లే నిరంకుశుడైన, స్వతంత్రుడైన సర్వేశ్వరుడు నన్ను ఈ సంసారములోనే ఉంచినచో ఏమి చేయుదును? అని ఆయన స్వభావమును భావించి భయపడుట కూడ మూర్ఖత్వమే. అట్లే తనను గూర్చి ఆలోచించుకొనునప్పుడు "ఇప్పుడు నాకు ఆత్మగుణములు కలిగినవి. కనుక భగవత్ప్రాప్తి కలుగుటలో సందేహములేదు." అని భయములేనివాడై ఉండుట కూడ మూర్ఖత్వమే!

భగవత్ స్వభావమును అనుసరించి భయము తీరవలసినది మాని, "స్వామీ! ఇంకను నన్ను బాధింపదలచుచున్నావా?" అని సర్వేశ్వరుని గూర్చి ఆళ్వారు పలికిన సూక్తి తగునా అనిపించును. ఇట్లు ఆళ్వారు భయపడుటకు కారణము సర్వేశ్వరునితో తమకుండు సంబంధమును భావించుటయే!– "నిరుపాధిక రక్షకుడు సర్వేశ్వరుడే! నాకు మేలు కలిగినను, హానికలిగినను దాని

వలననే!" అని భగవానునితో తమకుగల దృఢమైన బంధమును ఎరుగుట చేతనే ఆళ్వారు అట్లు ప్రశ్నించినారు.

సర్వేశ్వరునకు చేతనులతో కల సంబంధము వదలించుకొందమన్నను వదలరాని సంబంధము. అతడు రక్షింపవలసియుండగా ఉపేక్షించుటచేత తనకు బాధ కలిగినదని చేతనునకు మనసులో అనిపించి, సర్వేశ్వరుని దూషించును. మీదు మిక్కిలి మీదపడి కొట్టునుకూడ. అట్టి సంబంధము సర్వేశ్వరునితో కలదు కనుకనే ఆళ్వారు అట్లు ప్రశ్నించినారు.

జీవుడు భగవత్ప్రాప్తిని పొందకుండా సంసారములో పడియుండుటకు కారణము వాని కర్మ. అంతేకాని భగవానుడు కాదు. కర్మచే భగవానునకు దూరమై సంసారములో పడియున్న జీవుడు మరల భగవానుని పొందుటకు కారణము భగవానుని కృపయే. అందుచేత పొందించునది కృపయే. దూరము చేయునదియు కృపయే. అట్లుకాక, భగవానుని పొందక సంసారములోనే పడియుండుటకు కారణము, ఈశ్వరుని స్వాతంత్ర్య మనియు, సర్వేశ్వరుని పొందుటకు చేతనుని సద్గుణములే కారణ మనియు తలచుట. అట్లు తలచుటచే ఇంకను చేతనులు భగవానునకు దూరమగుదురు ఇట్లు భగవద్విషయములో పరాకుగా ఉండి, సంసారకూపములో పడినపుడు, దానినుండి రక్షించుటకు భగవానుడు తానే మనలను చేరును. ఇందుకు ఆయన కృపాగుణమే కారణము. సర్వేశ్వరుడు కృపకలవాడై చేతనుని సంసారకూపమునుండి తీసి ఉద్ధరించుటకు దగ్గరగాచేరును. అట్లు చేరినప్పుడు, భగవానుని రక్షకుడుగానే భావింపవలెనుగాని, ఈయన స్వతంత్రుడగుటచే మనను సంసారములో పడవేసినాడని భావించినచో భగవానుడు వదలివేయును.

స్వామికి ఆగ్రహము కలిగినప్పుడు కూడ, అట్లు ఆగ్రహము కలుగునట్లు చేసినవారు స్వామివద్దకువెళ్లి, స్వామి తిరువడిగళ్ళను (పాదములను) పట్టుకొనినచో ఆయన పరమకృప కలవాడు కనుక అన్నిటిని మరచును. మనము అన్నిటిని విన్నవించవచ్చును. పరదుఃఖమును ఓర్వలేని కృప స్వామికి ఉన్నది. ఇట్టి



విషయములను " తిరుమంగైఆళ్వారు" తమ "తిరుమొళి" లో అనేక స్థలములలో సాయించినారు. చేతనుని ఆర్తిని, అనన్యగతిత్వమును తెలిపినారు.

భగవద్గుణానుసంధానము అభయమును కలిగించునని మనకు తెలిసినది. సర్వేశ్వరుడు చేతనులను ఉజ్జీవింపజేయుటకు ఎన్నిరకములుగానో ప్రయత్నించును అనువిషయమును వివరముగా తెలుసుకొందము.

ఈ సకలభూతములు సర్వేశ్వరుని నాలుగు భాగములలో ఒక భాగము. అనగా అంత అల్పమైనది. దీనిని "లీలావిభూతి" అందురు. పరమాకాశము అనబడు పరమపదము "నిత్యవిభూతి". ఇది నిత్యమైనది. ఇది మూడుభాగములు. లీలావిభూతి (పంచభూతములు అనగా ప్రకృతి) కంటె మూడు రెట్లు అధికము. ఈ నిత్యవిభూతి లీలావిభూతికంటె అత్యంతము భిన్నమైనది. నిరతిశయ సుఖమును కలిగించునది.

ఆ పరమపదములోని పరిపూర్ణానుభవము నిత్యముక్తులతో కలసి స్వరూపగుణవిభూతులన్నియు నిరతిశయానందమును అనుభవించుచుండును. ఆ స్థితిని చూచి, భగవానుడు "అయ్యో! లీలావిభూతిలో సంసారియై ఉన్నవాడు కర్మవశముచేత దేశాంతరమున ఉన్నాడే" అని బాధపడును. "వీడు కూడ నాతో కలసి ఉన్నముక్తులతో, నిత్యులతో కలసి అవిచ్ఛిన్నమైన ఆనందమును అనుభవింపవలసినవాడే" అని బాధపడును. అనేక విధములుగ వారికి తన నిర్హేతుక కృపాకటాక్షమును ప్రసరింప జేసి, వారిని తనవద్దకు తెచ్చుకొనుటకు ప్రయత్నించును.

ప్రళయకాలములో ఈ లీలావిభూతి అంతయు లేకుండా పోవును. అప్పుడు సర్వేశ్వరుడు తాను ఒక్కడే ఉండి, ఆ చేతనుల ఎడబాటును సహింపలేకుండును. అప్పుడుకూడ అనగా ఆ ప్రళయకాలములో కూడ నామ రూప విభాగములేని చేతనుని, తనకు శరీరముగ ఉంచుకొని ఆత్మయై ఉండును. కాని అట్లు ఉండుట సర్వేశ్వరునకు తృప్తిని ఇవ్వదు. అందుచేత చేతనులకు కరణ కళేబరములను కల్పించును. ఆ కాలములో సర్వేశ్వరుడు చేతనులకు

అంతర్యామిగా ఉండి, వారు చేయు ప్రవృత్తి నివృత్తులలో తానే నడిపించుచున్నవాడై ఉండును. అయినను సర్వేశ్వరుడు సంతోషపడడు.

అప్పుడు, అర్చారూపముగా ఈ లీలా విభూతిలోనికి దిగివచ్చి, వేంచేసియుండును. వారికి అంతరాత్మయై ఉండును. తన శ్రీచరణములను ఆశ్రయించుటకు ఉపకరణముగా ఉండవలయుననియే సర్వేశ్వరుడు చేతనులకు కరణ కళేబరములను కృపచేసినాడు. తనను ఆశ్రయించుటకు తగిన జ్ఞానమును కృపచేసినాడు. వారి ప్రవృత్తి నివృత్తులలో ప్రేరణను కలిగించుచున్నాడు. ఇట్లు ఆత్మవస్తువును కాపాడుచుండును.

ఈ ఆత్మలు మొదట సర్వేశ్వరుడు ఇచ్చిన స్వాతంత్ర్యశక్తిని కలవై ఉండును. అపుడు వారు తమ తమ కోరికలకు తగినట్లు కొన్ని వ్యాపారములను చేయుదురు. ప్రాచీన దుష్టకర్మల వాసనాబలమువలన పాపకర్మలు కూడ చేయుచుందురు. అంతర్యామియై ఉండి కూడ సర్వేశ్వరుడు ఉపేక్షించి ఊరకుండును. శాస్త్రములద్వారా ఆ చేతనులు సత్కర్మలయందు ఆసక్తిని కలిగించు కొందురేమో అని ఉపేక్షించియుండును. తుదకు చేతనులు శాస్త్రములలో చెప్పినట్లు భగవానుని ఆశ్రయింతురు. ఇట్లు సర్వేశ్వరుడు చేతనులకు కరణ కళేబరములను ఇచ్చి, జ్ఞానమును ఇచ్చి కృపను చూపును.

చేతనుడు తానుచేయు కర్మలలో కొన్నిమంచివి అని అతనికి తెలియవు. కాని సర్వేశ్వరునకు తెలియును. అందుచే ఆ కర్మలను ఆధారము చేసుకొని సర్వేశ్వరుడు చేతనుని దోషములను చూడక రక్షించును. ఇది సర్వేశ్వరుని కృపా స్వభావమే.

యాదృచ్ఛికములు, ఆనుషంగికములు, ప్రాసంగికములు అయిన అనేక సుకృతములను సర్వేశ్వరుడు చూచును.

భగవత్ భాగవతులను ద్వేషించువారిని హింసించుట మొదలైనవి యాదృచ్ఛిక సుకృతములు. ఒకరిని నిందించుటకు ఉపయోగించు భగవన్నామస్మరణ ఆనుషంగికము. దివ్యదేశపుపేర్లను ఎప్పుడైనను



ప్రసంగవశమున ఉచ్చరించినచో అది ప్రాసంగిక సుకృతము. ఇట్టి సుకృతములలో వేటినైనను చేయుచున్నాడా అని పరిశీలించి, దానినే స్వీకరించి, సర్వేశ్వరుడు చేతనునిపై కృపచూపును. అజ్ఞాతముగా చేసిన సుకృతమైనను, దానిని స్వీకరించి, అట్లు ఆ సుకృతము చేసినవారికి కూడ ఉత్తమమైన ఫలమును సర్వేశ్వరుడు అందించును. ఇట్టి సుకృతములు చేతనులకు కలుగవలెనని, అతనిని సృష్టించినపుడే సర్వేశ్వరుడు సంకల్పించును.

చేతనులు అనేకజన్మలలో చేసియున్న సుకృతములను గూడ ఆధారముగ చేసుకొని, సర్వేశ్వరుడు రక్షించును. అట్లైనను, ఈ విషయమును ఎరుగక చేతనులు, భగవానునకు పక్షపాతమని, దయలేనివాడని తలచెదరు. “భగవానుడు ఎంత దయగలవాడు? నేనేమి సుకృతము చేయకపోయినను కృపచే రక్షించినాడే!” అని భావింపరు.

ఈ విధముగ సర్వేశ్వరుడు తన నిర్హేతుక కృపచేతనే సంసారములో నున్న జీవులను ఉద్ధరించును. ఈ విషయమును ఎరిగినవారు ఇట్లు భావింతురు:

“అనాదికాలమున, ఒక వస్తువనికూడ చెప్పుటకు తగని నన్ను ఒక వస్తువుగ పరిగణింపచేసి, సర్వేశ్వరుడు నా నీచమైన మనసులో నిలచినాడు. నేను జటాయువు వలె ప్రాణములను వదలితినా? హనుమవలె నీకు ప్రీతి కలుగునట్లు సీతమ్మను చూచితినని చెప్పితినా? నీ ఆజ్ఞను పాటించితినా? ఏమి మంచిని చేసినానని నీవు నా మనసులో ప్రవేశించినావు? ఇది కేవలము నీ నిర్హేతుక కృపయే! విషయప్రావణ్యము కలవాడనై జీవితము గడపుచున్న నన్ను ఉజ్జీవింపచేసినావు స్వామీ! నా దుష్టమైన మనసును పోగొట్టినావు. నిన్నే అనుభవించునట్టి మనసును అనుగ్రహించినావు. ఆహా! ఏమి నీకృప!” అని భావించును.

ఇట్లు నిర్హేతుకముగనే, తన కృపచేతనే సర్వేశ్వరుడు చేతనుని రక్షించుటకు ఆలంబనమును వెదకుకొనునని “పాంచరాత్ర” శాస్త్రములో చెప్పినారు. పాంచరాత్రశాస్త్రము భగవత్‌శాస్త్రము. ప్రామాణికము.

ఈ విధముగ శాస్త్రము చెప్పుటయేకాదు. భగవానుని నిర్హేతుక కృపకు సాక్షాత్ పాత్రభూతులై, వానిని అనుభవించిన ఆప్తతములైన ఆళ్వారు– "వెఱితే అరుళ్" అను పాశురములో వెల్లడించినారు. భగవానునివైపు ఆభిముఖ్యము కలుగుటకు, భగవత్కృప కారణమగుటకు అద్వేషము కలుగుటకు, సుకృతము కారణమని కొందరు చెప్పుదురు. కాని అట్లుకాదు.

అనాది కాలమునుండి ఈ చేతనుడు భగవానుని వైపు విముఖుడై ఉండెను. ఇప్పుడు ఇతనికి భగవంతునివైపు అభిముఖ్యము కలిగినది. దీనికి కారణము ఇతని సుకృతము కాదు. అది కేవలము భగవత్కృపచేతనే కలిగినది. దానికి ముందు అద్వేషము కలుగవలెను కదా! దీనికిని భగవత్కృపయే కారణము. వీటికి సుకృతము కారణమనుట తగదు.

సమస్తమైన ఆత్మలకును అద్వేషమే మూలము. అదియే ఆత్మోజ్జీవనమునకు అంకురము. యాదృచ్ఛికాది సుకృతములు అల్పమైనవి. అందుచేత అద్వేషమునకు, ఆభిముఖ్యమునకు కూడ భగవత్కృపయే కారణమని ఎరుగవలెను.

చేతనులకు కర్మఫలమును అనుభవించుట తప్పదు. అట్లే సర్వేశ్వరునకు ఈ చేతనులను తనవద్దకు చేర్చుకొనుటయు తప్పదు. ఇందులకై సర్వేశ్వరుడు తనకృపచే ఎన్నియో శ్రమలను పడక తప్పదు. అనగా జీవునకు కర్మఫలమును అనుభవింపక తప్పదు. సర్వేశ్వరునకు కృపాఫలమును అనుభవింపక తప్పదు అని భావము. అయితే ఇక్కడ మన మొకటి గుర్తుంచుకొనవలెను. చేతనుని కర్మఫలము కాని, సర్వేశ్వరుని నిరంకుశస్వాతంత్ర్యముకాని, సర్వేశ్వరుని నిర్హేతుక కృపాస్వభావమునకు ఎదురుగా నిలువజాలవు.

ఇట్లు, ఉపాయభూతుడైన సర్వేశ్వరుడు, కర్మను బట్టి ఈ చేతనుని "సంసారములో త్రిప్పుచున్నను తన నిర్హేతుక కృపాప్రభావము అను కారుణ్యము కారణముగా ఈ సంసారమునుండి చేతనునకు మోక్షమును కలిగించుటకే ప్రవర్తించుచుండును. ప్రవర్తించుచునే యుండును."



# సచ్ఛిష్య లక్షణములు

భగవానుడు చేతనులను ఉజ్జీవింప జేయదలచి, సులభమార్గమైన ప్రపత్తి యొక్క స్వరూప స్వభావ ప్రాధాన్యములను వివరింపదలచినాడట. కాని తన ఉపదేశమును వినుటకు తగిన శిష్యుడే లభించలేదట. ఈ విధముగా కొన్ని యుగములు గడచినవి. చివరకు తానే ఆచార్యుడై, తానే శిష్యుడై నరనారాయణావతారమును ధరించినాడట! అప్పుడు ఆచార్యునకు ఉండవలసిన లక్షణములు ఆచార్యునకు, శిష్యునకు ఉండవలసిన లక్షణములు శిష్యునకు ఉండునుకదా! ఆ విధముగా అవతరించి భగవానుడు, మంత్రరాజమైన "అష్టాక్షరీ మంత్రమును" నరునకు ఉపదేశించినాడట! ఇది మనకు పెద్దలవలన తెలిసిన ఐతిహ్యము. దీనిని బట్టి మనము గ్రహింపవలసిన విషయము ఒకటి ఉన్నది. ఉపదేశించువాడు అనగా ఆచార్యుడు ఎంత యోగ్యుడైనను, ఆ ఉపదేశమును గ్రహించుటకు యోగ్యుడైన శిష్యుడు కూడ అంతే యోగ్యత కలవాడై ఉండవలయును అనెడి విషయము.

ఇంతకు పూర్వము మనము ఆచార్య ప్రాశస్త్యమును, లక్షణములను గురించి తెలుసుకొనినాము. ఇక ఇప్పుడు శిష్యస్వరూపమును, లక్షణములను గురించి తెలుసుకొందము.

శిష్యుడు అనగా ఉపదేశము పొందువాడు అని మాత్రమేకాదు. ఈ క్రింద చెప్పిన అయిదు లక్షణములు కలవాడై ఉండవలయును.

(1) **సాధ్యాంతరనివృత్తి:** తన స్వరూపమునకు విరుద్ధమైన ఐశ్వర్యకైవల్యములను పొరపాటుననైన కోరనివాడై ఉండవలయును. అంతేకాక, తన ఆచార్యుని తప్ప వేరొకరు నాకు ప్రాప్యముకాదు. అదే నాకు సాధ్యము అని ఉండుట ప్రధాన లక్షణము.

(2) **ఫలసాధనము:** ఆచార్యునకు తానుచేయు సేవచే అనగా శుశ్రూషచేతనే తనకు ఫలము సిద్ధించునని విశ్వసించి ఉండవలెను. స్వరూపానురూపమైన

ఫలమునకు, అనగా శేషత్వమనెడి స్వరూపమునకు తగిన ఫలమైన కైంకర్యమునకు సాధనము ఆచార్య పరిచర్యయే అని దృఢముగ భావించవలెను.

(3) **ఆర్తి:** ఆర్తి ఉండవలెను. ఆచార్యుల దివ్యమంగళ విగ్రహమును అనుభవించు భాగ్యము లభింపవలెనను ఆర్తి ఉండవలెను. అది లభించనిచో భరించలేని క్లేశము కలుగవలెను.

(4) **ఆదరము:** ఆచార్యుడు ఉపదేశించెడు భగవద్గుణానుభవమునందు అంత కంతకు ఆదరము పెరుగుచుండవలెను.

(5) **అనసూయ:** ఆచార్యుడు భగవత్ వైభవమును ఉపదేశించునపుడు అసూయ లేనివాడై ఉండవలయును. ఆచార్యులయొక్క గొప్పతనమునుగాని, తన సహాధ్యాయుల గొప్పతనమును గాని చూచి ఓర్వలేనివాడై ఉండరాదు. భగవంతుని ఉత్కర్షను చెప్పినపుడు మనసులో అసూయ కలుగరాదు. అట్లే భాగవతుల విషయములో గూడ ఉండవలెను. శ్రీ యామునాచార్యులవారు నైచ్యానుసంధానము చేయుచు తనను "అసూయాప్రసవభూః" అని చెప్పుకొనినారు. అసూయను ఏ మాత్రము కలిగి యుండరాదు అని భావము.

శిష్యునకు ఆచార్యుడే తన సర్వస్వము అను ప్రతిపత్తి ఉండవలయును. తిరుమంత్రము ఆచార్యుడే! ఆ మంత్రము చేత ప్రతిపాదింపబడు పరదేవతయు ఆచార్యుడే! ఆచార్యుని అనుగ్రహముచే లభించు కైంకర్యమనెడి మహాఫలమునూ ఆచార్యుడే! దానికి సంబంధించి కలిగెడి ఫలము అనగా అవిద్యను నివర్తించుట మొదలై, స్వస్వరూపావిర్భావమువరకును ఆచార్యుడే! సాలోక్య, సారూప్య, సాయుజ్యాదిఫలమునూ ఆచార్యుడే! ఈ లోకములో అనుభవించు భోగములన్నియు ఆచార్యుడే! అని శిష్యుడు ఎరుగవలెను. ఇట్లు భావించినవాడే సచ్ఛిష్యుడు.

ఈ విధముగ భావించుటకు కారణము, నిత్య సంసారియైయున్న తనను తన ఉపదేశముచే దిద్దుబాటుచేసి, నిత్యసూరులు అనుభవింపగల అనుభవమును అనుభవించుటకు తగినట్లు చేసిన ఆచార్యుడు చేసిన ఉపకారమును స్మరించుటయే!



ఆచార్యుని యెడ కృతజ్ఞత కలిగియుండుటయే ఉపకారస్మృతి. అట్టి ఆచార్యుని సన్నిధికి తనను చేర్చుట సర్వేశ్వరుని కృపయే అని యెరిగి సర్వేశ్వరుని యందు కృతజ్ఞత కలవాడై ఉండవలయును. ఉండును.

సచ్ఛిష్యునకు మరికొన్ని గుణములు కూడ ఉండవలయును.

(1) సచ్ఛిష్యుడు తన నడవడిచే ఆచార్యునకు ప్రియమును, హితమును కలిగించుచుండవలయును.

(2) ఆచార్యుని ముఖవికాసమే తనకు పురుషార్థమని భావించి, సర్వకాలముల యందును ఆచార్యునకు ప్రీతిని కలిగించుచుండవలెను.

(3) శిష్యుడు శేషభూతుడగుటచే శేషియైన ఆచార్యునకు ప్రీతిని కలిగించుటయే ముఖ్యమని భావించవలెను.

(4) అప్పుడప్పుడు ఆచార్యుడు తనను (శిష్యుని) నిగ్రహించును. ఇట్లు నిగ్రహించుట తనను మంచిమార్గములో నడపుటకు మాత్రమే అని భావించి మరల మరల ఆచార్యుడు నిగ్రహించునట్లు ప్రవర్తింపరాదు.

(5) ఆచార్యుడు తనను నిగ్రహించినపుడు, తన స్వరూప రక్షణమునకే ఆచార్యుడు అట్లు నిగ్రహించినాడని భావించి, ఉచితమైన కైంకర్యముచే ఆచార్యుని దేహమును ఏకాగ్రచిత్తుడై శిష్యుడు రక్షించుచుండవలెను.

(6) శిష్యుడు ఆచార్యునియొక్క దేహమును కాపాడుచుండవలయును. ఇది శిష్యునకు స్వరూపమే! దీనివలన భగవానునికి శిష్యునిపై ప్రీతి కలుగును. కనుక ఇది భగవత్ కైంకర్యమే! అట్లు ఉండనినాడు శిష్యునకు శిష్యత్వము సిద్ధింపదు.

(7) ద్రవ్యము సమర్పించి, లేదా సేవచేసి ఆచార్యుని దేహమును కాపాడుచున్నప్పుడు "నేను ద్రవ్యము సమర్పించినాను. నేను సేవచేసినాను" అని అనుకొనుట "మమకారము" అగును. ఇట్లు భావించుట శిష్యత్వమునకు విరుద్ధము.

(8) శిష్యుడు ఆచార్యుని ఆశ్రయించినపుడు, తన శరీరము, అర్థము అన్నియు ఆచార్యాధీనమని భావించవలెను. అందుచే శిష్యుడు తన దేహమును తాను రక్షించుకొనుటకు ఆచార్యుడే తనద్రవ్యములను శిష్యునకు (తనకు) ఇచ్చి రక్షించుచున్నాడని భావించవలెను. శిష్యుడు ఆచార్యునకు తనదైన దానిని సమర్పించుచున్నానని తలపరాదు. తనది అనునది లేనేలేదు కదా! వారి వస్తువులను వారే స్వీకరించుచున్నారని భావించవలెను.

(9) శిష్యుడు ఆచార్యశేషభూతుడు. అట్టివాడు తన సర్వస్వమును ఆచార్యుడే అని భావించి ఉండవలెను. అట్లు ఉండనిచో శిష్యాచార్య సంబంధము చెడిపోవును.

(10) శిష్యుడు తనవి అన్నియు ఆచార్యునికే! నేను సమర్పింప కలిగినది ఏమి ఉన్నది? అని భావించుటచే అతని శిష్యత్వము జీవించును.

ఇవికాక, ఆచార్యుని ప్రీతికొరకు శిష్యుడు మూడింటిని వదలవలెను.

(1) భగవత్ద్రవ్యమును అపహరించుట. (2) భగవత్భోజనమునకు అడ్డుతగులుట (3) గురు మంత్ర దేవతలను అవమానించుట. వీటిని మానినచో ఆచార్యునకు ప్రీతికలుగును.

(2) భగవానునికి చెందిన వస్తువులను దొంగిలించుట అనగా ఆత్మవస్తువును భగవానునకు చెందినదని తలపక స్వతంత్ర మనుకొనుట.

(3) భగవానునికి తప్ప వేరొకరికి వినియోగపడదగినది అనుకొనుట భగవత్ భోజనమునకు అడ్డుతగులుట. భగవానునకు ఆత్మను రక్షించుటయే ఆహారము. ఇట్లు రక్షించువాడు భగవానుడే అని భావింపక తనకు తానే రక్షకుడనని భావించుట భగవానుని భోజనమునకు అడ్డుతగులుట.

(4) (i) **<u>గురుపరిభవము:</u>** (అవమానము) గురుపరిభవము చేయుట అనగా, తన ఉజ్జీవనమునకై ఆచార్యుడు ఉపదేశించిన అర్థమును శిష్యుడు విని, దానికి



తగినట్లు విడువ తగినవానిని విడచి, స్వీకరింపతగిన వానిని స్వీకరింపకపోవుట గురువును అవమానించుటయే!

అట్లే తనకు ఉపదేశించిన సారభూతములైన అర్థములను అధికారులు కాని వారికి అనగా దీనియందు విశ్వాసము లేనివారికి, కీర్తినికోరి లేదా ధనమును కోరి ఉపదేశించుట కూడ గురుపరిభవమే.

(ii) **<u>మంత్రపరిభవము:</u>** ఆచార్యుడు ఉపదేశించిన మంత్రార్థమును మరచి, మరల మరల అనుసంధించుటమాని దానియందు శ్రద్ధలేకుండుట <u>మంత్రపరిభవము</u>. తన బుద్ధికి తోచిన అర్థములను, దానికి అదే అర్థమనెడి భావముతో విపరీత అనగా భేదబుద్ధితో తెలుసుకొనుటకూడ మంత్రపరిభవమే!

(iii) **<u>దేవతాపరిభవము:</u>** అనగా సర్వేశ్వరుడు ప్రసాదించిన మనోవాక్కాయములను (త్రికరణములను) సర్వేశ్వరుని కైంకర్యమునకు కాకుండ ఇతర విషయములందు ఉపయోగించుట దేవతాపరిభవము.

మంత్రమునందు, దానిచేత ప్రతిపాదింపబడు దైవమునందు, ఆ మంత్రమును అనుగ్రహించిన ఆచార్యునియందు, ఈ మూడింటియందు ఎల్లప్పుడు గౌరవము కలిగి యుండవలెను. ఈ మూడింటిని ఆదరముతో సేవింపకుండుట దేవతాపరిభవము.

ఆచార్య ప్రీతికొరకు శిష్యుడు ఈ మూడింటిని వదలి, ఆచార్యుని విషయమున ఈ శరీరము అంతమగువరకు ఉపకారస్మృతి కలిగియుండవలెను.

ఆచార్య కటాక్షము వలన శిష్యునకు తొలగవలసిన దోషములు రెండు. శిష్యుడు తన గుణములను తాను భావించుట, భగవద్ భాగవత దోషములను తలచుచుండుట అను ఈ రెండు దోషములు ఆచార్య కటాక్షముచే తొలగును.

భగవానుడు పరతంత్రమైన ఈ ఆత్మకు అనాది కాలమునుండి వచ్చు కర్మను అనుసరించి రక్షింపలేక ఉపేక్షించి ఊరకుండును. భగవానుడు నిర్దయుడా

అనిపించును. కర్మానుభవమును అనుభవింప చేయుటయే ఆత్మకు ఉపకారము అని తలచవలెను. అందులకే భగవానుడు ఉపేక్షించి ఊరకుండును. ఇది తెలియక భగవానుడు నిర్దయుడని తలచుట భగవద్దోషము- భాగవతులను అహంకారగ్రస్తులుగా భావించుట భాగవత దోషము.

ఒకవేళ ఎన్నడైనను, ఎట్టి స్థితిలోనైనను, భాగవతులలో దోషము ఉన్నదని తోచినచో, అట్లు తోచుటకు కారణము వారిలో దోషము ఉండికాదు. తనలోని దోషమే. వారిని దోషము కలవారినిగా భావించుట తనదోషమే అని భావించవలెను.

దీనినే మహాత్మా కబీరదాసు కూడ మృదువుగా ఇలా చెప్పినాడు.

**''बुरा जो देखना मैं चला, बुरा न मिलिया कोय,**
**जो दिल खोजौ आपना, मुझ सा बुरा न कोय ।।''**

**"బురా జో దేఖ్‌నా మై చలా, బురా న మిలియా కోయ్,**
**జో దిల్ ఖోజౌ ఆప్‌నా, ముఝ్ సా బురా న కోయ్"**

(తెలుగు లిపిలో)

సంపూర్ణముగా దోషములే ఉన్నవ్యక్తి ఎవరైననూ ఉన్నారా? అని వెదకుటకు కబీరదాసు ప్రయత్నించాడట! ప్రతివానిలో ఏదో ఒకటైనను మంచి గుణము కనిపించినదట! చివరకు తన హృదయాన్నే పరిశీలించుకున్నాడట. అప్పుడు ఈ లోకంలో తనకంటె దోషములు కలవాడు ఎవడూ లేడని తెలిసిందట!

అనగా ఇతరుల దోషములను ఎన్నుటయే ఒక దోషము. అందుచేత ఎన్నడూ ఇతరుల దోషములను ఎన్నరాదు. మంచి గుణములనే గుర్తించి స్వీకరించుచుండవలయును అని భావము. "తప్పులెన్నువాడు తన తప్పులెరుగడు" అనేవి కదా వేమన కూడ చెప్పినాడు.



దోషము తన యందు లేనినాడు, గుణములే ఉన్ననాడు, భగవద్ భాగవత ఆచార్యుల విషయములో గుణములున్నవనియే తోచును. వారిలో దోషములు ఉండునని భావించిననాడు మనలో దోషములు ఉన్నట్లే భావింపవలెను.

భగవద్ భాగవత ఆచార్య గుణానుసంధానముచే కాలము గడుపువారికి తన గుణములను స్మరించుటకుగాని, ఇతరుల దోషములను ఎన్నుటకుగాని సమయమే లభింపదు.

సచ్ఛిష్యుడు ఇట్టి గుణములు కలిగియుండి సదా ఆచార్య కైంకర్యనిష్ఠుడై ఉండి తన స్వరూపమును ఉజ్జీవింప జేసుకొనవలయును.

# ఆచార్యప్రాశస్త్యము-సదాచార్యలక్షణములు

ఆచార్య ప్రాశస్త్యాన్ని ఎందరో మహానుభావులు ఎన్నివిధములుగానో గుర్తించి కీర్తించినారు.

**गुरु गोविंद दोउ खडे, काके लागूँ पाय ?**

(గురు గోవింద దోఉ ఖడే, కాకే లాగూc పాయ్) అని ఒకసారి మహాత్మాకబీరుకు సందేహం వచ్చిందట. చివరకు-

**गुरु तो गोविंद दिखाये, गोविंद खडे दिखाये ।**

(గురు తో గోవింద దిఖాయే, గోవింద ఖడే దిఖాయే) అని నిర్ణయించు కున్నాడట.

అంటే "గురువూ, గోవిందుడూ ఒకేసారి ప్రత్యక్షం అయితే మొదట ఎవరికి నమస్కరించాలి? అని సంశయం వచ్చిందట! చివరకు నాకు గోవిందుడు ఎవరో తెలియదు కదా అలాంటి గోవిందుని చూపించిన గురువుకే మొదట నమస్కరిస్తాను అనుకొని నమస్కరించినాడట కబీరదాసు".

ఇలా ఆధ్యాత్మిక ప్రసంగాలలో, భగవత్‌సాక్షాత్కార విషయంలో కాని, ఆ సాక్షాత్కారానికి మూలమైన మంత్ర, మంత్రార్థాలను తెలిపి, ఆత్మ స్వరూపం ఉజ్జ్వలం కావటానికి సహాయపడే మహానుభావుడు ఆచార్యుడే అనేది సుస్పష్టం.

ఆచార్యునకు పరమాత్మ పరతంత్రుడై యుండును. ఆచార్యుడే ఆత్మజ్ఞాననిష్ఠను తొలగించి, చేతనునకు భగవదనుభవమును కలిగించును. శ్రవణ, మనన, నిధి, ధ్యానములచే భగవత్ సాక్షాత్కారము నొందిన భక్తుల యొక్క సహవాసము కలిగించును. తద్ద్వారా సాత్త్వికమగు చిత్తవృత్తిని కలిగించును. దీనివలన ఆచార్య సమాశ్రయణమునకు అర్హత లభించును. తరువాత ఆచార్యుని ఆశ్రయించి, వారిద్వారా తిరుమంత్రమును పొంది ఆ మంత్రముచే ప్రతిపాదింపబడు భగవానుని ఎరుగును. ఆ భగవానుని ఆశ్రయించిన భాగవతుల అభిమానమును ఆర్జించుకొనుటే తన జీవిత లక్ష్యమని భావించును.



ఆచార్యునకు మూడు లక్షణములు ఉండవలెను. పరమాత్మకు విధేయుడై ఉండవలెను. 2. జీవులను పరమాత్మవద్దకు మరలింపగలవాడై ఉండవలయును. 3. జీవుల వేదనను చూచి ఓర్వలేనంత ఉదారుడై ఉండవలయును. ఇట్టి గుణములు కలిగియుండి ఆత్మకు పోషకమైన పరిపూర్ణ బ్రహ్మానుభవమును ఆహారముగా ఇచ్చువాడై ఉండవలయును.

తిరుమంత్ర ప్రతిపాద్యమగు, పరతత్త్వమగు శ్రీమన్నారాయణుని ఎరిగి, వానికే చెందినవారమని భావించుట శ్రేష్ఠము. అంతకంటె కూడ సర్వేశ్వరుని భక్తులకు చెందినవారమని భావించుట శ్రేష్ఠతరము. ఇదే మంత్రార్థసారము. అష్టాక్షరీమంత్రముచే భగవత్ శేషత్వమును ఎరుగుటకంటె భాగవత శేషత్వమును ఎరుగుట ప్రధానము అని మంత్రార్థసారము తెలియజేయును. భగవంతుడగు నారాయణునకే చెందినవాడను అనుట మంత్రార్థము. భాగవతులకే చెందినవారము అనుట మంత్రార్థసారము. భాగవతుల ద్వారానే భగవంతుని సేవించవలయును అనునది సంప్రదాయము. ఇట్టి విషయమును ఎరిగించువాడు ఆచార్యుడే! అందులకే మన విశిష్టాద్వైత సంప్రదాయములో ఆచార్యునకు ఎంతో ప్రాశస్త్యము ఉన్నది. ఆచార్య సమాశ్రయణము చేతనే మంత్రప్రాప్తి, మంత్రార్థ జ్ఞానము, మంత్రార్థసారమగు భాగవత శేషత్వము కలుగును. అప్పుడే చేతనుడు తరించును- అను ఈ విషయము ఆచార్యునివలననే లభించును.

తన వద్దకు ఉజ్జీవనమును కోరి చేరిన శిష్యునకు, ఆ శిష్యుడు మంత్ర మంత్రార్థములను పొంద గోరుచున్నాడు కనుక, అతనికి వాటిని ఉపదేశించి, వారు ఉజ్జీవించుటకు అవశ్యకమైన హితమును ఆచార్యుడు ఉపదేశింపవలెను.

ఇట్లు మంత్రమును ఉపదేశించునపుడు ఆచార్యుడు తనను ఆచార్యునిగా భావింపరాదు. తాను ఉపదేశించువాడను అని భావించుట అపచారము. తన ఆచార్యుడే వారికి ఉపదేశించుచున్నాడని భావింపవలెను. తాను కేవలము తన ఆచార్యునకు ఒక పనిముట్టువలె ఉన్నానని భావింపవలెను.

ఉపదేశమును పొందు శిష్యుని తన శిష్యునిగా భావింపరాదు. తన ఆచార్యునకు ఇతడు కూడ శిష్యుడు అని భావింపవలెను.

ఉపదేశించునపుడు ఆ ఉపదేశమునకు ఫలము, తనతో పాటు భగవానునకు మంగళాశాసనము చేయునపుడు తనకు తోడుగా మరొక వ్యక్తి దొరకినాడని భావింపవలెనేకాని, అతడు సమర్పించు ధనమునుకాని, శుశ్రూషను కాని ఫలముగా భావింపరాదు.

శిష్యుని ఉజ్జీవనమునకై తాను ఉపదేశించుచున్నానని ఆచార్యుడు భావింపరాదు. శిష్యునకు వారు ఉపదేశించుట భగవత్కైంకర్యమే అని కూడ భావింపరాదు.

ఇట్లు అన్నివిధములుగ తాను తన ఆచార్యునకు ఉపకరణముగానే ఉంటినని భావింపవలెను కాని, తానొకవ్యక్తిగా, తాను చేయుచున్నట్లుగా భావింపరాదు.

ఆచార్యుడు, ఆచార్య పరతంత్రుడై, తనను ఆచార్య పరతంత్రుడుగానే భావించి, తన ఆచార్యుడు తనకు లభింపచేసిన శిష్యుడు ఈతడు అని భావించుటచే ఆచార్యత్వము సిద్ధించును. ఈ విధముగా తనను ఆచార్యునిగా భావింపక, శిష్యుని తన శిష్యునిగా భావింపక, ఫలము మంగళాశాసన పరుడగుటయే అని భావించిననాడు భగవానుడు "ఇతడు ఆచార్యుడు" అని భావించును. అప్పుడు ఈ ఆచార్యునకు "ఆచార్యత్వము" సిద్ధించును. తనకు సాక్షాత్ఫలము తాను మంగళాశాసనపరుడగుటయే!

ఈ విధముగ ఉపదేశించు ఆచార్యుడు, తాను ఉపదేశించువాడను కానని, తన ఆచార్యుడే ఆచార్యుడని భావించి ఉపదేశింపకపోయినచో అతనికి "ఆచార్యత్వము" సిద్ధింపదు. తానే ఉపదేశించుచున్నానని ఉపదేశించిననాడు "ఉపదేశసిద్ధి" లేకపోవుటచే ఉపదేశపాత్రుడైన శిష్యునకు కూడ శిష్యత్వము సిద్ధింపదు.



ఇక్కడ మనకు ఒక సందేహము కలుగును. ఆచార్యుడు ఒక శిష్యునకు ఉపదేశించునపుడు తనను ఆచార్యునిగా భావింపనిచో శిష్యునకు దృష్టఫలము, ఉజ్జీవనము, భగవత్ కైంకర్యము, సహవాసము– అనెడి నాలుగుసిద్ధులు ఎట్లు సిద్ధించును? అని సందేహము కలుగును. కాని ఇట్టి సందేహము కలుగ నవసరము లేదు.

(1) శిష్యుడు, శేషత్వమే తన స్వరూపమని ఎరుగుటచే, ఆచార్యులకు తాను ఏమియు చేయకపోయినచో తనకు స్వరూపము సిద్ధించదని, తన స్వరూప లాభమునకుగాను, ఆచార్యులకు ధనమును సమర్పించుట, శుశ్రూషచేయుట మున్నగునవి చేయును. ఇది **"<u>దృష్టఫలము</u>".**

(2) శిష్యునకు **"<u>ఉజ్జీవనము</u>"** భగవత్ సంకల్పముచే సిద్ధించును. ఆచార్య సమాశ్రయణము చేయించి, ఆచార్యుడు ఉపదేశము చేయునట్లు చేసి, ఈ సంసారము నందు శిష్యుడు ఉజ్జీవించునట్లు భగవానుడే తన సంకల్పము చేయును. కాని ఆచార్యుడు సంకల్పించుటవలన కాదు.

(3) ఆచార్యుడు మంత్రోపదేశము చేసి శిష్యుని మంగళాశాసనము చేయుటకు యోగ్యునిగా తయారుచేయుట తనప్రీతికే (భగవాని ప్రీతికే) కాని ఆచార్యుని ప్రీతికి కాదు. ఆచార్యుని ప్రయత్నముచేత కాదు. సర్వేశ్వరుడే దానిని తన **"<u>కైంకర్యము</u>"** గ స్వీకరించును.

(4) అనాదికాలము నుండి అహంకార మమకారములతో రూపుమాపియున్న నన్ను అంగీకరించి, తెలియని వానిని తెలిపి, మంగళాశాసనమునకు యోగ్యునిగా చేసిన ఉపకారకుడు ఆచార్యుడు అని ఉపకారస్మృతిచే, ఉపదేశమును పొంది తరించిన శిష్యుడు ఒక్క క్షణము కూడ ఆచార్యుని వదలి ఉండలేడు. అందుచే **"<u>సహవాసము</u>"** సిద్ధించును.

ఆచార్యునకు ముఖ్యముగా రెండు గుణములు ఉండవలెను. శిష్యుని యందు జాలిపడి ఉపదేశించుటకు తగిన "కృప" ఉండవలయును. అట్లే తన ఆచార్యునకు తాను ఒక "పరికరము" అని భావించవలెను.

జాలిపడి కృపచే ఆచార్యుడు ఉపదేశించుటచేత, శిష్యునకు రోజురోజునకు విశదమైన జ్ఞానము కలిగి శిష్యునిగా పొందగలిగిన ఫలము సిద్ధించును. ఆచార్యుడు, తన ఆచార్యునకు తనను ఒక పరికరముగా భావించుట చేత "తాను ఉపదేశించుచున్నాను" అను అహంకారము కలుగదు. కనుక ఆచార్యస్వరూపము సిద్ధించును.

ఆచార్యునకు మరికొన్ని గుణములు కూడ ఉండవలయును:

(1) ఆచార్యుడు యోగ్యుడైన శిష్యునకు ప్రియమును, హితమును చేకూర్చవలెను.

(2) లీలావిభూతియొక్క స్వభావముచే శిష్యుని మనసులో ఏ విధమగు కలత రాకుండా ఉండవలయునని ఆచార్యుడు సర్వేశ్వరుని ప్రార్థించి శిష్యునకు హితమును కలుగచేయవలమును. సర్వకాలములయందు ఆచార్యుడు శిష్యుని కనిపెట్టుచుండవలెను.

(3) ఆచార్యుడు పరమకృప కలవాడగుటచే తన శిష్యుడు సంసారము నుండి ఉత్తీర్ణుడై ఉజ్జీవింపవలెనని దృఢముగ భావించుచుండవలెను.

(4) అప్పుడప్పుడు ఆచార్యుడు శిష్యుని నిగ్రహించుచుండును. అట్లు నిగ్రహించుట శిష్యుడు తప్పుదారిలో ప్రవర్తింపకుండుటకే. కావున అది హితరూపమే.

(5) ఆచార్యుడు శిష్యుని ఉజ్జీవింప చేయుటయే తనకు ప్రధానమని భావించవలెను. భావించును. అందుచే శిష్యునియెడల ఆయనకు కోపము ఉండదు. శిష్యుడు ఏ విధమైన దోషము చేయకూడదనియే ఆచార్యుని భావన.

(6) ఆచార్యుడు శిష్యుని ఆత్మస్వరూపమును కాపాడుచుండవలయును. ఇది ఆచార్యునకు స్వరూపమే. ఇందువలన భగవానునికి ఆచార్యునిపై ప్రీతి కలుగును. ఇది భగవత్ కైంకర్యమే అగును. అట్లు ఉండనినాడు స్వరూపహాని జరుగును.

(7) ఆచార్యుడు శిష్యుని ఆత్మరక్షణము చేయునప్పుడు, వీనిని నేనే దిద్దుబాటు చేయుచున్నానని భావించరాదు. అట్లు భావించినచో అది అహంకారము అగును. ఈ అహంకారము ఆచార్యలక్షణమునకు విరుద్ధము.



(8) ఆచార్యుడు తాను ఉపయోగించుకొను ద్రవ్యమును శిష్యునిది అని భావించకుండా తనదే అని భావించవలెను. కాని శిష్యునిది అని భావింపరాదు. ఎందుకనగా ఉపదేశసమయమున శిష్యుడు తన సర్వస్వమును ఆచార్యునకు సమర్పించినాడు కదా!

(9) ఆచార్యుడు తన వస్తువునే తాను శిష్యునివద్దనుంచి స్వీకరించుచున్నానని భావించవలెను. ఇట్లు భావించనినాడు శిష్యాచార్య సంబంధము చెడిపోవును.

(10) శిష్యుడు నాది అని భావించిన వస్తువులను స్వీకరింప అవసరము లేని పరిపూర్ణత కలవాడు ఆచార్యుడు. తన సర్వస్వమును ఆచార్యునకు సమర్పించిన తరువాత ఇక శిష్యునివద్ద తనది అని భావించుటకు వస్తువే ఉండదు కదా! అందుచేత శిష్యుడుఇచ్చుట, ఆచార్యుడు స్వీకరించుట అను సమస్యే ఉత్పన్నముకాదు. అందుచే ఆచార్యుడు పరిపూర్ణత కలవాడైనాడని భావము. అట్టి పరిపూర్ణత కలవాడగుటచే ఆచార్యునకు ఆచార్యత్వము జీవించును.

ఇట్టి సద్గుణములు కలిగినవాడే సదాచార్యుడు. సంసారబంధమును పూర్తిగా తొలగించెడి "తిరుమంత్రము"ను ఈ ఆచార్యుడే ఉపదేశించును. అట్లు ఉపదేశించినవారికే "ఆచార్యత్వము" సిద్ధించును. ఇదియే ఆచార్యప్రాశస్త్యము.

# చరమపర్వనిష్ఠావైభవము

## (ఆచార్య వైభవము)

మోక్షోపాయములలో చరమోపాయము ఆచార్యాభిమానము. చేతనుల స్వరూపమునకు అనగా శేషత్వమునకు ప్రాప్యమగు భగవత్ కైంకర్యమునకు ఆ ఆచార్యాభిమానము అనురూపమైనది. పూర్వాచార్యులు కూడ సదాచార్య సమాశ్రయణమే శరణము అని కృపచేసినారు. బంధ మోక్షములను కలిగించు "శ్రియఃపతి" కంటె కేవల మోక్షమునే (మోక్షమునొక్కదానినే) కలిగించు ఆచార్యునే ఉపాయముగా స్వీకరించు వారికి భయము ఎన్నడును ఉండదని కృపచేసినారు.

"ప్రథమపర్వము" అనగా భగవంతుడే ఉపాయమని నమ్మి సర్వేశ్వరుని ఆశ్రయించుట; ప్రాప్యము, ప్రాపకము భగవానుడే అని భావించుట. "మధ్యమపర్వము" అనగా భాగవతాభిమానము కలిగియుండి దీనివలననే భగవత్ ప్రాప్తికలుగునని భావించుట. "చరమపర్వము" అనగా చిట్టచివరి ఉపాయము. ఇది ఆచార్యాభిమానమే.

భగవదను, భవలబ్ధ భక్తిరూపాపన్నజ్ఞానమును పొందిన "శ్రీ నమ్మాళ్వారులు" "మయర్వఱ మదినలమ్ అరుళ్పెత్తు" అని సాయించి, ఆర్తిచేత పరవశులై ఆనందముగా ఉన్నప్పుడు భగవద్దాస్యము వృద్ధిపొందవలెనని, భాగవతుల పాదధూళి గంగాజలము కంటెను పవిత్రమైనదనియు చెప్పినారు. అట్టి ఆళ్వారులకు భగవదనుభవము కలుగక క్లేశము కలిగిననాడు ఆ భాగవతులను ప్రాపకములుగా తలచి "నేను భగవానుని దర్శించునట్లు చేయుడు" అని ఆర్తిపరవశుడై సర్వేశ్వరుని గూర్చియే చెప్పినారు. ఇట్లు భగవదనుభవము లభించినపుడు ఒకమాట, భగవదనుభవము లభించనపుడు వేరొకమాట ఆళ్వారుల నోటినుండి వచ్చుచుండును. వీరివలెనే పదిమంది ఆళ్వారులు కూడ భాగవత ఆచార్యాభిమానమే ప్రధానమని భావింపక ప్రథమ పర్వము నందే ఎక్కువ నిష్ఠగలిగి తమసూక్తులను కృపచేసినారు. కావున వీరి సూక్తులలో చరమపర్వనిష్ఠ ప్రధానమని నిర్ణయింపబడలేదు.



చరమపర్వనిష్ఠయే ప్రధానమని, ఆచార్యాభిమానమునే ప్రధానముగా భావించినవారు "శ్రీ మధురకవులు". వారి శ్రీసూక్తిని అనుసరించియే ఈ ఆచార్యాభిమానముయొక్క వైభవమును ఎరుగవలెను. "కణ్ణినుణ్ శిఱుత్తామ్బు" లో "మేరినేర్ అవర్ పొన్నడి, తేవు మత్తఱి యేర్"– అనగా "మా ఆచార్యులన నమ్మాళ్వారులు శ్రీచరణమునే ప్రాప్యము, ప్రాపకము అని పూర్తిగా ఆశ్రయించినవాడను"–"నారినాల్ నవిత్తు ఇమ్బు మొయిదినేర్" అనగా "వారి నామమును, గుణములను కీర్తించి ఆనంద నిర్భరుడనైనవాడను". అని కృపచేసినారు.

"మధురకవి యాళ్వారులు" చరమపర్వనిష్ఠులు. వారు ఎల్లప్పుడు ఆనందముతో పరవశించి పలుకుటయే తప్ప, ఆనందము లభింపక దుఃఖములో ఉండువారు కారు. వీరి శ్రీసూక్తి "కణ్ణినుణ్ శిరుత్తామ్బు" దీనినిబట్టి చరమ పర్వవైభవమును తెలుసుకొన దగును.

స్వరూప, ఉపాయ, పురుషార్థములను మనము ఎరుగవలెను. "స్వరూపము" శేషత్వము. నిష్కృష్టమైన శేషత్వము "భాగవతశేషత్వము". అట్లే "ఉపాయము" సర్వేశ్వరుడే. నిష్కృష్టమైన ఉపాయము "ఆచార్యుడే." పురుషార్థము "కైంకర్యము". నిష్కృష్టమైన కైంకర్యము "ఆచార్యుని ముఖవికాసమునకు కలిగించు వ్యాపారములు".

తదీయ శేషత్వమే (భాగవత శేషత్వమే) ఆత్మ స్వరూపము. దానిని పరిశీలించి ఆలోచించినచో "భగవత్ కైంకర్యము" ప్రథమావధి "అనియు, "భాగవతకైంకర్యము" మధ్యమావధి అనియు తెలియును. ఈ విధముగ ఆత్మస్వరూపము తదీయశేషత్వమని, ప్రాప్యము తదీయ కైంకర్యమని, తదీయులే ఉపాయమనెడు తత్త్వజ్ఞానమును తెలియచేసిన మహోపకారకుడు ఆచార్యుడే. అట్టి ఆచార్యునకు శేషభూతుడై ఉండుటయే ప్రధానము. కనుక "ఆచార్యశేషత్వము" స్వరూపజ్ఞానములో "చరమావధి".

ఆళ్వారుల తిరువడిగళ్లయందు శ్రీ మధురకవులవలె ప్రాప్యము, ప్రాపకము ఉండికూడ "ఎంబెరుమానార్ (ఉడయవరులు) తిరువడినళేశరణం" అనెడి ప్రతిపత్తితో ఉండెడివారు "వడుగనంబి" "ముదలియాండాన్" మరియు "కూరత్తాళ్వారు" అనువారు.

"వడుగనంబి"– "ఎంబెరుమానార్ తిరువడిగళే శరణం" అను విశ్వాసముతో ఉండువారు. "కూరత్తాళ్వారు" ఎంబెరుమానార్లకు నీడవలె, పాదరేఖవలె ఎన్నడును వదలకుండ ఆశ్రయించినవారు. "ముదలి యాండాన్" కూడ కూరత్తాళ్వారు వలెనే ఉండువారు. కూరత్తాళ్వారు మరియు ముదలి యాండాన్ అను వీరిద్దరు అప్పుడప్పుడు పెరుమాళ్లను కూడ ఆశ్రయించుచుండెడివారు. కాని "వడుగనంబి" మాత్రము అట్లుకాదు. అందుకే మిగిలిన వారిద్దరిని "రెండు పడవలమీద కాలు వేసినవారు" అనెడివారట!

ఆత్మకు శేషత్వమే ప్రధాన లక్షణము. అట్టి ఆత్మకు పురుషార్థము కైంకర్యమే. ఆచార్యముఖవికాసమునకే భగవత్ కైంకర్యము చేయుట ప్రథమపర్వము". ఆ భగవానునకే ప్రియమును కలిగించుటకై చేయు భాగవత కైంకర్యము "మధ్యమపర్వము". ఆచార్య కైంకర్యము "చరమపర్వము". ఈ విధముగ చూచినచో ఏ కైంకర్యమైనను ఆచార్య కైంకర్యమే ప్రాప్యమని తెలియుచున్నది.

ఆచార్యకైంకర్యము చరమపర్వమే. ప్రధానమైనదే. అయితే అది లభించుట ఎట్లు? అని ఆలోచన వచ్చును. ఈ ఆచార్యకైంకర్యము లభించుట కష్టమే.

విషయ ప్రావణ్యముగల చేతనుడు ఆ విషయవాసనలను వదలలేక, వానియందే ఆనందించుచుండును. వీటిని వదలలేక బాధపడుచుండును. అట్లే భగవత్ కైంకర్యమును విడచి ఆచార్యకైంకర్యము చేయవలయునని సిద్ధపడుటకు గూడ బాధపడును. ఆత్మ పొందవలసిన ఫలములలో భగవత్ కైంకర్యము కంటె ఆచార్య కైంకర్యము లభించుట చాలకష్టము.



విషయవాసనలపై చేతనునకు వ్యామోహము కలిగియుండి, వాటియొక్క పైపై విషయములను చూచి మొదట అనుభవించినను, తరువాత వాటివిషయములో వాటికిగల దోషములను గమనించి, తాను అనుభవించు విషయములు అల్పములని తెలుసుకొనును. వాటిపై ఏవగింపు కలుగును. అందువలన తన మనసును విషయప్రావణ్యము నుండి మరల్చును.

కాని, భగవత్ కైంకర్యము విషయప్రావణ్యమువంటిది కాదు. భగవానుడు విలక్షణమైన దివ్యమంగళ విగ్రహము కలవాడు. సమస్త కల్యాణ గుణములు కలవాడు. వాని సేవ "ఇంతది" అనికాని "ఇట్టిది" అనికాని చెప్పుటకు శక్యము కానిది. దోషదర్శనమను ప్రసక్తియే లేదు. అందుచేత భగవత్ కైంకర్యమును వీడి ఆచార్యకైంకర్యమునకు వచ్చుటకు అవకాశమే లేదు. ఇక ఎట్లు?

అయితే, తన విషయములో భక్తి కలవాడికి, తన సంశ్లేషసుఖమును అవిచ్ఛిన్నముగా కలిగింపక, తన విశ్లేషదుఃఖమును కూడ సర్వేశ్వరుడు కలిగించుచుండును. అది భగవానుని దోషమని అప్పు డప్పుడు చేతనుడు భావింపవచ్చును.

కాని, లోకరీతిని బట్టి దోషమును విడువ తగినదిగాను, గుణమును స్వీకరింప తగినదిగాను భావింపవచ్చును. కాని భగవద్విషయములో మాత్రము ఇది లోకవిపరీతముగ ఉండును. భగవంతుని యందలి దోషములు, అనగా విశ్లేషము కలిగించి దుఃఖింపచేయుట మొదలైనవి భగవంతునిపై మరింత ప్రేమనే వృద్ధిచేయును.

భగవానుడు నిర్దయుడునుకాడు. దయాగుణ సంపన్నుడు. నిత్య సౌందర్యసంపన్నుడు. భగవానుని ఈ గుణములు పురుషార్థనిష్ఠకు చివరిదైన ఆచార్యకైంకర్యమునందు, మధ్యమ పురుషార్థమైన భాగవతకైంకర్యమునందు మనసు లేకుండా చేయును.

కాని, స్వరూపానురూపమైన ప్రాప్యము చరమపర్వమైన ఆచార్య కైంకర్యమే. ప్రాప్యము, ప్రాపకము ఒకటే అనునది సిద్ధాంతము. దీనినిబట్టి

చరమప్రాప్యము ఆచార్య కైంకర్యమే అయిననాడు దానికి తగిన ప్రాపకము అనగా ఉపాయము కూడ ఆచార్యుడే అగును.

దీనిని "తిరువరంగత్తి ముదనారు" అనువారు తమ "ఇరామానుశ నూత్తన్దాది" లో–"పేఱొన్ఱు మత్తిల్లైనిన్ శఱనాన్ఱి" అనినారు. అనగా "రామానుజా! నీ చరణములే నాకు పరమ **"ప్రాప్యము"**, దానిని పొందుటకు నీ పాదములే తప్ప వేరొక **"ఉపాయము"** లేదు అనినారు. కావున ప్రాప్యప్రాపకముల ఐక్యములో ఏ మాత్రము భిన్నత్వములేదు.

సర్వేశ్వరుని ఉపాయముగ స్వీకరించుట, మరొకవైపు ఆచార్యుని ఉపాయముగ స్వీకరించుట ఎట్లు సంభవించును? అని ఆలోచన రావచ్చును. ఆచార్యుడు సర్వేశ్వరుని కంటె వేరుకాదు. సర్వేశ్వరుని ఉపాయముగా స్వీకరించుట, చేయిపట్టుకొని ప్రార్థించి తమ కార్యమును నెరవేర్చుకొనుట. ఆచార్యుని ఆశ్రయించి తన ప్రాప్యమును పొందుట కాళ్ళుపట్టుకొని తన కార్యమును నెరవేర్చుకొనుట.

సర్వేశ్వరుని శ్రీచరణములే ఆచార్యులు. ఆచార్యుని ఆశ్రయించుట అనగా సర్వేశ్వరుని శ్రీచరణములను పట్టుకొని తమ పురుషార్థమును పొందుటకు యత్నించుట అని ఎరుగవలెను. ఆచార్యులు సర్వేశ్వరుని శ్రీపాదస్థానీయులు. శ్రీపాదములను ఆశ్రయించినచో, స్వామి తన స్వాతంత్ర్యమును చూడజాలక తప్పక రక్షించును. "వీడు కాళ్లు వదలునట్లు లేదు" అనుకొని అతని కార్యమును నెరవేర్చును. ఇట్లు ఆచార్య కైంకర్యమే భగవత్ కైంకర్యమని చేతనుడు భావించి ఆచార్యుని ఆశ్రయించును.

ఇట్లు ఆచార్యుడే సర్వేశ్వరుని కంటె అధికుడు అని తెలియుచున్నది. అంత ఎందుకు? ఈ విషయము సర్వేశ్వరునకు కూడ తెలియును. అందులకే సర్వేశ్వరుడు తాను ఆచార్యుడను అయిన బాగుండునని తలచుచుండును. అవకాశము వచ్చినప్పుడు ఆచార్యుడు అగును.



గురుపరంపరలో "ద్వయమంత్రము" ను ఉపదేశించి ఆచార్యుడైనాడు. "శిష్యస్తేஉహం" అని అర్జునుడు ప్రార్థింపగా తాను ఆచార్యుడై, భగవద్గీతలో దేహాత్మవివేక వివరణ మొదలుకొని "చరమోపాయము" వరకు ఉపదేశించినాడు. "మామేకం శరణం వ్రజ" అని అంతిమోపాయనిష్ఠను ఉపదేశించినాడు. ఇట్లు సర్వేశ్వరుడు కూడ ఆచార్యత్వముయొక్క ఘనతను చూచి, ఆశపడునని ఆచార్యవైభవము తెలియజేయుచున్నది.

లీలావిభూతి, నిత్యవిభూతి అను రెండు విభూతులును ఆచార్యానుగ్రహము ఉన్నచో శిష్యునకు సులభముగా సాధింప తగినవై ఉండును. ఆచార్యుడు చేసిన అట్టి ఉపకారమునకు ప్రత్యుపకారము చేయుట సాధ్యముకాదు. ప్రత్యుపకారము చేయవలయునన్నచో లీలావిభూతి, నిత్యవిభూతి అను రెండింటి కంటె మించినవి శిష్యుని వద్ద ఉండవలయును కదా! ఇది సాధ్యము కాదు కనుక ప్రత్యుపకారము చేయుట సాధ్యము కాదు.

సర్వేశ్వరుడు బంధ, మోక్షములను ప్రసాదించువాడు కాని ఆచార్యుడు అట్లుకాక, నిరతిశయకృప కలవాడగుటచేత చేతనుడు అనుభవించుచున్న కర్మనుచూచి, అతనిని సంసారములో పడవైచి శిక్షింపజాలడు. వానిని సంసారము నుండి విడివడుటకే సహాయపడును. కావున సర్వేశ్వరుని కన్న ఆచార్యుడే మహోపకారకుడు. భగవానునకు తానుచేయు మంగళాశాసనములో తనకు సహాయభూతుడుగా ఉండవలెనని ఆచార్యుడు శిష్యుని అంగీకరించును. కావున భగవత్ప్రాప్తి ఆచార్యునివలననే లభించును. ఉండవలసిన జ్ఞాన, భక్తి, వైరాగ్యములు ప్రధానముగా చేతనునకు ఉండవలసిన ఆత్మగుణములు. అట్టి ఆత్మగుణములు ఆచార్య సంబంధము చేతనే కలుగును. ఆచార్య సంబంధము లేనినాడు, జ్ఞాన భక్తి వైరాగ్యములున్నను, అవి లోకనిందకు మాత్రమే ఉపయోగపడును కాని అలంకారములు కావు. ఆచార్య సంబంధము లేనినాడు ఆత్మ, నీటితో సంబంధములేని తామరపువ్వువంటిది. ఆ పువ్వు

వికసింపదు. ఆచార్య సంబంధము లేనినాడు ఆ సంబంధమువలననే కలిగిన భగవత్ సంబంధము కూడ లేకుండ పోవును.

ఆత్మ ఉజ్జీవించుటకు సర్వేశ్వరుడు, ఆచార్యుడు ఇద్దరితో సంబంధము ఉండవలెను అని మనకు తెలిసినది. అయితే మధ్యలో భగవత్ సంబంధము ఎందుకు? అనిపించును. ఆచార్యునితో చేరుటకు భాగవత సమాశ్రయణము ఉండవలెను. ఇట్లు భాగవతులతో కలియుటకు కూడ సర్వేశ్వరుడే కారణము.

చేతనుడు తీగవంటివాడు. ఆచార్యుడు పందిరివంటివాడు. ఆ పందిరి ఎక్కుటకు అమర్చిన ఆధారము (చెట్టుమండలు, కందిమండలు మొదలైనవి) వంటివారు భాగవతులు. భగవంతుని చేరుటకు ఆచార్యుడు, ఆచార్యుని చేరుటకు భాగవతులు కావలెను. తనను చేరుటకు భగవానుడే ఈ క్రమసోపానములను ఏర్పరచినాడని మరువరాదు.

పరతత్త్వము, అంతర్యామి మొదలగు పర, వ్యూహ, విభవ, అంతర్యామి, అర్చావతార రూపములలోనున్న స్వామిని సేవించుట కష్టము. కావున సాక్షాత్తుగా కనబడుచు, నడయాడుచున్న ఆచార్యుని ఆదరముతో సేవించి పాత్రులైన వారే సులభముగా సంసారమును తరింతురు.

స్వతంత్రులను, దేవతాంతర పరతంత్రులను తనకు సహాయము చేయ తగనివారిని ఆచార్యాభిమాననిష్ఠులు వదలవలెను. ఇట్టి చరమపర్వనిష్ఠులు నిషిద్ధానుష్ఠానము చేయరాదు. అనేక అనర్థములకు మూలమైన విహిత భోగములను కూడ నిషిద్ధ భోగములను వలెనే విడువవలెను. అట్లు కానిచో ఆత్మస్వరూపము నశించును.

ఆచార్యునిచేత అభిమానింపబడి తరించినవారును, తామే ఆచార్యుని అభిమానించి తరించినవారును– వీరిద్దరును తప్పక ఫలమును పొందెదరు. ఇదియే "స్వగతస్వీకారము".



"నా తండ్రి అయిన పెరియాళ్వారులను అనుగ్రహించిన స్వామి, ఆయన యొక్క పుత్రికనైన నన్ను తప్పక స్వీకరించును" అని "ఆండాళ్" తల్లి భావించినది. ఇది "పరగతస్వీకారము".

ఈ రెంటిలో దేనిని అనుసరించినను చేతనుడి ఆత్మస్వరూపము ఉజ్జ్వలమగును.

భగవత్ప్రాప్తికి ప్రతిబంధకమైన పాపమును పోగొట్టుటకును, భక్తిని వృద్ధి పొందించుటకును ఎట్లు "ప్రపత్తి" తగినదై యుండునో అట్లే ఆచార్యాభిమానము అనునది కూడ ఇతరోపాయములకు అంగముగను స్వతంత్రోపాయముగను ఉపకరించును.

కర్మ, జ్ఞానములచే పరిశుద్ధమైన అంతఃకరణము కలవానికి కలుగునది "భక్తి". ఈ భక్తితో భగవత్ప్రాప్తి కలుగవలెనన్న స్వప్రయత్నము ఉండవలెను. భక్తిని పొందుటకు వెనుకకు తగ్గినవారికి "ప్రపత్తి" తగిన ఉపాయము. ప్రపత్తిలో తాను ఏ వ్యాపారము చేయకుండా ఉండవలెను. సర్వేశ్వరుడే ఉపాయమని దృఢమైన విశ్వాసము కలిగియుండుటయే ప్రపత్తి కదా!

కాని, అట్టి విశ్వాసము కలుగుట చాల కష్టము. కాబట్టి ఆచార్య అభిమానమే నిశ్చయముగా ఉపాయము అనునది నిశ్చయము.

"భక్తి" దుష్కరము. స్వరూపవిరోధికూడ. "ప్రపత్తి" ఆచరింపవలసినదే! కాని దృఢమైన విశ్వాసము సర్వేశ్వరునిపై కలుగుట కష్టము. కాబట్టి ఇదికూడా అందరికి అంత సులభముకాదు. అందుచేత సులభతమము అయినది ఆచార్యాభిమానమే. "ప్రపత్తి" చేయలేని పశుపక్ష్యాదులకు గూడ ఆచార్యాభిమానమే ఉత్తారకము. అనగా భక్తిని సాధించుటకు శక్తి లేనివారికి ప్రపత్తి, ప్రపత్తి చేయలేని వారికి ఆచార్యాభిమానము స్వతంత్రమైన ఉపాయము. ఇట్లు చరమోపాయము ఆచార్యాభిమానమే.

ఆచార్యాభిమానము చేతనే ''ప్రణవము'' లో చెప్పబడిన "అనన్యార్హశేషత్వము"; "నమః" పదములో చెప్పబడిన "అనన్యశరణత్వము" ; "నారాయణాయ" అను పదములో చెప్పబడిన "అనన్యభోగ్యత్వము" అను ఈ మూడును లభించును. ఇవి ఆత్మకు ఉండవలసిన లక్షణములు.

ఈ విధముగ ఆచార్యాభిమానము, "తిరుమంత్రము" లో చెప్పబడిన మూడు లక్షణములను కలిగించి ఉజ్జీవింపజేయును. ఆత్మోజ్జీవనము కావించును. "ద్వయమంత్రము", "చరమశ్లోకము" ఈ మంత్రరాజమైన అష్టాక్షరియొక్క వివరణ రూప మంత్రములే అని మనకు తెలియును కదా!

అందుచేత చరమోపాయనిష్ఠ అనగా ఆచార్యాభిమానమే "చరమసీమ" అని నిరూపించినారు మనపెద్దలు. ఇదే "ఆచార్యవైభవము".